
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 86
శనివారం 17-6-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



ఈ స్నేహాలే ఇప్పుడు కావలసింది

పేపర్ తెరిస్తే ఘోర వార్తలు. రక్త సంబంధాల మధ్య కూడా కక్షలు. ఇటువంటి సమయంలో ఒక ట్విటర్ పోస్ట్ చాలామందికి హాయినిచ్చింది. 'గాయత్రీ... ఇడ్లీలు చేశా. ఇంటికి రా' అని తన పొరుగింటివారు పెట్టిన వాట్సప్ మెసేజ్‌ను మైసూర్‌కు చెందిన ఒక మహిళ షేర్ చేస్తూ తమ కాలనీలో ఎంత స్నేహంగా ఉంటారో చెప్పింది. ఇప్పుడు అలా ఉంటే బాగుంటుందంటూ అంతా రెస్పాండ్ అవుతున్నారు. -IIలో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 17-6-2023

ఇరుగు పొరుగు



ఈ స్నేహాలే ఇప్పుడు కావలసింది

పేపర్ తెరిస్తే ఘోరమైన వార్తలు. రక్త సంబంధాల మధ్య కూడా కక్షలు, కార్పణ్యాలు. మానవ సంబంధాలపై విశ్వాసం పోయేలా సంఘటనలు. ఇటువంటి సమయంలో ఒక ట్విటర్ పోస్ట్ చాలామందికి హాయినిచ్చింది. 'గాయత్రీ... ఇడ్లీలు చేశా. ఇంటికి రా' అని తన పొరుగింటివారు వాట్సప్ మెసేజ్ పెట్టిన సంగతిని మైసూర్‌కు చెందిన ఒక మహిళ షేర్ చేస్తూ తమ కాలనీలో అందరూ ఎంత స్నేహంగా ఉంటారో చెప్పింది. 'ముప్పై ఏళ్ల క్రితం ఇండియా ఇలాగే ఉండేది' అని అందరూ రెస్పాండ్ అవుతున్నారు. ఏం... ఇప్పుడు ఎందుకు అలా ఉండకూడదు?

నిజమే. పక్కింటి పాప తలుపు తట్టి 'బీరకాయ కూర చేసింది అమ్మ. ఇచ్చి రమ్మంది' అని చెప్తే చాలా బాగుంటుంది. 'గడి ముందుకేసి కూరగాయలకు వెళుతున్నా. కాస్త చూస్తుండక్కా' అని ఎదురింటి వాళ్లతో అంటే 'అదేం భాగ్యం. వెళ్లిరా' అని సొంతింటి కన్నా ఈ ఇంటి పైనే దృష్టి పెట్టే వాళ్లు దొరికితే మరెంతో బాగుంటుంది. ఇలా ఉండటానికే మనుషులు ఇష్టపడేవాళ్లు. కాని ఇప్పుడు ఇలా ఉండటం 'భాగ్యం' అని చెప్పుకునే స్థాయికి చేరుకున్నాం.

మైసూర్‌లో ఒక కాలనీ

'గాయత్రి. ఇడ్లీలు చేశా. ఇంటికి రా' అని తనకు వచ్చిన మెసేజ్‌ను ట్విటర్‌లో పోస్ట్ చేస్తూ 'మా కాలనీలో అంతా ఇలాంటి స్నేహమే' అని గాయత్రి జయరామన్ అనే మైసూర్ జర్నలిస్ట్ ట్వీట్ చేసింది. 20 ఏళ్లుగా పాత్రికేయరంగంలో ఉన్న గాయత్రి 'హూ మి, పూర్' అనే పుస్తకం రాసింది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే గాయత్రి పక్కింటావిడ ఇడ్లీలకు పిలవడంతో సంతోషపడి తన కాలనీ స్నేహాలన్నీ ట్వీట్లుగా రాసింది.

'యోగా సెంటర్‌కు రాపిడో బుక్ చేద్దామని ఇంటి బయట నిలబడతానా... ఎవరో ఒకరు దింపడానికి వస్తారు. నా కుక్కపిల్ల నేను బయటి కెళ్తే గోల చేస్తుంది. నేను ఇంట్లోనే ఉన్నాననే భావన కలిగించడానికి తలుపు తెరిచి పెట్టి పనుల కోసం బయటకు వెళితే మా కాలనీలో అందరూ కాపలా కాసేవాళ్లే. ఒక రోజు ఒకావిడ బిసిబేలా బాత్ పంపుతారు. నిన్న ఒకామె సాంబార్ పంపింది. మా కాలనీలో ఒకరి గిన్నెలు మరొకరి వంట గదిలో ఉండటం మామూలే. ఇలాంటి స్నేహాలతో మేమంతా ఉండటం సంతోషంగా ఉంది' అని రాసింది. దాంతో చాలామంది కనెక్ట్ అయ్యారు. 'మేము గవర్నమెంట్ క్వార్టర్స్‌లో ఉన్నప్పుడు అందరం ఇలాగే ఉండేవాళ్లం' అని ఒకరు రాస్తే 'మైసూర్లో అందరూ ఇలా ఉండొచ్చు. బెంగళూరులో ఈ వాతావరణం మిస్ అవుతున్నాను' అని మరొకరు రాశారు.'ముప్పై ఏళ్ల క్రితం అందరూ ఇలా ఉన్నవాళ్లే. ఇప్పుడెక్కడ' అని మరొకరు బాధ పడ్డారు. 'లాక్‌డౌన్ సమయంలో కొంత కాలం మాత్రం ఇలా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ఎవరి గుహల్లోకి వాళ్లు వెళ్లిపోయారు' అని మరొకరు రాశారు.



ప్రేమ, అభిమానాలే ఇంధనాలు

ఒక దూరప్రయాణం పరిచయస్తులు ఎవరూ లేని రైలులో చేస్తుంటే ఎలా ఉంటుందో, జీవన ప్రయాణం ప్రేమ, అభిమానాలు పంచేవాళ్లు లేకుంటే అలా ఉంటుంది. నలుగురు స్నేహితులతో సాగే పిక్నిక్ యాత్రలా జీవితం ఎందుకు ఉండకూడదు? కనీసం అప్పుడప్పుడన్నా వీధి అరుగుపై ఇరుగు పొరుగుతో కబుర్లు చెప్పుకునే కమ్మదనంతో జీవితం ఎందుకు ఉండకూడదు? పిల్లలు కూడా తల్లిదండ్రులను చూసి ఇరుగు పొరుగు పిల్లలతో స్నేహం చేయడం మానేస్తున్నారు. దీనివల్ల వారి మానసిక ఆరోగ్యం ఎలా ఉండబోతోందో ఆలోచించారా?

ఇరుగు పొరుగుతో స్నేహంగా ఉండటం, 'ఏం బాబాయ్' అంటే 'ఏం అల్లుడూ' అని పలకరించుకోవడం.. 'ఆంటీ ఇంటి నుంచి టీ పౌడర్ తీసుకురాపో' అని పంపించడం కూడా అసాధ్యమైన విషయాలుగా మారిపోతే ఏ ఊతంతో ఏ స్పందనలతో జీవించాలి మనం?

శ్రుతి మించి ప్రైవసీ

పల్లెల్లో అయినా పట్నాల్లో అయినా ప్రతి ఒక్కరూ శ్రుతి మించిన ప్రైవసీలోకి జారుకుంటున్నారు. మొదట ఉమ్మడి కుటుంబాలు వద్దనుకున్నారు. ఆ తర్వాత తల్లిదండ్రుల నుంచి పిల్లలు విడిపోవడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఇరుగు పొరుగు వారిని వద్దనుకుంటున్నారు. కేవలం ఎప్పుడూ ఇళ్లకు కూడా రాని కొందరు స్నేహితులు, పరిచయస్తులు చాలనుకునే స్థితికి చేరుకున్నారు. 'మన బతుకులో ఎవరి జోక్యం అక్కర్లేదు' అనే భావనలో ఉన్న సౌకర్యం ఎలా ఉన్నా 'ఎవరి సాయం, తోడు లేకుండా బతుకు ఎలా ఉంటుంది' అనే ప్రశ్నకు జవాబు దొరకడం లేదు. ప్రైవసీ పిచ్చి ఒంటరితనంలోకి, ఏకాంతంలోకి, మనకు ఎవరూ లేరని భావనలోకి నెట్టి అభద్రతకు, ఆందోళనకు గురి చేస్తుంది. 'ఎదుటివారి లోపాలు వెతకడం, జడ్జ్ చేయడం, మనకు హితవు చెప్పిన వారిని కూడా పగవారిని చేసుకోవడం, అనుబంధాలు ఆర్థికపరమైన సాయాలు కోరతాయనే మిషతో అందరినీ దూరం పెట్టడం' ఇవి నేడు ప్రతి మనిషిని కేవలం కుటుంబ జీవితానికి, కుటుంబ అనుబంధాలకి (అవి కూడా సరిగ్గా ఉంటే) పరిమితం చేస్తున్నాయి.

పక్కింటామె 'ఇడ్లీ తిందూరా' అని పిలవడమే వార్తగా మారి, అది చదివి ఆనంద బాష్పాలు వచ్చే స్థితికి మనం చేరుకుంటే ఆ తప్పు ఇడ్లీదో చట్నీదో కాదు. మనదే.

ప్లాగ్‌రాజ్

ఉదయాన్నే లేచి వ్యాయామం చేస్తే ఒంటికి మంచిదని తెలుసు. కానీ రకరకాల కారణాలతో వ్యాయామం చేయడానికి బద్ధకించేస్తుంటాం. ''కనీసం నాలుగడుగులేయండి, కాస్త జాగింగ్ అయినా చేయండి''అని పెద్దలు చెబుతుంటారు. ''జాగింగ్‌తోపాటు ప్లాగింగ్ కూడా చేయండి మీరు ఫిట్‌గా ఉండడమేగాక మీ చుట్టూ ఉన్న పరిసరాలు కూడా క్లీన్ అవుతాయి'' అని చెబుతున్నాడు నాగరాజు. రోజూ చేసే జాగింగ్ కంటే ప్లాగింగ్‌లో మరిన్ని కేలరీలు ఖర్చవడంతోపాటు, అహం కూడా తగ్గుతుందని హామీ ఇస్తోన్న ప్లాగింగ్ నాగరాజు గురించి అతని మాటల్లోనే...

ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్ మా స్వస్థలం. ఎమ్‌బీఏ చదివేందుకు పదిహేనేళ్ల క్రితం బెంగళూరు వచ్చాను. చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడిపోయాను. 2012లో ఒకరోజు సైక్లింగ్ ఈవెంట్ పూర్తిచేసుకుని ఇంటికి తిరిగొస్తున్నాను. ఆ సమయంలో... కొంతమంది యువతీ యువకులు జాగింగ్ చేస్తూనే రోడ్డు మీద పడి ఉన్న చెత్తాచెదారాన్ని ఏరుతున్నారు. నాకు కొంచెం చిత్రంగా అనిపించి, ''ఏం చేస్తున్నారు?'' అని అడిగాను. ''మేము ఇక్కడ ఉన్న చెత్తనంతటిని తీసివేస్తే ఎవరూ ఇక్కడ చెత్త వేయరు. అంతా చెత్తడబ్బాలోనే వేస్తారు. దీంతో ఈ ప్రాంతం అంతా పరిశుభ్రంగా ఉంటుంది'' అని చెప్పారు. అది విన్న నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ఐడియా చాలా బావుంది అనుకున్నాను. అప్పటి నుంచి నేను కూడా చెత్తను తగ్గించడానికి ప్రయత్నిస్తూ.. ఎక్కడైనా చెత్త కనిపిస్తే, దానిని తీసుకెళ్లి చెత్తడబ్బాలో వేసేవాణ్ణి.

స్వీడన్‌లో పుట్టింది

ప్లాగింగ్ పుట్టింది స్వీడన్‌లో. స్వీడిష్‌లో ప్లాగింగ్ అంటే 'టు పికప్' అని అర్థం. ఎరిక్ అల్‌స్ట్రమ్ రోజూ అనే అతను కార్డియో వర్కవుట్స్ చేస్తూ తను వెళ్లే దారిలో కనపడిన చెత్తను ఏరివేస్తూ 2016లో ప్లాగింగ్‌ను ప్రారంభించాడు. టీవీలో అది చూసిన నేను.. ఇండియాలో ఎలా ప్లాగింగ్ చేయాలో నెట్‌లో శోధించి తెలుసుకున్నాను. అదే సంవత్సరం కబ్బన్ పార్క్‌లో 500 మందితో రన్నింగ్ ఈవెంట్ జరుగుతోంది. ఆ ఈవెంట్‌లో ప్లాగింగ్ ప్రారంభించాను. అక్కడ రన్నర్స్ పడేసే ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఏరి చెత్తబుట్టలో వేయడం చూసి కొంతమంది నన్ను అభినందించారు. ఈ అభినందనలు నన్ను ప్లాగింగ్ దిశగా మరింతగా ప్రోత్సహించాయి. అప్పటి నుంచి నా ప్లాగింగ్ జర్నీ కొనసాగుతూనే ఉంది.

ఇండియన్ ప్లాగర్స్ ఆర్మీ

నేను ప్లాగింగ్ మొదలుపెట్టిన తొలినాళ్లలో ఎవరూ ఆసక్తి కనబరచలేదు. ఒక్కడ్నే ఇది చేయాలంటే కష్టంగా అనిపించింది. దాంతో అందరి ఇళ్లకు వెళ్లి ప్లాస్టిక్ వేస్ట్‌ను కలెక్ట్ చేసేవాడ్ని. రోడ్లమీద పడి ఉన్న చెత్తను ఏరేందుకు నా నాలుగేళ్ల కూతురు ఒక బ్యాగ్‌ను పట్టుకుని వచ్చి నాతోపాటు చెత్తను ఏరి బ్యాగ్‌లో వేసుకునేది. అలా నా ప్లాగింగ్ నిదానంగా సాగుతోండగా.. 2018లో కూర్గ్‌లో జరిగిన 'బేర్‌ఫూట్ మారథాన్' నా ప్లాగింగ్‌కు పాపులారిటీని తెచ్చింది. అతిపెద్ద మారథాన్‌లో ప్లాగింగ్ చేయడంతో అక్కడ పాల్గొన్న సెలబ్రిటీలు, ఔత్సాహికులకు దానిపై అవగాహన కల్పించాను. మిలింద్ సోనమ్ నన్ను మెచ్చుకుని , ప్లాగింగ్ గురించి అవగాహన కల్పించడానికి సాయం చేశారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు సాయం చేయడంతో..'ద ఇండియన్ ప్లాగర్స్ ఆర్మీ' ని ఏర్పాటు చేశాం. ఈ ఆర్మీతో కలిసి వీకెండ్స్‌లో కనీసం ఒక ప్లాంగింగ్ ఈవెంట్‌ను అయినా ఏర్పాటు చేసేవాళ్లం. అలా ఆరేళ్లలో 550కు పైగా ఈవెంట్స్ చేశాం. ఏరిన చెత్తమొత్తాన్ని బెంగళూరు రీసైక్లింగ్ యూనిట్‌కు పంపి, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తున్నాం.


నాగరాజు






నాగరాజుతో ప్లాగింగ్ ఆర్మీ

అహం కరుగుతుంది

ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకూడదని, వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకూడదని అందరిలో అవగాహన కల్పించడమే ప్లాగింగ్ ముఖ్య ఉద్దేశ్యం. ఇది విజయవంతమైతే ఎవరూ చెత్తవేయరు. జాగింగ్ చేసినప్పుడు కేలరీలు కరుగుతాయి. అయితే అక్కడక్కడ పడి ఉన్న చెత్తను వంగి తీయడం వల్ల మరిన్ని కేలరీలు ఖర్చవుతాయి. వేరే ఎవరో పడేసిన చెత్తను పెద్ద మనసుతో మనం ఎత్తినప్పుడు మనలో పేరుకుపోయిన అహం భావం కూడా కరిగిపోతుంది.

అవగాహనతో...

రోజురోజుకీ పెరిగిపోతున్న ప్లాస్టిక్ కాలుష్యానికి ప్లాగింగ్ ఈవెంట్ చక్కని పరిష్కారం చూపుతోంది. ప్రతి ఒక్కరు జాగింగ్ చేస్తూ చెత్తను ఏరివేయడం ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్న అవగాహన పెరుగుతుంది. తద్వారా ప్లాస్టిక్ కాలుష్యం నియంత్రణలోకి వస్తుంది. ప్లాగింగ్ చేసే ముందు మేమంతా "కొంతమేరైనా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గిస్తాం" అని ప్రతిజ్ఞ చేశాక వ్యర్థాలను ఏరతాం.


– నాగరాజు

ఇంటిప్స్

మనం ఎంత తాజా కొత్తిమీర తీసుకున్నా, ఈ ఎండలకు అది వాడిపోతుంటుంది. అలాంటి కొత్తిమీరకట్టను తీసుకుని వేళ్లు ఉన్న భాగాన్ని కట్‌చేసి తీసేయాలి. ఒక గాజు గ్లాసులో నీళ్లపోసి అందులో చిటికడు ఉప్పు వేసి కొత్తిమీర కాడలు ఆ నీటిలో మునిగేటట్టుగా పెట్టి అరగంట తరువాత చూస్తే వాడిపోయిన కొత్తిమీర ఆకులు తాజాగా కనిపిస్తాయి. కూరల్లో వేసుకోవడానికి బావుంటాయి.



- మిగిలిపోయిన అన్నాన్ని చూస్తూ చూస్తూ పారేయబుద్ధి కాదు. అలాగని బిగుసుకపోయినట్లు ఉన్న అన్నాన్ని తినలేం. అలాంటప్పుడు ఆ అన్నాన్ని దానికి సరిపడినన్ని మరిగే నీటిలో వేసి ఐదారు నిమిషాలు తిప్పుతూ ఉంచి, తరువాత ఆ అదనపు నీటిని తీసివేస్తే అప్పుడే వండిన అన్నంలా వస్తుంది.
- గుడ్లు ఉడికించేటప్పుడు టీస్పూను నూనె వేయడం వల్ల గుడ్లు పగలకుండా చక్కగా ఉడుకుతాయి.



అర్చన... అనుకున్నది సాధించింది

'నేర్చుకోవాలి' అనే తపన ఉంటే ఏ విద్య అయినా చేతికి చిక్కుతుంది. సైకిల్ తొక్కడం కూడా రాని అర్చనా ఆత్రమ్ పెద్ద బస్సును నైపుణ్యంగా నడుపుతూ 'భేష్' అనిపించుకోవడానికి ఆ తపనే కారణం....

మహారాష్ట్ర స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంఎస్‌ఆర్‌టీసీ) తొలి మహిళా డ్రైవర్‌గా వార్తల్లో నిలిచింది అర్చనా ఆత్రమ్. నాందేడ్ జిల్లాలోని కిన్వత్ తాలూకలోని సర్కానీ గ్రామానికి చెందిన అర్చన డ్రైవింగ్ ఫీల్డ్‌ను ఎంచుకోవడం తండ్రికి నచ్చలేదు. బంధువులు 'అది ఆడవాళ్లు చేసే ఉద్యోగం కాదు' అన్నారు.

కొందరైతే...'నీకు సైకిల్ తొక్కడమే రాదు. బస్సు నడుపుతావా!' అని బిగ్గరగా నవ్వేవాళ్లు.

ఎన్నో ప్రతికూల మాటలను ఈ చెవిన విని ఆ చెవిన వదిలేసిందేగానీ ఒక్క అడుగు వెనక్కి వేయలేదు అర్చన.

'పట్టుదల ఉంటే ఏదైనా నేర్చుకోవచ్చు' అంటున్న అర్చన పుణెలో జరిగిన శిక్షణ తరగతులలో ఎన్నో విషయాలు నేర్చుకుంది. క్లచ్, గేర్ అంటే ఏమిటో తెలియని అర్చన జీరో నుంచి ప్రయాణం ప్రారంభించి హీరో అయ్యింది. డిపో మేనేజర్ నుంచి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వరకు ఎంతో మంది అర్చనా ఆత్రమ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫస్ట్ టైమ్


అర్చనా ఆత్రమ్

బ్యూటిప్స్



ఫ్రూట్ ఫేషియల్, ఫేస్ ప్యాక్, ఎక్స్‌ఫోలియేషన్ వంటి ట్రీట్‌మెంట్‌లతో అందానికి మెరుగులు దిద్దుకోవడానికి బ్యూటీ పార్లర్‌కు వెళ్లాల్సిన పని లేదు. ఇంట్లోనే చేసుకోవచ్చు. అది కూడా మన ఇంట్లో ఉపయోగించే దినుసులతోనే.

- టీ స్పూన్ శనగపిండిలో టీ స్పూన్ పెరుగు, అర టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయాలి. ఆరిన తరవాత మునివేళ్లతో వలయాకారంగా మర్దన చేయాలి, ఆ తర్వాత చన్నీటితో కడగాలి. ఈ హెర్బల్ ఫేస్ ప్యాక్ వేయడం వల్ల చర్మం తగినంత తేమతో ఆరోగ్యంగా మెరుస్తుంది. నునుపుదనం సంతరించుకుంటుంది.
- చర్మం మీద మృత కణాలు తొలగిపోవాలంటే టేబుల్ బియ్యప్పిండిలో టేబుల్ స్పూన్ పెరుగు, టీ స్పూన్ తేనె కలపాలి. ఇది హోమ్‌మేడ్ స్క్రబ్. దీనిని చేతులు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల తర్వాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేసి చన్నీటితో శుభ్రం చేయాలి. రెండువారాలకొకసారి ఇలా చేయడం వల్ల మృతకణాలు తొలగిపోయి చర్మం నిగారిస్తుంది.
- ముఖం మీద మచ్చలు పోవాలంటే... టీ స్పూన్ శనగపిండిలో టీ స్పూన్ తులసి ఆకుల రసం, టీ స్పూన్ తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, చెవులకు పట్టించాలి. ఈ ప్యాక్ రోజూ వేయవచ్చు. తాజా తులసి ఆకులు లేకపోతే తులసి ఆకుల పొడి వాడుకోవచ్చు. అప్పుడు ఈ పొడులను కలపడానికి పెరుగు లేదా మజ్జిగ వాడాలి. పొడి చర్మం వాళ్లయితే పాలు కలుపుకోవాలి.
- టేబుల్ స్పూన్ మామిడి పండు గుజ్జులో నాలుగు చుక్కల తేనె కలిపి ముఖం, మెడ, చేతులకు పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. మ్యాంగో ఫ్రూట్ ప్యాక్ రోజూ వేస్తుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది. వారం పది రోజుల్లోనే ఫలితం స్పష్టంగా కనిపిస్తుంది.
- అరటి పండు తొక్కతో (తొక్క లోపలి వైపు) పాదాలకు మర్దన చేస్తే పాదాలు పగుళ్లు తగ్గిపోతాయి.పాదానికి రాయాలి.

రూట్స్

ఎన్నో తరాలు ఒకే తరమై...


సుమతి జలన్

ఉపాధి వెదుక్కుంటూ బిహార్‌వాసులు వేరే ప్రాంతాలకు వెళుతుంటారు. 'నేను బిహార్ నుంచి వచ్చాను' అని చెప్పుకోవడానికి చాలామంది జంకుతుంటారు. దీని కారణం రకరకాల అపోహలు.

చదువు, ఉద్యోగం వల్ల చాలా కాలం సొంత రాష్ట్రానికి దూరంగా ఉన్న సుమతి జలన్ పట్నాను వెదుక్కుంటూ వచ్చింది.

'తడబడవద్దు. భయపడవద్దు. నేను బిహారిని అని గర్వంగా చెప్పుకోండి' అనే నినాదంతో బిహార్‌లోని ప్రసిద్ధ హస్తకళలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడానికి 'బిహార్ట్' అనే జీరో వేస్ట్ క్లాతింగ్ బ్రాండ్‌కు శ్రీకారం చుట్టి విజయపథంలో దూసుకుపోతోంది....

'మీరు బిహారి అంటే నమ్మడం చాలా కష్టం' అని చాలామంది సుమతితో అన్నారు.

తన ఉన్నతవిద్య నేపథ్యం కావచ్చు, వేగంగా ఇంగ్లీష్ మాట్లాడే నేర్పు కావచ్చు... వారి నోటి నుంచి ఆ మాట వచ్చేలా చేశాయి. అయితే ఆ మాటను ఎప్పుడూ ప్రశంసగా తీసుకోలేదు సుమతి జలన్. పైగా బాధగా అనిపించేది.

చిన్నప్పుడు తల్లిదండ్రులు, తాత నోటి నుంచి బిహార్ ఘన సంస్కృతి గురించి కథలు, కథలుగా విన్నది. తాను విన్నదానికి, బిహార్ అవతల వినిపిస్తున్నదానికి అంతరం కనిపించింది. 'అపోహలు' అనే రాక్షసులపై యుద్ధం చేయాల్సిన అవసరం కనిపించింది. అందుకే సొంతభూమికి వెళ్లింది.

'నేను బిహార్‌వాసిని' అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవడానికి ఏదైనా చేయాలి అనుకుంది. అలా ఆలోచిస్తున్న సమయంలో తనకు అపురూపమైన బిహార్ సంప్రదాయ కళలు గుర్తుకు వచ్చాయి. కాలికి బలపం కట్టుకొని ఆ కళలను వెదుక్కుంటూ ఎన్నో ఊళ్లు తిరిగింది. అలా తిరిగే క్రమంలో...

'మన గురించి మనం చెప్పుకోవాల్సింది ఎంతో ఉంది' అనిపించింది.

ఆ ఆలోచనతోనే 'బిహార్ట్' పేరుతో ఫ్యాషన్ బ్రాండ్ మొదలుపెట్టింది. ఈ బ్రాండ్ ద్వారా బిహార్‌లోని హస్తకళలకు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

మల్బరి సిల్క్ చీరెలు, కుర్తీలు, సుజని టాప్స్, దుప్పట్లు, హ్యాండ్‌మేడ్ బ్యాగులు, సుజని–షింగరీ బొమ్మలు... ఇలా ఎన్నెన్నో ఉత్పత్తులతో ప్రయాణం ప్రారంభించింది సుమతి.





తమ ప్రాడక్ట్స్ గురించి చెబుతూ 'ఎన్నో తరాల కళ ఒకే తరమై కనిపిస్తుంది' అంటుంది.

సుమతి తాత దివాన్ బహదూర్ రాధ క్రిష్ణ జలన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకృతులను సేకరించేవాడు. యూరప్, చైనా, టిబెట్, టర్కీ నుంచి ఎన్నో అద్భుతమైన కళాఖండలకు తీసుకు వచ్చాడు. వీటిని భద్రపరచడం కోసం మ్యూజియంలాంటి ఇంటిని ప్రత్యేకంగా నిర్మించాడు. ఆ మ్యూజియంలోకి వెళితే సుమతికి మరో లోకంలోకి వచ్చినట్లుగా అనిపించేది. అలా కళలపై ఆసక్తి మొదలైంది.

'కళ కళ కోసమే' అని నమ్మేవారితో పాటు 'సామాజిక ప్రయోజనం కోసం' అని నమ్మేవారు కూడా ఉంటారు. ఇందులో భాగంగానే కళను తమ ప్రాంత సాంస్కృతిక వైభవ వికాసం కోసం ఉపయోగించుకోవడానికి నడుం బిగించింది సుమతి.

విజయాల మాట ఎలా ఉన్నా ప్రతి వ్యాపారానికి సవాళ్లు ఎదురొస్తుంటాయి. కోవిడ్ రూపంలో అలా సవాలు ఎదురొచ్చింది. అయినా నిలదొక్కుకోగలిగింది తన బ్రాండ్. మరో సవాలు 'బిహార్ట్' కోసం ఎవరిని ఎంపిక చేసుకోవాలి అనేది. ఉపాధి కోసం యువతరంలో ఎంతో మంది బిహార్ దాటి ఎక్కడెక్కడికో వెళుతున్న విషయం గుర్తుకువచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫోటోగ్రఫీ, మార్కెటింగ్, డిజైన్, బ్లాగింగ్, మోడలింగ్‌లో ప్రతిభ ఉన్న యువతరానికి ఉపాధి అవకాశాలు కల్పించింది.

'బిహార్ట్' బ్రాండ్ అనే గొడుగు నీడలో ప్రొడక్షన్ మేనేజర్, ఫ్యాషన్ డిజైనర్, టైలర్స్‌గా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 86

శనివారం 17-6-2023



స్వర్ణం నెగ్గిన జ్యోతి

జాతీయ అథ్లెటిక్స్ 100 మీటర్ల రేసులో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్‌కు అగ్రస్థానం. - 13లో



బుల్ కొత్త రికార్డ్

సూచీలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిల వద్ద ముగింపు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బలహీనపడిన బిపర్‌జోయ్

బిపర్‌జోయ్ తుపాను రాజస్తాన్ వైపు మళ్లింది. దీంతో రాజస్తాన్‌లోని జలోర్, బార్మర్ జిల్లాల్లో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు.
- వివరాలు 6లో



నెహ్రూ లైబ్రరీ పేరు మార్పు

ఢిల్లీలోని 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ' పేరును కేంద్రం ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీగా మార్చింది.
- వివరాలు 6లో



'ముందస్తు'ను కొట్టిపారేయలేం

విపక్ష కూటమి పూర్తిగా బలం పుంజుకోక ముందే ఎన్నికలు నిర్వహించాలన్న యోచనలో బీజేపీ ఉండొచ్చని నితీశ్ పేర్కొన్నారు.
- వివరాలు 6లో



తృణధాన్యాల ప్రాధాన్యంపై పాట..

తృణధాన్యాల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు గ్రామీ అవార్డు విజేత, భారతీయ అమెరికన్ ఫల్గుణి షాతో కలిసి ప్రధాని మోదీ పాట పాడారు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

లైఫ్‌స్టైల్ గ్రూప్ డైరెక్టర్ ఇంట్లో సోదాలు



బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు, కార్యాలయాల్లో వరుసగా మూడోరోజూ ఐటీ దాడులు కొనసాగాయి. అయితే శుక్రవారం లైఫ్‌స్టైల్ గ్రూప్ కంపెనీల డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించారు.
- వివరాలు 3లో

తెయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి



తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరికి వీసీ డి.రవీందర్‌గుప్తా నియామక ఉత్తర్వులు అందజేశారు. వాకాటి కరుణ, నవీన్ మిట్టల్ సూచన మేరకు యాదగిరి వెంటనే బాధ్యతలు స్వీకరించారు.
- వివరాలు 2లో

రైతులకు ఒకేరోజు రూ.3 వేలకోట్లు



యాసంగి ధాన్యం సేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, శుక్రవారం ఒక్కరోజే రూ.3,000 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.
- వివరాలు 5లో

ఆ సభ్యుల నియామకంపై పునః పరిశీలన



టీఎస్పీఎస్సీ సభ్యుల నియామకంలో సుప్రీం కోర్టు ఉత్తర్వులు పాటించారా? లేదా? అన్నది పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై 3 నెలల్లో కసరత్తు పూర్తిచేయాలని స్పష్టం చేసింది.
- వివరాలు 2లో

శ్రావణ మాసంలోనే కారు సీట్లు ఖరారు

అభ్యర్థుల ప్రకటనకు ముహూర్తం చూస్తున్న కేసీఆర్
సుమారు మూడొంతుల స్థానాల్లో అభ్యర్థుల జాబితాకు గ్రీన్‌సిగ్నల్

- సిట్టింగ్‌లలో దాదాపు 15% మందికి టికెట్లు దక్కేది అనుమానమే!
- పార్టీలో అంతర్గత పోరు, వలసలపై స్పష్టత కోసమే ముందుగా జాబితా
- అవసరమైన చోట బుజ్జగింపులు, సర్దుకోకుంటే సాగనంపే ఉద్దేశం
- ఇతర పార్టీల్లోకి వలసలపై నజర్.. అలాంటి నేతలతో జరిగే నష్టంపై లెక్కలు
- 2018లో ముందుగా అభ్యర్థుల ప్రకటన కలసివచ్చిందనే భావన
- లోక్‌సభ ఎన్నికలు ముందస్తుగా జరిగితే అనుసరించాల్సిన వ్యూహంపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: ఏడాది చివరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తరఫున పోటీచేసే అభ్యర్థుల జాబితాను వీలైనంత త్వరగా ప్రకటించాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నట్టు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో పోటీ కోసం బీఆర్ఎస్‌లో తీవ్రపోటీ నెలకొనడం, సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో పనిమంతులకే తిరిగి టికెట్ దక్కుతుందని ఇప్పటికే స్పష్టతనిచ్చిన నేపథ్యంలో.. ముందుగానే జాబితాను ప్రకటించడం ద్వారా పార్టీలో సందిగ్ధతకు తెరదించాలని కేసీఆర్ నిర్ణయించినట్టు సమాచారం. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన కేసీఆర్.. ప్రభుత్వ రద్దు ప్రకటనతోపాటే ఆ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించేశారు. అప్పుడు ఎన్నికలకు సుమారు మూడు నెలల ముందే ఒకేసారి 105 మంది జాబితాను విడుదల చేయడం సంచలనం సృష్టించింది. అదే తరహాలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు సుమారు నాలుగు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించేలా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు.

మంచి ముహూర్తం చూసుకుని..

మరో రెండు రోజుల్లో ఆషాఢ మాసం ప్రారంభమవుతోంది. అది ముగిశాక అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలిసింది. అంటే జూలై మూడో వారం నుంచి నెలాఖరు మధ్యలో బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ తొలి జాబితాలో

మిగతా 2వ పేజీలో ▶

బుజ్జగింపులు.. సాగనంపడాలు..

నియోజకవర్గాలు, గ్రామస్థాయి వరకు పార్టీల బలాబలాలు, ప్రభావం చూపే నేతలు, వారి గుణగణాలపై పూర్తిస్థాయి నివేదికలను బీఆర్ఎస్ సిద్ధం చేసుకుంది. ముందస్తుగా ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అసంతృప్త నేతలను బుజ్జగించడం, సాధ్యంకాని పక్షంలో సాగనంపడం చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఇక బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశమున్న నేతల జాబితాను నిఘా సంస్థల నివేదికల ఆధారంగా కేసీఆర్ సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. ''ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు అన్ని పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల బలాబలాలకు సంబంధించి కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉంది. విపక్షాల ఎత్తుగడలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. జీహెచ్ఎంసీ ఎన్నికల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నచోట వారిని మార్చి ఇతరులకు అవకాశం ఇచ్చే అంశంలో కేసీఆర్ కఠిన నిర్ణయాలు తీసుకుంటారు'' అని బీఆర్ఎస్ కీలక నేత ఒకరు పేర్కొన్నారు.

'ధరణి' సరిదిద్దుతాం

రైతులకు సమస్యల్లేకుండా చూస్తాం.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



వెంగళరావునగర్ (హైదరాబాద్): ధరణి పోర్టల్‌లో అనేక లోపాలున్నాయని, తాము అధికారంలోకి వస్తే వాటిని సరిదిద్ది రైతులకు ఎలాంటి సమస్యల్లేకుండా చూస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన పార్టీ జూబ్లీహిల్స్ మోర్చాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణి వల్ల కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లబ్ధి జరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం 5 లక్షల కోట్ల అప్పుల పాలైందని, మళ్లీ గెలిపిస్తే ఇంకో ఐదు లక్షల కోట్లు అప్పు చేస్తారని విమర్శించారు. ఏ సర్వేలు చూసినా బీజేపీకి అనుకూలంగానే ఉన్నాయని, అందువల్ల బీజేపీ ఇమేజీను దెబ్బ తీసేందుకు, కాంగ్రెస్ గ్రాఫ్‌ను పెంచేందుకు కేసీఆర్ జిమ్మిక్కులు చేస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీని దోస్త్ అంటున్న ముఖ్యమంత్రి అనేకసార్లు ప్రధాని రాష్ట్రానికి వచ్చినా ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. కొంతమంది హిందుత్వం గురించి మాట్లాడవద్దని సూచిస్తున్నారని, మరోవైపు హిందూ దేవతలను కొందరు కించ పరుస్తున్నారని అందువల్ల తాను కచ్చితంగా హిందుత్వం గురించి మాట్లాడి తీరతానని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ సీఆర్ఎస్‌గా మారుతుంది..

కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ మాట్లాడుతూ టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిందని, ఎన్నికల సమయానికి అది సీఆర్ఎస్ (కాంగ్రెస్ రాష్ట్ర సమితి)గా మారుతుందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలి



- రెండో రాజధానికి కావాల్సిన అర్హతలన్నీ హైదరాబాద్‌కు ఉన్నాయని, హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలని, దీనిని సాధించేందుకు అన్ని పార్టీలు కలసి రావాలని బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ విషయాన్ని అంబేడ్కర్ ఏనాడో ప్రస్తావించారని, తన వ్యక్తిగత అభిప్రాయం కూడా అదేనని ఆయన పేర్కొన్నారు.

- వివరాలు 11లో



శుక్రవారం బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్

రాష్ట్రపతికి ఘన స్వాగతం

- బేగంపేట్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్
- నేడు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు హాజరవనున్న ద్రౌపదీ ముర్ము

2 లో



కోరుకున్న కాలేజీ.. కోర్సు

- డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్) ద్వారా తొలిదశ డిగ్రీ సీట్ల కేటాయింపు శుక్రవారం పూర్తయింది. మొత్తం 1,05,935 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 78,212 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో 73,226 మందికి సీట్లు కేటాయించారు. ఎక్కువ మందికి కోరుకున్న కోర్సులు, కాలేజీల్లోనే సీట్లు వచ్చాయి. కామర్స్ కోర్సుకు డిమాండ్ పెరుగుతోందని మరోసారి రుజువైంది. దోస్త్‌లో ఈ కోర్సుకు 1,04,687 ఆప్షన్లు అందాయి. తొలిదశలో 33,251 సీట్లు కేటాయించారు.

- వివరాలు 14లో



తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నల్లగొండ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, సిబ్బందితో క్లాక్ టవర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. - నల్లగొండ టూటౌన్



పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరణ!: బండి

- ఎన్నికల టీమ్ కోసం బీజేపీలో సంస్థాగత మార్పులు
- మరో ప్రధాన కార్యదర్శి, ఇద్దరు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధుల నియామకానికి యోచన
- వివిధ సెల్‌ల ఏర్పాటుకు చర్యలు

- వివరాలు 11లో

ఇదండీ జగత్



తుపాన్లు తలొంచుతున్నాయ్!


- మాండాస్, సిత్రాంగ్, అసానీ, గులాబ్, బిపర్ జోయ్. పేరు ఏదైనా కానివ్వండి ఆ తుపాను ఎంత తీవ్రమైనదైనా కానివ్వండి మనం తట్టుకొని నిలబడుతున్నాం. 1990,–2000నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. ఒకప్పుడు తుపాన్లు, వరదలంటే భారీగా ప్రాణ నష్టాలే జరిగేవి. ఇప్పుడు ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ముందస్తుగా తుపాన్లను గుర్తించి పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాల్ని ఇస్తోంది. గుజరాత్‌లో ఏకంగా లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు యుద్ధ ప్రాతిపదికన తరలించడంతో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోలేదు. తుపాన్ల సన్నద్ధతలో ఒడిశా ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఆ రాష్ట్ర చర్యలకు ఐక్యరాజ్య సమితి కూడా శభాష్ అనడం విశేషం.

- వివరాలు 6లో

66 వేల డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు

విదేశీయులకు షాకిచ్చిన కువైట్.. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు

మోర్తాడ్ (బాల్కొండ): వలస కార్మికులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలను కల్పించిన కువైట్ డ్రైవింగ్ లైసెన్స్‌ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి విదేశీయులకు జారీ చేసిన లైసెన్స్‌లలో ఏకంగా 66 వేల లైసెన్స్‌లను రద్దు చేసింది. ఇంకా అనేక మంది లైసెన్స్‌లు రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త నిబంధనలతో ఇతరులతోపాటు తెలుగు రాష్ట్రాల వలస కార్మికులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడనున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రెండు రాష్ట్రాలకు చెందిన అనేకమంది అరబ్బులకు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. అలాగే సేల్స్‌మన్ కమ్ డ్రైవర్లుగా కూడా అనేక మంది వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి వారికి జారీ చేసిన లైసెన్స్‌ల విషయంలో కువైట్ ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. సేల్స్‌మన్‌లు కేవలం అదే పని చేయాలని, డ్రైవింగ్ ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ గతంలో జారీ చేసిన లైసెన్స్‌లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచారని సమాచారం. మరోవైపు కంపెనీలను నిర్వహిస్తున్నవారు సొంతంగా వాహనాలను కొనుగోలు చేసి డ్రైవింగ్ లైసెన్స్‌లను పొందారు. వీరి ఆదాయం కూడా పరిగణనలోకి తీసుకుని సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్స్‌లను కొనసాగించనున్నారు. కొన్నేళ్ల కిందట డ్రైవింగ్ లైసెన్స్‌లను విచ్చలవిడిగా జారీ చేయడంతో కొన్ని దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తించిన కువైట్ ఇప్పుడు దిద్దుబాటు చర్యలు తీసుకుందని అక్కడ నివసిస్తున్న తెలంగాణ వాసులు కొందరు వెల్లడించారు. దిద్దుబాటులో భాగంగా సొంత కారు ఉండి డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే మన కరెన్సీలో కనీసం రూ.1.50 లక్షల వేతనం ఉండాలనే నిబంధన అమలులోకి తీసుకువచ్చారు. తక్కువ వేతనం అందుకుంటున్నవారికి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసి ఉంటే దానిని రద్దు చేశారు. కాగా తప్పుడు ఆధారాలతో డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందినవారు కూడా ఇప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.





కేంద్ర మంత్రి ఇంటిపై పెట్రోల్‌బాంబులతో దాడి

- మణిపూర్‌లో తెగల మధ్య ఘర్షణలు చల్లారే సూచనలు కనిపించడం లేదు. గురువారం రాత్రి రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఆర్‌కే రంజన్ సింగ్ ఇంటిని ఆందోళనకారుల గుంపు ధ్వంసం చేసింది. ఆ ఇంటిని తగులబెట్టేందుకు యత్నించగా ఫైర్ సిబ్బంది భద్రతా బలగాలు మంటలను ఆర్పారు.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

ఏం చర్యలు తీసుకున్నారు?

48 గంటల్లోగా నివేదిక ఇవ్వండి..


బాసర ట్రిపుల్ ఐటీ వీసీకి గవర్నర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థినుల ఆత్మహత్యల పట్ల రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలకు దారితీసిన సమస్యలను పరిష్కరించాలని వైస్‌చాన్స్‌లర్‌కు నిర్దేశించారు. ఈ ఘటనలపై 48 గంటల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలు అందులో పేర్కొనాలని వీసీని ఆదేశించారు. ఆత్మహత్యలు వంటి తీవ్ర చర్యలకు దిగవద్దని, ఉన్నత విద్యలో ఎదురయ్యే సవాళ్లను మనోధైర్యంతో ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు.

నేడు గిరిజనోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గిరిజనోత్సవ కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందులో భాగంగా రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ వెల్లడించింది. ఈ ఉత్సవాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. గిరిజన గ్రామాల్లోనూ ప్రత్యేకంగా సభలు నిర్వహిస్తారు. గత తొమ్మిదేళ్లలో గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు, తండాలు, గూడేలకు గ్రామ పంచాయతీ హోదా కల్పన, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు.. తదితర అంశాలను ప్రస్తావిస్తారు. వివిధ భవన నిర్మాణాలతో పాటు గిరిజన జాతరలకు అందిస్తున్న ప్రభుత్వ సాయం గురించి ఈ వేడుకల్లో వివరిస్తారు.

'ఉపా' చట్టాన్ని ప్రయోగించడాన్ని ఖండిస్తున్నాం: రాఘవులు



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ హరగోపాల్, తదితరులకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో 'ఉపా' చట్టాన్ని ప్రయోగించడాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. హరగోపాల్ వివిధ అంశాలపై స్పందిస్తూ సామాజికంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్షవాదులపై కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు.

హరగోపాల్‌పై కేసు ఎత్తేయాలి: నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: ప్రొఫెసర్ హరగోపాల్‌పై 'ఉపా' కేసు నమోదు చేయడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఖండించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వ్యక్తి హరగోపాల్ అని, ఇప్పటికైనా దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేసీఆర్‌ను ఉద్యమ ద్రోహిగా చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడుతూ, హరగోపాల్‌కు ఎలాంటి చట్టవ్యతిరేక శక్తులతో సంబంధాలు లేవన్నారు. ప్రజాస్వామ్యంపై చిత్తశుద్ధి ఉంటే బిహార్‌లో జరిగే విపక్షాల సమావేశానికి కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబు హాజరుకావాలన్నారు.

శ్రావణ మాసంలోనే కారు సీట్లు ఖరారు..

▶ మొదటి పేజీ తరువాయి

సుమారు 90 మంది అభ్యర్థుల పేర్లు ఉండే అవకాశం ఉందని.. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు గణనీయంగానే టికెట్ల కోత పడొచ్చని ప్రచారం జరుగుతోంది. సుమారు 15శాతం మందికి మళ్లీ పోటీచేసే అవకాశం దక్కకపోవచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. టికెట్ల కోసం పార్టీలో తీవ్ర పోటీ ఉన్న సీట్లు, విపక్షాల ఎత్తుగడలు, ఇతర పార్టీల నుంచి బలమైన నేతల చేరికకు అవకాశం ఉన్నచోట్ల ఎంపికను చివరి నిమిషం వరకు ఆపే అవకాశం ఉందంటున్నాయి.

...అందుకే ముందస్తు జాబితా!

సుమారు 40కిపైగా అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ టికెట్ కోసం పోటీ నెలకొంది. ఆయా చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకా, మరెవరికైనా సీటు దక్కుతుందా అన్న ఆసక్తి నెలకొంది. ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లతోపాటు ఇతర ఆశావహులు కలిపి సుమారు 70 మంది బలమైన నేతలు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ఇప్పటికే లెక్కలు వేసుకుంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇద్దరూ టికెట్‌పై స్పష్టత కోసం ప్రయత్నించే క్రమంలోనే బీఆర్‌ఎస్‌ను వీడారు. తాజాగా కూచాడి శ్రీహరిరావు (నిర్మల్) కాంగ్రెస్‌లో చేరగా.. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి (నాగర్‌కర్నూల్) కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజా ప్రతినిధి కూడా పార్టీ మారేందుకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలో అభ్యర్థుల జాబితాను ముందస్తుగా ప్రకటించడం ద్వారా నష్ట నివారణ చర్యలు చేపట్టడం సులభం అవుతుందని సీఎం భావిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలకూ సన్నద్ధమయ్యేలా..

ఈసారి లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు జరగొచ్చనే ప్రచారమున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ తన వ్యూహానికి పదును పెడుతున్నారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ను కూడా కలుపుకొని కనీసం 50 లోక్‌సభ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దింపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై కేసీఆర్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

మానవాళి భవిష్యత్తు బాధ్యత మీదే!

ప్రధాని మోదీ ఉద్ఘాటన

- భారత్‌లో నేచురల్ ఫార్మింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- రైతన్నలు టెక్నాలజీని కూడా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు
- జీ20 వ్యవసాయ మంత్రులను ఉద్దేశించి ప్రసంగం



సదస్సులో వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖల మంత్రుల బాధ్యత అర్థవ్యవస్థలో ఒక భాగం నిర్వహణ మాత్రమే కాదని, మానవజాతి భవిష్యత్తుకూ అది విస్తరిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న జీ20 వ్యవసాయ శాఖ మంత్రుల సదస్సును ఉద్దేశించి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రసంగించారు. వ్యవసాయ రంగం ప్రపంచం మొత్తమ్మీద 250 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోందని, దక్షిణార్ధ గోళంలో 30 శాతం స్థూల జాతీయోత్పత్తికి, అరవై శాతం ఉద్యోగాలకూ కూడా ఈ రంగమే ఆధారమని ఆయన తెలిపారు. అయితే కోవిడ్, మారిపోతున్న వాతావరణ పరిస్థితులు, రాజకీయాల పుణ్యమా అని ప్రస్తుతం వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే భారత్ ఒకవైపు అత్యాధునిక టెక్నాలజీల ఆధారిత వ్యవసాయానికి.. ఇంకోవైపు ప్రకృతి సిద్ధమైన సాగు పద్ధతులకు (నేచురల్ ఫార్మింగ్) ఏకకాలంలో ప్రోత్సాహమిచ్చేలా విధానాలు రూపొందించిందని తెలిపారు. భారత్‌లో నేచురల్ ఫార్మింగ్‌కు ఆదరణ పెరుగుతోందని, కృత్రిమ ఎరువులు, కీటకనాశినులకు బదులుగా మట్టిసారాన్ని పెంచేందుకు, దాని ఆరోగ్యాన్ని కాపాడేందుకు అతితక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. సేంద్రియ ఎరువులు, చీడపీడల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. దిగుబడులు పెంచేందుకు దేశీ రైతన్నలు టెక్నాలజీని కూడా విస్తృతంగా ఉపయోగిస్తున్నారని, పొలాల్లో సోలార్ పంపుల వినియోగం, పంటల మెరుగైన ఎంపికకు సాయిల్ కార్డులను వాడటం, పోషకాలు, ఎరువుల పిచికారీకి, పంట ఆరోగ్యంపై నిఘాకు డ్రోన్లను వాడుతుండటాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఈ చర్యలన్నీ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మేలైన మార్గమని విశ్వాసం వ్యక్తం చేశారు.

సిరిధాన్యాలను అలవాటు చేసుకుందాం..

సిరిధాన్యాలు సూపర్‌ఫుడ్ మాత్రమే కాదని, నీరు, ఎరువుల వాడకం తక్కువగా ఉండటం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే పంటలు కూడా అని మోదీ పేర్కొన్నారు. జీ20 సమావేశాల సందర్భంగా సిరిధాన్యాలతో చేసిన అనేక ఆహార పదార్థాలను విదేశీ ప్రతినిధులు రుచి చూసి ఉంటారంటూ.. భవిష్యత్తులో ఈ ధాన్యాలు ప్రపంచ ఆహారం కావాలని ఆకాంక్షించారు. వేల ఏళ్లుగా సాగులో ఉన్న సిరిధాన్యాలు మార్కెటింగ్ గిమ్మిక్కుల ఫలితంగా విలువను కోల్పోయాయని, ఈ పరిస్థితి మారాలని అన్నారు. సిరిధాన్యాల సాగులో ఉత్తమ విధానాలు, పరిశోధనలు, టెక్నాలజీల అభివృద్ధికి భారత్ 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్'ను అభివృద్ధి చేస్తోందని, ఇది అత్యున్నత నైపుణ్య కేంద్రంగా అవతరించనుందని చెప్పారు. ఆహార భద్రత కోసం ప్రపంచమంతా కలిసికట్టుగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలే పరమావధిగా, సుస్థిరమైన, అందరినీ కలుపుకుని పోయే ఆహార వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పటిష్టమైన ఎరువుల పంపిణీ వ్యవస్థ ఏర్పాటూ జరగాలని కోరారు. రైతులకు డిజిటల్ టెక్నాలజీలు అందుబాటులోకి తేవాలని, చిన్న, సన్నకారు రైతులకూ వ్యవసాయ సమస్యల పరిష్కారాలు చౌకగా అందుబాటులోకి వచ్చేలా ఉండాలని సూచించారు. 'వ్యవసాయంలో భారత్ దృష్టి, ప్రాధాన్యం రెండూ.. భూమి (వన్ ఎర్త్)కి సాంత్వన చేకూర్చడం, వసుధైక కుటుంబంలో (వన్ ఫ్యామిలీ)లో సామరస్యం తీసుకురావడం ద్వారా భవిష్యత్తు (వన్ ఫ్యూచర్)ను ప్రకాశవంతం చేయడం' అని ప్రధాని స్పష్టం చేశారు.

ఉత్తర జిల్లాల్లో నేడు తీవ్ర వడగాల్పులు

- దూర ప్రయాణాలు చేసేవాళ్లు జాగ్రత్తలు తీసుకోవాలి
- వాతావరణ శాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల్లో శని, ఆదివారాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ములుగు, పెద్దపల్లి, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని తెలిపింది. దూర ప్రయాణాలు చేసేవాళ్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశల నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి. శుక్రవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలో 45.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 43.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 25.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
ములకలపల్లి	కొత్తగూడెం	45.3
యానంబైలు	కొత్తగూడెం	45.2
ఆసల తక్కళ్లపల్లి	పెద్దపల్లి	45.1
అలంగపురం	సూర్యాపేట్	45.0
జంబుగ	ఆసిఫాబాద్	45.0

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
భద్రాచలం	43.6	28.5	మెదక్	41.0	25.0
ఖమ్మం	43.0	30.0	నిజామాబాద్	40.4	28.7
నల్లగొండ	42.5	25.4	హకీంపేట్	39.4	27.0
రామగుండం	41.6	28.5	హైదరాబాద్	39.4	27.2
ఆదిలాబాద్	41.5	29.7	మహబూబ్‌నగర్	39.4	27.2
హనుమకొండ	41.0	29.5	దుండిగల్	39.2	25.8

'ఉపా' కేసులు దారుణం

ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సంస్మరణ సభలో వక్తలు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

పంజగుట్ట: ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తున్న 152 మందిపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేయడం, మృతి చెందిన వారిపైనా కేసులు పెట్టడం దుర్మార్గమని పలువురు వక్తలు అన్నారు. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ బతికి ఉంటే వారిపక్షాన నిలబడి మాట్లాడేవారని గుర్తు చేశారు. తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సంస్మరణ సభ నిర్వహించారు. సమాఖ్య ప్రతినిధి కరుణాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్, గద్దర్, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి పాల్గొన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... నక్సలైట్ల పుస్తకాల్లో 152 మంది పేర్లు ఉన్నందున వారిపై ఉపా చట్టం కింద కేసులు పెట్టామనడం దారుణమన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా, ప్రజలు ఎక్కడ ఆపదలో ఉన్నా ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ అక్కడుండేవారని గుర్తుచేశారు. గద్దర్ మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో టార్గెట్ కేసీఆర్ పేరుతో ముందుకు పోతానని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... జీవితంలో ఒక మనిషి ఎలా జీవించాలి? సమాజం కోసం ఏం చేయొచ్చు? అనేది కేశవరావు జాదవ్‌ను చూసి నేర్చుకోవచ్చన్నారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ... తెలంగాణకు పర్యాయపదం కేశవరావు జాదవ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, కూర రాజన్న, ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. విమలక్క మాట్లాడుతూ... పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో భావప్రకటన స్వేచ్ఛ లేదన్నారు. సమావేశంలో నారగోని, మురళీధర్ దేశ్‌పాండే, మన్నారం నాగరాజు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులిచ్చినా స్పందించరా?

- 'డిప్లొమా'ఫీజుల నియంత్రణపై నిర్ణయం తీసుకోండి
- ఐదు కాలేజీలకు ఫీజు పెంచుకునేందుకు హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డిప్లొమా కోర్సుల ఫీజుల నియంత్రణకు సంబంధించి వివరణ ఇవ్వాలని గతంలో ఆదేశించినా వివరణ ఇవ్వకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాలేజీల విజ్ఞప్తి మేరకు ఫీజుల పెంపును అనుమతించక తప్పడం లేదంది. ఫీజును రూ.40 వేలకు పెంచేందుకు.. పిటిషనర్ కాలేజీలకు అనుమతిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫీజుల నియంత్రణను డిప్లొమా కోర్సులను అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ(ఏఎఫ్‌ఆర్‌సీ) పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఒకవేళ ఏఎఫ్‌ఆర్‌సీ తక్కువగా ఫీజు ఖరారు చేస్తే తీసుకున్న ఎక్కువ మొత్తాన్ని విద్యార్థులకు వెనక్కివ్వాలని కాలేజీలకు హైకోర్టు షరతు విధించింది. తదుపరి విచారణ 26కి వాయిదా వేసింది. డిప్లొమా కోర్సుల ఫీజుల నియంత్రణను ఏఎఫ్‌ఆర్‌సీ పరిధిలోకి తేవాలని గతేడాది సాంకేతిక విద్యా శాఖ ప్రతిపాదించింది. దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఫీజులు పెంచాలని హైకోర్టులో ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు పిటిషన్ దాఖలు చేశాయి.


రెగ్యులర్ డీఎంఈని నియమించరా?: హైకోర్టు

మా ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)గా రెగ్యులర్ అధికారిని నియమించాలని గతంలో తామిచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై రాష్ట్ర హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జ్ డీఎంఈకి నోటీసులు జారీ చేసింది. డీఎంఈ రమేశ్ రెడ్డిని నియమిస్తూ 2017, జూలై 3న ప్రభుత్వం జారీచేసిన జీవో నంబర్ 603 చట్టవిరుద్ధమని హెల్త్ కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ గతంలో పిటిషన్ దాఖలు చేసింది. 2002లో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 154లోని మెడికల్ సర్వీస్ రూల్స్‌కు, తర్వాత 2008లో జారీ చేసిన నిబంధనలకు ఇది విరుద్ధమని పేర్కొంది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు.. ప్రభుత్వం జారీచేసిన జీవోను రద్దు చేస్తూ, ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలలవుతున్నా హైకోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడంతో హెల్త్‌కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై వాదనలు విన్న ధర్మాసనం.. నోటీసులు జారీ చేస్తూ, విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

ఆ సభ్యుల నియామకంపై పునః పరిశీలన

'టీఎస్‌పీఎస్సీ'సభ్యుల నియామకంపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సభ్యుల నియామకంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు పాటించారా? లేదా? అన్నది పునః పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మూడు నెలల్లో కసరత్తు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆరుగురి నియామకాన్ని రద్దు చేయాలన్న ప్రశ్న ప్రస్తుత దశలో అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 108ను రద్దు చేయలేమని తేల్చిచెప్పింది. ఆ ఆరుగురి నియామకం ప్రభుత్వ తాజా కసరత్తుకు లోబడి ఉంటుందని చెప్పింది. అయితే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం కోసం ప్రభుత్వం ఎలాంటి ఎంపిక ప్రక్రియ నిర్వహించకపోవడం మాత్రం సరికాదని వ్యాఖ్యానించింది. టీఎస్‌పీఎస్సీ సభ్యులను నియమిస్తూ 2021, మే 19న రాష్ట్ర ప్రభుత్వం జీవో చేసింది. అయితే నియామకం అయిన వారిలో ఆరుగురు సభ్యులు ధన్‌సింగ్, బండి లింగారెడ్డి, సుమిత్రా ఆనంద్ తనోబా, కారం రవీందర్‌రెడ్డి, అరవిల్లి చంద్రశేఖర్‌రావు, ఆర్ సత్యనారాయణ నిబంధనల మేరకు అర్హులు కాదని పేర్కొంటూ హైదరాబాద్ చెందిన ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి 2021లో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం 80పేజీల కీలక తీర్పు వెల్లడించింది. ఆరుగురి నియామక తీరును హైకోర్టు తప్పుబట్టింది.

'ఇష్టం వచ్చినవారికి ఎంపిక చేయడం కాదు'

రాజ్యాంగంలోని అధికరణ 316 ప్రకారం చైర్మన్, సభ్యుల నియామకానికి సంబంధించి ఎలాంటి అర్హతలు, విధానాన్ని పేర్కొనకపోయినప్పటికీ కీలకమైన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు చైర్మన్, సభ్యుల పదవులకు తగ్గట్టుగా అర్హత, సామర్థ్యం ఉండాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో నియామకాలు చేపట్టేముందు వారి పూర్వాపరాలను విచారించడంతోపాటు నిశితంగా పరిశీలన జరపాల్సి ఉందని తెలిపింది. రాజ్యాంగంలోని అధికరణ 316 ప్రకారం కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం చేసే అధికారం గవర్నర్‌కు ఉందని, నియామక విధానం లేనంత మాత్రాన ప్రభుత్వం తన విచక్షణాధికారంతో ఇష్టం వచ్చిన వారికి ఎంపిక చేయడం కాదని వ్యాఖ్యానించింది.

నిబంధనల మేరకే నియామకమన్న న్యాయవాది

'సభ్యులపై వ్యక్తిగతంగా ఎవరికీ అభ్యంతరాలు లేవు. నియామకాలు చట్ట విరుద్ధం. నియమితులైన వారిలో రమావత్ ధన్‌సింగ్ జీహెచ్‌ఎంసీలో ఈఎన్‌సీగా పదవీ విరమణ పొందారు. లింగారెడ్డి ప్రైవేట్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సుమిత్ర ఆనంద్ జెడ్పీ స్కూల్లో తెలుగు టీచరు. ఎ.చంద్రశేఖర్‌రావు ఆయుర్వేదిక్ డాక్టర్. రవీందర్‌రెడ్డి రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్. ఆర్.సత్యనారాయణ ఎమ్మెల్సీగా సేవలందించారు. నిబంధనల ప్రకారం రాష్ట్ర సివిల్ సర్వీసెస్‌లో ఫస్ట్ క్లాస్ గెజిటెడ్ పోస్టుల్లో పని చేసిన వారే అర్హులు' అని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపించారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం

- బేగంపేట్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్
- నేడు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు హాజరవనున్న ద్రౌపదీ ముర్ము



రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు వస్తున్న గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోని కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో మంత్రులు మహమూద్‌అలీ, సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, వెంకటేష్ నేత, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, నవీన్ కుమార్, మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, త్రివిధ దళాల అధికారులు ఉన్నారు. శుక్రవారం రాత్రి రాష్ట్రపతి రాజ్‌భవన్‌లో బస చేస్తారు. కార్యక్రమం అనంతరం శనివారం ఉదయం 11-15 గంటలకు రాష్ట్రపతి ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నట్టు అధికారులు తెలిపారు.

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శనివారం నిర్వహించనున్న ఫ్లైట్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానున్నారు. పరేడ్ రివ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరవుతున్న రాష్ట్రపతి.. యువ కేడెట్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. శిక్షణ పూర్తి చేసిన యువ కేడెట్లతో ప్రతిజ్ఞ చేయించడంతోపాటు శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫ్లైట్ కేడెట్‌కు రాష్ట్రపతి గౌరవ ఖడ్గాన్ని ముర్ము బహూకరిస్తారు.

తెయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి

- నియామక ఉత్తర్వులు ఇచ్చిన వీసీ రవీందర్ గుప్తా
- వెంటనే బాధ్యతలు స్వీకరించిన యాదగిరి



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఎంపిక చేసిన ప్రొఫెసర్ ఎం.యాదగిరికే శుక్రవారం వీసీ డి.రవీందర్‌గుప్తా నియామక ఉత్తర్వులు అందజేశారు. వెంటనే యాదగిరి ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్, ఈసీ మెంబర్ల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు యాదగిరి వెంటనే రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం వర్సిటీలో రిజిస్ట్రార్ నియామకం విషయంలో వివాదం నెలకొనడంతో జీతాలు రాక అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఐదు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. భోజనాలు వండే వారు లేక విద్యార్థులు పస్తులుంటూ భిక్షాటన చేసి కడుపునింపుకుంటున్నారు. ఇది మీడియాలో రావడంతో ప్రభుత్వ పెద్దలు వీసీ తీరుపై కన్నెర్ర చేశారు. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గిన వీసీ చివరికి మనసు మార్చుకుని ఈసీ ఎంపిక చేసిన ప్రొఫెసర్ యాదగిరినే రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొన్ని నెలలుగా ఈసీ నిర్ణయాలను సవాల్ చేస్తూ వీసీ ఏకంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోవడంతో సర్కారు కన్నెర్ర చేసింది. వీసీ అవినీతి, అక్రమాలపై ఈసీ ఫిర్యాదుతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా దాడులు చేయించింది. వీసీ తన మెడకు అవినీతి ఉచ్చు బిగుసుకుంటుండటంతో ఆందోళనకు గురయ్యారు. అన్ని దారులు మూసుకుపోవడంతో దిగివచ్చారు. ఇప్పటికైనా వర్సిటీ పాలన గాడిలో పడుతుందని విద్యార్థులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలకు ఎంబీబీఎస్ విద్యార్థులు!

ప్రతి వైద్య విద్యార్థికి ఐదు కుటుంబాల దత్తత

- ఆ కుటుంబాల్లో వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పరిశీలన
- రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు సూచించాల్సిన బాధ్యత
- మార్గదర్శకాలు జారీ చేసిన జాతీయ మెడికల్ కమిషన్
- రాష్ట్రంలో దీని అమలుకు కాళోజీ విశ్వవిద్యాలయం కసరత్తు

వైద్య విద్యార్థులు గ్రామాలకు వెళ్లి కుటుంబాలను దత్తత తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఫ్యామిలీ డాక్టర్‌లా వ్యవహరించాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) సూచించింది. క్షేత్రస్థాయిలో వైద్యారోగ్య పరిస్థితులపై అవగాహన, వైద్య విద్యను పూర్తిచేసే లోగానే తగిన అనుభవం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. కుటుంబాల దత్తతను ఇప్పటికే ఎంబీబీఎస్ పాఠ్య ప్రణాళికలో చేర్చినా.. తాజాగా దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీచేసింది. దీని ప్రకారం.. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలోనే కుటుంబాల దత్తత ప్రణాళిక ప్రారంభమవుతుంది. ఒక్కో వైద్య విద్యార్థికి కనీసం 5 కుటుంబాలను కేటాయిస్తారు.

-సాక్షి, హైదరాబాద్



ఒక ఫ్యామిలీ డాక్టర్‌లా..

→ దత్తత తీసుకున్న కుటుంబాల వివరాలన్నీ నమోదు చేసేందుకు లాగ్ బుక్‌ను నిర్వహించాలి. ఒక్కో కుటుంబానికి ప్రత్యేకంగా కొన్ని పేజీలు కేటాయించి.. వారి పేర్లు, వయసు, నివసించే ఇల్లు, పరిసర ప్రాంతాల పరిస్థితి, వారి ఆరోగ్యం, వైద్య పరీక్షల ఫలితాలు, అవసరమైన చికిత్సలు వంటివన్నీ నమోదు చేయాలి. తమకు కేటాయించిన కుటుంబాలకు ఒక ఫ్యామిలీ డాక్టర్ తరహాలో వ్యవహరించాలి. వ్యక్తులందరి ఆరోగ్యాన్ని తరచూ పరిశీలించాలి. వైద్య పరీక్షలు చేయించాలి.

→ కుటుంబంలోని వారికి రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపం, బీపీ, మధుమేహం, మూత్రపిండ వ్యాధులు, ఇతర ఏవైనా స్థానిక వ్యాధులుంటే గుర్తించి తగిన వైద్యం అందించాలి. రోగనిరోధకశక్తి పెంపొందించుకునే మార్గాలను, వ్యాయామం, యోగా వంటివి సూచించాలి. పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించాలి. ఏవైనా వ్యసనాలు ఉంటే వాటి నుంచి బయటపడేలా అవగాహన కల్పించాలి.

→ కుటుంబంలోని వారికి ఏదైనా అత్యవసర వైద్య సాయం అవసరమైతే వెంటనే తనను సంప్రదించేలా ఫోన్ నంబర్ ఇవ్వాలి. వారికి వైద్య సాయం చేయాలి. పైస్థాయి వైద్యాధికారులకు సమాచారమిచ్చి తదుపరి వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా సదరు కుటుంబాలకు అవసరమైన వైద్యం అందించేలా చూడాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోనైతే అక్కడున్న రాయితీ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.



→ ఆరో సెమిస్టర్ నాటికి ఎంబీబీఎస్ విద్యార్థులు ఆయా కుటుంబాలకు సంబంధించిన పూర్తి హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేయాలి.

→ గ్రామంలో ఎన్ఎస్ఎస్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. వాటిని డాక్యుమెంటేషన్ చేయాలి. అందుకు సంబంధించిన ఫొటోలను తీయాలి. అవసరమైతే ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల సహకారం తీసుకోవాలి.

→ ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు దత్తత కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు వెల్లడించారు.

ఇంకా 1166 కాపలా లెవల్ క్రాసింగ్స్!

- వాటిని తొలగించడంలో రైల్వే తీవ్ర జాప్యం
- ఈ ఏడాది 80 క్రాసింగ్స్ తొలగించాలని లక్ష్యం
- ఇప్పటికి ఏడు చోట్ల మాత్రమే పనులు పూర్తి
- రైలు పట్టాలు దాటే వేళ భయం భయం



సాక్షి, హైదరాబాద్: యుద్ధప్రాతిపదికన కాపలా లేని లెవల్ క్రాసింగ్స్‌ను గతంలో తొలగించిన రైల్వే శాఖ, ఇప్పుడు కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్స్ (మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్స్)ను తొలగించే విషయంలో చేతు లెత్తేస్తున్నట్టే కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 80 మ్యాన్డ్‌లెవల్ క్రాసింగ్స్‌ను తొలగించినట్టు అధికారులు ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 80 క్రాసింగ్స్‌ను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. కానీ, ఆర్థిక సంవత్సరం మొదలై రెండున్నర నెలలు గడుస్తున్నా కేవలం ఏడు చోట్ల మాత్రమే పనులు పూర్తయినట్టు తెలిసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇంకా 1166 మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్స్ ఇంకా ఉన్నాయి. ఇవన్నీ తొలగించటం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఫలితంగా ప్రజలే అప్రమత్తంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఉంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీ ప్రమాదాలు తప్పవు.

రైల్వే విన్నపాన్ని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

గతంలో చాలా ప్రాంతాల్లో కాపలా లేని లెవల్ క్రాసింగ్స్ ఉండేవి. ఆయా చోట్ల పట్టాలు దాటుతూ పాదచారులు, వాహనదారులు రైలు ప్రమాదాలకు గురై దుర్మరణం పాలయ్యేవారు. వాటిని మోదీ ప్రభుత్వం వచ్చాక యుద్ధప్రాతిపదికన తొలగించారు. ఇప్పుడు కాపలాదారు ఉండే లెవల్ క్రాసింగ్స్ వద్ద రోడ్ అండర్ బ్రిడ్జీ(ఆర్‌యూబీ)లు, రోడ్ ఓవర్ బ్రిడ్జీ(ఆర్‌ఓబీ)లు, తక్కువ ఎత్తున్న అండర్‌పాస్‌లను నిర్మించటం ద్వారా గేట్లు తొలగించాలన్నది లక్ష్యం. కానీ ఒక్క ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే ఆర్‌ఓబీలకైతే ఒక్కోదానికి దాని నిడివిని బట్టి రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది రైల్వేకు భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దీంతో వాటిని చేపట్టే విషయంలో మీన మేషాలు లెక్కిస్తోంది. వీలైనన్ని ఆర్‌యూబీలతో సరిపెట్టే ప్రయత్నం చేస్తున్నా.. బడ్జెట్ పెద్ద అడ్డంకిగా మారింది. దీంతో రాష్ట్రప్రభుత్వాలతో సంయుక్తంగా పనులు చేపడుతోంది. కానీ, వీటికి నిధులిచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపటం లేదు

ప్రజలూ జర భద్రం: దక్షిణ మధ్య రైల్వే

లెవల్ క్రాసింగ్స్ వద్ద అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే తాజాగా విజ్ఞప్తి చేసింది. 'ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వేస్' విజ్ఞప్తి మేరకు జూన్ 15ను లెవల్‌క్రాసింగ్స్ అవేర్‌నెస్ డేగా జరుపుతున్నారు. దీన్ని పురస్కరించుకుని లెవల్ క్రాసింగ్స్ విషయంలో ప్రజలను మరింత చైతన్యవంతును చేసేందుకు నాటికలు లాంటి ప్రదర్శనల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించింది. రైలు వచ్చేముందు గేటు పడటం, గేటు తెరుచుకునేవరకు ఓపికగా ఎదురుచూడటం, గేటు కింద నుంచి వెళ్లకపోవటం, పట్టాలు దాటేప్పుడు రైలు వస్తుందో లేదో అటూ ఇటూ చూసి వెళ్లటం లాంటి అంశాలను జనం మదిలో ఉంచుకోవాలని సూచిస్తోంది.



జర్నలిస్టులకు స్థలాలపై కేటీఆర్ సానుకూలత

- టీయూడబ్ల్యూజే వెల్లడి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై మంత్రి కె.తారకమారారావు సానుకూలంగా స్పందించారని టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో సమావేశమై దీనిపై సుదీర్ఘంగా చర్చించినట్టు వెల్లడించారు. నగరంలోని జర్నలిస్టుల సంఖ్య ఎంత? అర్హులైన వారె ఎంతమంది? అందరికీ ఇళ్ల కేటాయించడానికి ఎంత స్థలం అవసరం? తదితర అంశాలను మంత్రి ఆరా తీశారని పేర్కొన్నారు. జేఎన్‌జే సొసైటీకి గత ప్రభుత్వం కేటాయించిన స్థలాలను సొసైటీకి అప్పగించేందుకు సైతం మంత్రి సానుకూలత వ్యక్తం చేశారన్నారు. నగరంలోని అర్హత గల ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల ఇచ్చే అంశంపై వారం పది రోజుల్లో స్పష్టత ఇచ్చే దిశగా చర్చలు జరిగినట్టు తెలిపారు. 4 వేల మంది జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాల కేటాయింపు దిశగా ముందడుగు పడిందన్నారు.

'కల్తీ కల్లు'పై ఏం చర్యలు తీసుకున్నారు?

- కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కల్తీ కల్లు తయారీదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? మహబూబ్‌నగర్ జిల్లాలో గత ఏప్రిల్‌లో కల్తీ కల్లు తాగి ముగ్గురు మృతి చెందిన ఘటనలో ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులైన ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, మహబూబ్‌నగర్ జిల్లా డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లు, ఎస్ఐలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

అప్సర హత్య కేసులో సీన్ రీ కన్‌స్ట్రక్షన్

శంషాబాద్ రూరల్: అప్సర హత్య కేసులో పోలీసులు శుక్రవారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. కోర్టు అనుమతితో నిందితుడు అయ్యగారి వెంకట సూర్య సాయి కృష్ణను రెండు రోజుల కస్టడీకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరించారు. నర్కూడ సమీపంలో శంషాబాద్–షాబాద్ రోడ్డు పక్కన ఉన్న వెంచర్‌లో అప్సర తలపై రాయితో మోది సాయికృష్ణ హత్య చేసిన విషయం తెలిసిందే. సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా పోలీసులు నిందితుడు సాయికృష్ణను వెంచర్ వద్దకు తీసుకెళ్లి ఆధారాలు సేకరించారు. వెంచర్ సమీపంలో చిన్న బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి రాళ్లగూడ, శంషాబాద్ బస్టాండ్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డైన సీసీ టీవీ ఫుటేజీని కూడా పోలీసులు సేకరించారు. సరూర్‌నగర్ మండల కార్యాలయం వెనకాల అప్సర మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రాంతానికి కూడా నిందితుడిని తీసుకెళ్లిన పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉండగా పోలీసు కస్టడీ ముగియడంతో నిందితుడు సాయికృష్ణను శనివారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

పల్లెవెలుగు బస్సుల్లో టీ9 టికెట్

- 60 కి.మీ. పరిధిలో రూ.100తో అప్ అండ్ డౌన్ జర్నీ
- మహిళలు, వృద్ధులకు మాత్రమే అవకాశం
- రేపటి నుంచి అమలులోకి



సాక్షి, హైదరాబాద్: పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వృద్ధులు, మహిళల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా టీ9 పేరుతో కొత్త టికెట్‌ను అందుబాటులోకి తెస్తోంది. ప్రయాణ చార్జీ భారాన్ని కొంతమేర తగ్గించే ఈ టికెట్లను ఆదివారం నుంచి అమలులోకి రానుంది. పల్లె వెలుగు బస్సుల్లో 60 కి.మీ. నిడివి ప్రయాణించేవారు రూ.100 చెల్లించి ఈ టీ9 టికెట్ కొంటే, అప్ అండ్ డౌన్‌కు అదే వర్తిస్తుంది. విడిగా మరో టికెట్ కొనాల్సిన అవసరం ఉండదు. 60 కి.మీ. పరిధి దాటితే మాత్రం ఇది వర్తించదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఈ వెసులుబాటు ఉంటుంది. పల్లెవెలుగు బస్సుల్లో 60 కి.మీ. నిడివికి రెండువైపులా (అప్ అండ్ డౌన్) ప్రయాణానికి దాదాపు రూ.120 టికెట్ చార్జి అవుతుంది. ఒకేసారి టీ9 టికెట్ కొంటే రూ.100 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో కనీసం రూ.20 ఆదా అవుతుంది. ఆ ప్రయాణ మార్గంలో టోల్‌గేట్ ఉంటే టికెట్‌పై రూ.20 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. టీ9 టికెట్‌తో టోల్ చార్జి భారం కూడా ఉండదు. మొత్తంగా రూ.40 ఆదా అయినట్టవుతుంది.

ఆటోల దూకుడుకు కళ్లెం

చాలా గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలు విపరీతంగా పెరిగిపోయి, బస్సు ప్రయాణికులను ఎగరేసుకుపోతున్నాయి. ఇప్పుడు ఈ టికెట్ రూపంలో కనీసం రూ.20 ఆదాతో ఆటో తాకిడి నుంచి బయటపడేందుకు యత్నించనుంది. వెళ్లేప్పుడు ఓ పల్లెవెలుగు బస్సులో ఈ టీ9 టికెట్ కొంటే, వచ్చేప్పుడు మరో పల్లెవెలుగు బస్సులో దాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, దాన్ని ఆ మార్గంలో ఒకే ప్రయాణానికి మాత్రమే వాడాల్సి ఉంటుంది. మహిళలు, 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులు వయసు ధ్రువీకరణ పత్రం చూపి ఈ వెసులుబాటు పొందాల్సి ఉంటుంది. సాయంత్రం 6తో ఈ అవకాశం ముగియనున్నందున కండక్టర్లు సాయంత్రం 4 వరకు మాత్రమే ఆ టికెట్లు జారీ చేస్తారు. కాగా, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే వృద్ధులు, మహిళలకి ఆర్థికంగా వెసులుబాటు కల్పించేలా ఈ కొత్త టికెట్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బస్‌భవన్‌లో ఈ టికెట్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ టికెట్‌కు సంబంధించిన సమాచారం కావాలనుకునేవారు ఆర్టీసీ కాల్‌సెంటర్ (ఫోన్ నెంబర్లు 040-69440000, 040-23450033)ను సంప్రదించొచ్చని సజ్జనార్ తెలిపారు.

లైఫ్‌స్టైల్ గ్రూప్ డైరెక్టర్ ఇంట్లో సోదాలు

- వైష్ణవి గ్రూప్, హోటల్ ఎట్ హోంల్లోనూ ఐటీ దాడులు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు, కార్యాలయాల్లో కొనసాగిన తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు, కార్యాలయాల్లో వరుసగా మూడోరోజూ ఐటీ దాడులు కొనసాగాయి. అయితే శుక్రవారం మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మర్రి జనార్దన్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డితో పాటు లైఫ్‌స్టైల్ గ్రూప్ కంపెనీల డైరెక్టర్ గజ్జల మధుసూదన్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం నాటి సోదాల్లో మొత్తం 70 బృందాలు పాల్గొన్నట్టు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మధుసూదన్‌రెడ్డి చేసిన భూ లావాదేవీలు, ఇందుకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలపై ఐటీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఎల్బీనగర్‌లో 23 ఎకరాల ప్రాజెక్ట్ విషయంలో జరిగిన భారీ నగదు లావాదేవీపై ప్రధానంగా ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. మధుసూధన్ రెడ్డితో పాటు అతడి భార్య, కుమారుడిని సైతం ప్రశ్నించినట్టు తెలిసింది. లైఫ్‌స్టైల్ గ్రూప్ కంపెనీల్లో మధుసూదన్‌రెడ్డి కుమారుడు సుదేశ్ రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి వీరంతా సిండికేట్‌గా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్టు లభించిన ఆధారాల మేరకు సోదాలు జరుపుతున్నట్టు తెలిసింది. ఇలావుండగా వైష్ణవి గ్రూప్ స్థిరాస్తి సంస్థ, హోటల్ ఎట్ హోం, వాటి అనుబంధ సంస్థల్లోనూ ఐటీ సోదాలు జరిగాయి. మరోవైపు ఐటీ అధికారులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళనలు శుక్రవారం కూడా కొనసాగాయి. కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఇంటి వద్ద కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యేని చూపించాలని అభిమానులు, కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఆయన బాల్కనీలోకి వచ్చి కార్యకర్తలకు అభివాదం చేశారు. ఇంటి వద్ద ఎలాంటి ఆందోళనలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

మహిళలను వేధించిన వ్యక్తిపై చర్యలేవి?

- ఇంటర్ విద్య పరిరక్షణ సమితి కన్వీనర్ రామకృష్ణ గౌడ్

సాక్షి, హైదరాబాద్: మహిళలను వేధించడంతోపాటు పలు రకాల ఆరోపణలు ఎదుర్కొంటూ, ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్‌గా చెప్పుకుంటున్న పి.మధుసూదన్ రెడ్డిని లెక్చరర్ ఉద్యోగం నుంచి తొలగించాలని లేదంటే భారీ ఎత్తున ఉద్యమిస్తామని తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి హెచ్చరించింది. మహిళా మంత్రి ఉన్న విద్యాశాఖలోనే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అతడిపై ఉన్న క్రిమినల్ కేసుల దృష్ట్యా తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని ఈ ఏడాది ఏప్రిల్ 6న ప్రభుత్వానికి ఇంటర్మీడియెట్ ఉన్నతాధికారి సిఫార్సు చేసినా, ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మహిళా కమిషన్ సూచనలతో మధుసూదన్ రెడ్డిని ఇంటర్మీడియెట్ కమిషనర్ నవీన్ మిట్టల్ కమిషనర్ కార్యాలయం, బోర్డు కార్యాలయం పరిసర ప్రాంతాలకు రానివ్వకుండా నిషేధ ఆజ్ఞలు జారీ చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

త్వరలో ఆక్సిజన్-18 ప్లాంట్ జాతికి అంకితం!

- చేయనున్న ప్రధాని మోదీ
- మణుగూరు కర్మాగారాన్ని సందర్శించిన ఉన్నతస్థాయి కమిటీ

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మణుగూరు భారజల కర్మాగారాన్ని కేంద్ర ఉన్నత స్థాయి కమిటీ గురు, శుక్రవారాల్లో సందర్శించింది. ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాలతో భారత అణుశక్తి విభాగం(డీఏఈ) సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ సభ్యులు కర్మాగారాన్ని రెండు రోజుల పాటు పరిశీలించారు. భారజల కర్మాగారంలో ఇటీవల ఏర్పాటుచేసిన ఆక్సిజన్-18 ప్లాంట్‌ను ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఆటమిక్ రీసెర్చ్(ఐజీసీఏఆర్) డైరెక్టర్ వెంకట్రామన్, భారజల బోర్డు డైరెక్టర్ సత్యకుమార్ ఆధ్వర్యాన శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. దేశంలోనే తొలిసారి ఆక్సిజన్-18 ప్లాంట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయగా నిర్వహణ విజయవంతం కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్లాంట్‌పై ఉన్నత స్థాయి కమిటీ కేంద్రానికి నివేదిక ఇవ్వనుంది. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తారని సమాచారం. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన మణుగూరు భారజల కర్మాగారానికి ఆక్సిజన్-18 ప్లాంట్‌తో మరింత ప్రత్యేకత రానుంది.

ఆక్సిజన్ – 18 అంటే?

- ఆక్సిజన్ – 18 అనేది ఆక్సిజన్‌లోని ప్రత్యేక ఐసోటోప్
- నాడీ, హృదయనాళ వ్యవస్థల వ్యాధుల కారణాలను గుర్తించడానికి, ఊపిరితిత్తుల వ్యాధులను నిర్ధారించడానికి, మెదడు వ్యాధుల అధ్యయనానికి, చికిత్సలో ఔషధాల ప్రభావాన్ని నిర్ణయించడానికి ఉపయోగపడుతుంది. దీని ఉత్పత్తితో కేన్సర్ చికిత్సకు వాడే ఔషధాల్లో కీలక మలుపు వస్తుందని చెబుతున్నారు.

యాదాద్రి భక్తులకు రేకులతో క్యూలైన్ షెడ్లు

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల చర్యలు



ఆలయ ఉత్తర రాజగోపురం ఎదుట వేస్తున్న షెడ్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు వర్షానికి ఎండలకు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ ఉత్తర భాగంలో భక్తులు నడిచేందుకు రేకులతో కూడిన క్యూలైన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల వేసవి కాలంలో మండుటెండలకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయాధికారులు తాత్కాలిక చలువ పందిళ్లు వేశారు. వీటిపై కోతులు ఎగరడంతో పాటు ఈదురుగాలులకు కొట్టుకుపోతున్నాయి. వచ్చే వర్షాకాలంలో భక్తులు ఇబ్బందులు పడకుండా అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచించి రేకుల షెడ్లతో కూడిన లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తర రాజగోపురం దిశలో ప్రస్తుతం వీటిని బిగిస్తున్నారు.

ఇంద్రియాలకు గోచరం కాని, నాశనం లేని ఆ పరమాత్మ భావమే చేరవలసిన ఉత్తమ మార్గమని రుషులు చెబుతారు. దేనిని పొందితే ప్రాణులు తిరిగి జన్మించరో అదే, ఆ సర్వోత్తమ స్థానమే నేను.

– భగవద్గీత

సాక్షి

శనివారం, 17 జూన్ 2023

బోరిస్ పతనావస్థ!

'అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగింద'ని నానుడి. బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు ఇది అక్షరాలా సరిపోతుంది. ఒక సాధారణ స్థాయి నుంచి రాజకీయాల్లోకొచ్చి ప్రధాని పీఠం వరకూ వెళ్లిన జాన్సన్ నిరుడు జూలైలో ఆ పదవి పోగొట్టుకోవటమే కాదు... గతవారం ఎంపీ పదవికి కూడా రాజీనామా చేయక తప్పలేదు. తాజాగా సభాహక్కుల సంఘంతో అబద్ధాల కోరుగా ముద్రేయించుకున్నారు. ఎంపీగా తప్పుకున్నారు గనుక సరిపోయిందిగానీ, లేకుంటే ఆయన మూణ్ణెల్లపాటు దిగువ సభ నుంచి సస్పెండయ్యేవారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుత స్థానాల్లో ఉండేవారు నిజాయితీతో మెలగకపోతే, విశ్వసనీయతను ప్రాణప్రదంగా భావించకపోతే ఏ గతి పడుతుందో చెప్పడానికి జాన్సన్ ప్రస్థానం ఒక ఉదాహరణ. మనకు జాన్సన్ చేసింది పెద్ద తప్పు అనిపించకపోవచ్చు. కానీ బ్రిటన్‌లో అది చెల్లుబాటు కాదు. కరోనా మహమ్మారి తీవ్రంగా విజృంభిస్తున్న కాలంలో జాన్సన్ తన మిత్ర బృందాలతో విందుల్లో మునిగారన్నది ప్రధాన ఆరోపణ. ఆ కాలంలో దేశమంతా లాక్ డౌన్ అమల్లో వుంది. ప్రధానిగా 2020 మార్చి 23న లాక్‌డౌన్ విధించింది ఆయనే. మరో నాలుగు రోజులకు కరోనా వాతపడ్డారు కూడా. లాక్‌డౌన్ వల్ల దిగజారిన ఆర్థిక పరిస్థితులతో, కరోనా తీవ్రతతో జనం అల్లాడుతుంటే ఆ సమయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలు చెలరేగాయి. కనీసం అప్పుడైనా ఆయన మేల్కొనివుంటే వేరేగా ఉండేది. కానీ విందులు జరగడం అబద్ధమని ఒకసారి, జరిగినా నిబంధనలు ఉల్లంఘించలేదని మరోసారి బొంకారు. పైగా పార్టీలోని తన వ్యతిరేకులనూ, దర్యాప్తు చేస్తున్న సభా హక్కుల సంఘాన్నీ భ్రష్టుపట్టించే ప్రయత్నం చేశారు.

లండన్ మేయర్‌గా ఉన్నకాలంలో జాన్సన్ ఓసారి అమెరికా వెళ్లారు. ఆయన్ను చూసిన ఒక పౌరుడు జాన్సన్‌ను దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దూకుడుగా ప్రచారం చేసుకుంటున్న ట్రంప్‌గా పొరబడ్డారట. ఇలా పొరబడిన పౌరుడెవరోగానీ ఇద్దరిలోనూ పోలికలు న్నాయన్నది వాస్తవం. భౌతికమైన పోలికల మాట అటుంచి తమకొచ్చిన అవకాశాన్ని దుర్వినియోగపర్చటంలో ఇద్దరూ ఇద్దరే. తోచినట్టు మాట్లాడటం, ఇష్టానుసారం వ్యవహరించటం ఇద్దరిలోనూ ఉంది. అమెరికాలో ట్రంప్‌ను దించటానికి ఎన్నికల వరకూ జనం వేచిచూడాల్సి వచ్చింది. కానీ పార్టీ గేటు వ్యవహారం గుప్పుమన్నాక జాన్సన్‌ను సొంత పార్టీయే దించేసింది. నిజానికి పార్టీ గేటు వ్యవహారం ప్రధానిగా జాన్సన్ వరసబెట్టి చేసిన నిర్వాకాలకు పరాకాష్ఠ. ఒక చట్ట ఉల్లంఘనలో పోలీసులు తనకు జరిమానా విధించారని నిరుడు ఏప్రిల్‌లో ఆయనే స్వయంగా ప్రకటించారు. ప్రధాని స్థాయి నేత జరిమానా చెల్లించవలసి రావటం దేశ చరిత్రలో అదే తొలిసారి. అయినా అందుకుగల కారణమేమిటో ఆయన చెప్పలేదు. ఈలోగా తన అధికారిక నివాసాన్ని విలాసవంతంగా మార్చడానికి చట్టవిరుద్ధంగా భారీ మొత్తం ఖర్చు చేశారన్న ఆరోపణలొచ్చాయి. ఇది చాలదన్నట్టు అత్యాచార ఆరోపణల్లో జాన్సన్‌కు సన్నిహితుడిగా ఉండే ఎంపీ అరెస్టయ్యాడు. ఆయన మిత్రబృందంలోని మరో మాజీ ఎంపీకి బాలుడిపై లైంగిక దాడి చేశారన్న ఆరోపణ రుజువై శిక్షపడింది. ఆ తర్వాత 'పార్టీ గేట్' గుప్పుమంది. పర్యవసానంగా వరస సర్వేల్లో జాన్సన్ రేటు పడిపోయింది. ఆయనపై జనం ఆగ్రహావేశాలతో ఉన్నట్టు వెల్లడైంది. దాంతో 40 శాతం మంది పార్టీ ఎంపీలు జాన్సన్‌ను పదవి నుంచి తప్పించాలని నిశ్చయించుకున్నారు. అయినా పార్టీలో అవిశ్వాసం నుంచి గట్టెక్కారు. కానీ మాజీ ఎంపీపై ఉన్న కేసు గురించి తెలిసినా ఆయన్ను నెత్తినబెట్టుకున్నారన్న నిజాన్ని పార్టీ సభ్యులు సహించలేకపోయారు. అది తప్పేనని జాన్సన్ అంగీకరించినా లాభం లేకపోయింది. అంతవరకూ మద్దతుదార్లుగా ఉన్న అప్పటి ఆర్థికమంత్రి, ప్రస్తుత ప్రధాని రిషి సునాక్, ఆరోగ్యమంత్రి సాజిద్ జావేద్ వంటివారు నిరుడు జూలైలో తమ పదవులకు రాజీనామా చేశారు. పలువురు మంత్రులు సైతం వారి బాట పట్టడంతో జాన్సన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.

తాజాగా సభాసంఘం అభిశంసన కన్సర్వేటివ్ పార్టీలో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది వేచిచూడాలి. వచ్చే సోమవారం ఆ నివేదికపై జరిగే చర్చ సందర్భంగా పార్టీలో లుకలుకలు బయటపడక తప్పదు. నివేదికకు వ్యతిరేకంగా ఓటేయొద్దని పార్టీ ఎంపీలను బోరిస్ జాన్సన్ కోరుతున్నా, తన తప్పులకు మాత్రం పశ్చాత్తాపం ప్రకటించడం లేదు. సరిగదా ఇదంతా ప్రతీకార రాజకీయాల పర్యవసానమని చెప్పుకొస్తున్నారు. కనీసం ఈ క్షణంలోనైనా పశ్చాత్తాప పడని నేతను ఎవరైనా క్షమించగలరా? కన్సర్వేటివ్ పార్టీలో జాన్సన్ ఎదిగిన క్రమం అసాధారణమైనది. పాత్రికేయుడిగా ఉంటూ పార్టీలోకొచ్చిన జాన్సన్ 2008 నుంచి 2016 వరకూ రెండుసార్లు లండన్ మేయర్‌గా ఉన్నారు. పరిస్థితులు కలిసొచ్చి థెరిస్సా మే ప్రధాని పదవి నుంచి తప్పుకున్నాక 2019లో ఆ పదవి చేజిక్కించుకున్నారు. అదే సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయాన్నందించారు. 1987 తర్వాత అంత పెద్ద మెజారిటీతో కన్సర్వేటివ్‌లు నెగ్గటం అదే తొలిసారి. ఒంటరి తల్లుల సమస్య మొదలుకొని స్వలింగ సంపర్కం, బ్రిటన్ వలసవాదం, బ్రెగ్జిట్ వరకూ సమయానుకూలంగా అభిప్రాయాలు మార్చుకుంటూ వచ్చిన జాన్సన్ వంటివారిని కన్సర్వేటివ్ పార్టీ నెత్తినపెట్టుకోవటం మొదటినుంచీ విశ్లేషకుల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంది. పోతూ పోతూ జాన్సన్ అంటించిన బురద నుంచి ఆ పార్టీ ఏనాటికైనా బయటపడగలదా అన్నది సందేహమే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.చతుర్దశి ఉ.8.31 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: రోహిణి సా.4.12 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ.7.55 నుండి 9.11 వరకు, తదుపరి రా.10.43 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: ప.12.43 నుండి 2.31 వరకు

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఇది శూద్రులపై వివక్షా?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

రాజ్‌పుత్ (క్షత్రియ) ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య ఛైర్మన్ అయిన బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని మహిళా రెజ్లర్‌లు ఫిర్యాదు చేశారు. అయితే బ్రిజ్‌భూషణ్ మాత్రం కేంద్ర ప్రభుత్వం తనపై చర్య తీసుకుంటుందేమోనన్న చీకూచింతా లేకుండా, నేటికీ ఎంపీగా కొనసాగుతూనే ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన శూద్ర (జాట్) మహిళా రెజ్లర్‌లు వేసవి గాడ్పుల మధ్య ఢిల్లీ వీధులలో పోరాడుతూ ఉంటే వారిని పట్టించుకోవడం లేదు. రైతుల ఉద్యమ సమయంలో కూడా ప్రభుత్వం ఉదాసీనతను చూపింది. అదే విధమైన ఉదాసీనతను ఇప్పుడు మహిళా రెజ్లర్‌ల విషయంలో చూపిస్తోంది. రెజ్లర్‌లకు దేశవ్యాప్త మద్దతు లభించడం ఎంతైనా అవసరం.

ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 2017 మార్చి నుండి ఆ రాష్ట్రంలో 186 ఎన్‌కౌంటర్లు జరిగాయని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' జరిపిన పోలీసుల రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. అంటే ప్రతి 15 రోజులకు ఒకరికి పైగా! అయితే బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మాత్రం కేంద్ర ప్రభుత్వం తనపై చర్య తీసుకుంటుదేమోనన్న చీకూచింతా లేకుండా, తన సామాజిక వర్గానికే చెందిన కేంద్ర క్రీడా శాఖ మంత్రి మద్దతుతో నేటికీ ఎంపీగా కొనసాగుతూనే ఉన్నారు. యోగి ఆదిత్యనాథ్ కూడా దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన శూద్ర (జాట్) మహిళా రెజ్లర్‌లు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా అసాధారణమైన వేసవి గాడ్పుల మధ్య ఢిల్లీ వీధులలో న్యాయం కోసం పోరాడుతూ ఉంటే పట్టించుకోకుండా బ్రిజ్‌భూషణ్‌కే తన పూర్తి మద్దతు ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది.

రాజ్‌పుత్ (క్షత్రియ) ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌ఐ) ఛైర్మన్ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేష్ ఫొగాట్ నెలన్నర క్రితమే ఫిర్యాదు చేశారు. ఆయన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దేహదార్ఢ్యం కలిగిన భారతీయ క్రీడాకారిణులలో ఎక్కువ మంది శూద్ర, దళిత, ఆదివాసీ కుటుంబాల నుంచి వచ్చినవారే. హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలోని జాట్ కులం తమ పిల్లలకు కుస్తీలో శిక్షణ ఇప్పించడంలో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుత ఉదంతంలో బాధితులైన మహిళా రెజ్లర్‌ల గోడును ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అగ్రవర్ణ నిందితుడు బ్రిజ్‌భూషణ్‌ను కాపాడేందుకు యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ గట్టి సంకల్పంతో ఉన్నట్లుగా భావించవలసి వస్తోంది.

'వికీపీడియా'లోని బ్రిజ్‌భూషణ్ జీవిత చరిత్రను బట్టి చూస్తే – పోలీసు రికార్డుల ప్రకారం ఆయనపై 1974–2007 మధ్య 38 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం చాలా కేసుల్లో ఆయన నిర్దోషిగా విడుదల అయినప్పటికీ... అంతకుముందు వరకు ఆయనపై దొంగతనం, దోపిడీ, హత్య, హత్యాయత్నం, బెదిరింపులు, అపహరణలు వంటి పలు ఆరోపణలతో గ్యాంగ్‌స్టర్స్, గూండాల వ్యతిరేక చట్టాల కింద ఎఫ్‌ఐఆర్‌లు ఉన్నాయి. తన రాష్ట్రంలోని నేరస్థులందరినీ అంతమొందిస్తానని ప్రకటించిన యోగి, బ్రిజ్‌భూషణ్‌ని కనీసం అరెస్ట్ చేయించేందుకైనా ఇష్టపడటం లేదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సైతం... గత కొన్ని రోజులుగా న్యాయం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్ల మొర ఆలకించడానికి ముందుకు రాలేదు. దీంతో హరియాణా, ఉత్తర ప్రదేశ్‌లలోని జాట్‌లు ధీశాలురైన తమ ఆడబిడ్డల పోరాటానికి మద్దతుగా నిలబడేందుకు నిర్ణయించుకున్నారు. దీనిపై వివిధ ప్రాంతాలలోని ఖాప్ పంచాయితీలను ఆశ్రయించనున్నట్లు వారు ప్రకటించారు. నెమ్మదిగా ఈ ఉద్యమం



ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్ న్యాయ పోరాటం

2020లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా శూద్ర వ్యవసాయ సంఘాలు జరిపిన రైతు ఉద్యమ రూపాన్ని సంతరించుకోనుంది. ఢిల్లీ అంతర్‌మార్గాలలోని ఇండియా గేట్, జంతర్ మంతర్ వగైరాలు ఇప్పటికే ఈ విధమైన ఘర్షణ ధోరణులకు సాక్షులుగా ఉన్నాయి. ఇప్పుడిక జాట్ రైతులకు, యూపీ క్షత్రియ పాలక దళాల మధ్య యుద్ధ వాతావరణాన్ని ఆ మార్గాలు వీక్షించబోతున్నాయి.

తులసీదాసు రచించిన 'రామచరితమానస్'లో శూద్రులను అవమాన పరిచేలా ఉన్న భాషను, భావాన్ని ఖండిస్తూ ఉత్తరప్రదేశ్‌లో 'గర్వ్ సే కహో హమ్ శూద్రా హై' ఉద్యమం జరిగింది. ఇప్పుడేమిటంటే... శూద్ర మహిళలు, అధికారంలో ఉన్న క్షత్రియ పురుషుల మధ్య యుద్ధం మొదలైంది. యూపీ ముఖ్యమంత్రి రాజ్‌పుత్‌యేతర నేరస్థులను హతమార్చమని ఆదేశాలు ఇవ్వడం లేదనీ, ఓబీసీ/ఎస్సీ నేరస్థులను చంపమని ఆదేశిస్తున్నారనీ అఖిలేష్ యాదవ్ చెబుతున్నారు. ఏమైనా దేశం ఇప్పుడు చూస్తున్నటువంటి గొప్ప మహిళా క్రీడాకారుల ఉద్యమాన్ని మునుపెన్నడూ చూడలేదు. నిందితుడిపై చర్య తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించినప్పటికీ నిష్క్రియగా ఉండిపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కంగనా రనౌత్, మధు కిష్వార్ వంటి వార్లైనా కనీసం నోరు మెదపలేదు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలను సమర్థిస్తుండే; ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా మాట్లాడే వారిపై మాటలతో దాడి చేస్తుండే ఈ మహిళలు... మహిళా రెజ్లర్‌లపై జరిగిన లైంగిక వేధింపుల విషయంలో నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు.

జాతీయ మహిళా కమిషన్ కూడా పూర్తిగా మౌనం దాల్చింది. ఎందుకు? ఎందుకంటే వీళ్లంతా తాము అభిమానించే ఆకర్షణీయమైన స్త్రీల దేహాల మాదిరిగా మహిళా మల్లయోధుల శరీరాలు ఉండవని భావిస్తారు. కానీ ఈ రెజ్లర్‌లంతా రైతు కుటుంబాల నుంచి వచ్చినవారు. వారి రెజ్లింగ్ జీవితం ఖరీదైన శిక్షణా సంస్థలలో రూపుదిద్దుకోలేదు. విశ్వ విద్యాలయాలలోని హిందుత్వ మహిళా మేధావులు, లేదా సినీ నటీమణుల మాదిరిగా కారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించినప్పటికీ వారి ఆర్థిక జీవనం మధ్యతరగతి పరిధిని దాటి పోలేదు. వీళ్లపై లైంగిక వేధింపులు జరిగినట్లే... ఆర్థిక స్థోమత, అగ్రకుల మహిళా సినీ నటులపై సాధారణ గ్రామిక వర్గానికి చెందిన పురుషులు వేధింపులు జరిపితే వారిని వెంటనే జైలుకు పంపేవారు.

హిందుత్వ జాతీయవాద న్యాయ వ్యవస్థ అన్నది మతం ఆధారంగా కూడా పని చేయదు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఆవిర్భావం ఉండీ భారతీయ ముస్లిములు, క్రైస్తవులకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరిని కలిగి ఉంది. అయితే ఇండియాలో జాట్‌లు కూడా తమను తాము హిందువులుగా పరిగణించుకుంటారు. వారి మహిళలు శతాబ్దాలుగా కఠినమైన శారీరక శ్రమ ద్వారా భారతదేశ నాగరికతను, సంస్కృతిని నిర్మించడంలో భాగస్వాములుగా ఉన్నవారు. జాట్ మహిళల శారీర శ్రమ వారసత్వం నుండి వారి పిల్లలకు రెజ్లింగ్ నైపుణ్యాలు సంక్రమిస్తున్నాయి.

కాగా రైతుల ఉద్యమ సమయంలో కూడా ప్రభుత్వం ఉదాసీనతను చూపింది. ఎందుకంటే వారు కష్టపడి పని చేసే రైతులు మాత్రమే. వారిలో అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు లేరు. అదే ఉదాసీనతను ఇప్పుడు మహిళా రెజ్లర్‌ల విషయంలో చూపిస్తోంది. ఇప్పుడిక హరియాణా, యూపీలలోని జాట్‌లు తమ మహిళా రెజ్లర్‌లకు మద్దతుగా ఖాప్ పంచాయితీలను ఆశ్రయించాలని చూస్తున్నారు. కులాంతర వివాహాలకు వ్యతిరేకంగా గతంలో వారు ఈ పంచాయితీల సహాయాన్నే కోరారు. వ్యక్తిగతంగా నేను సంప్రదాయ కుల పంచాయితీ వివాద వ్యవస్థను సమర్థించనప్పటికీ తమ సొంత సంస్థ ఛైర్మన్ నుంచి ఎదుర్కొన్న లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళా రెజ్లర్‌లకు దేశవ్యాప్త మద్దతు లభించాలన్నది నా ఆకాంక్ష.

భారత రెజ్లింగ్ సమాఖ్య ఛైర్మన్‌గా బ్రిజ్ భూషణ్ సింగ్‌ను మోదీ ప్రభుత్వం ఎలా నియమించింది? ఆయన జీవితంలో ఆయనకు క్రీడలతో సంబంధం లేదు. అతడి నేరమయ జీవితాన్ని కప్పిపుచ్చేందుకు, రామజన్మ భూమి అంశంలో అతడి ప్రమేయానికి గుర్తింపుగా అత్యంత కీలకమైన ఆ పదవిని కట్టబెట్టినట్లున్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రీడాభివృద్ధి సంస్థలు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల నెట్‌వర్క్ కలిగిన యోగా కేంద్రాల వంటివి కావు. క్రీడలు యువతీయువకుల జీవన్మరణ సాధనతో ముడివడి ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం బ్రిజ్ భూషణ్‌ను డబ్ల్యుఎఫ్‌ఐ ఛైర్మన్ పదవి నుంచి తొలగించి, ఆయనపై ఇప్పటికే నమోదై ఉన్న ఎఫ్‌ఐఆర్ ఆధారంగా తక్షణం విచారణ జరిపి శిక్ష విధించాలి. (గురువారం బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ఆయనపై 'పోక్సో' కేసును తొలగించాలని కూడా నివేదికను సమర్పించారు.)

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పాపం!



82 రెట్లు ఎక్కువ ధనవంతులు కావడానికి దురదృష్టవశాత్తూ దేశాన్ని వదలాల్సి వచ్చిన దేశభక్తులే విదేశాల్లోని ఇండియన్ డయాస్పోరా!

– కాజోల్ శ్రీనివాసన్, కమెడియన్

దానికి పనికొస్తోంది!



దాదాపు ప్రతిరోజూ నేను 'నెట్‌ఫ్లిక్స్' ఓపెన్ చేస్తాను; ఏం చూడాలా అని 30 నుంచి 45 నిమిషాలు అటూయిటూ స్క్రోల్ చేస్తాను; ఇంతలో నిద్ర ముంచుకొస్తుంది; చివరకు ఏమీ చూడకుండానే రోజు ముగిసిపోతుంది.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

మనమూ ఇంతే!



ఈ కాలపు పిల్లలు ఫోన్లకు ఎలా అతుక్కుపోతున్నారో, మీ కాలంలో మీరు ఎలా బయటికివెళ్లి ఆడుకునేవారో మీరు చెబుతూనే ఉండండి... వాస్తవమేమిటంటే, మనం పిల్లలుగా ఉన్నప్పుడు ఫోన్లు ఉండివుంటే, మనం కూడా వాటికి అతుక్కుపోయేవాళ్లం. ఇప్పుడు మన పరిస్థితి చూడండి! మనదేమీ నైతికంగా ఆధిక్యత కలిగిన తరం కాదు – మన కాలానికి ఆ సాంకేతిక పరిజ్ఞానం లేదంతే!

– నయోమీ దత్తా, రచయిత్రి

అనారోగ్య బంధం



ఉన్నట్టుండి బరువు కోల్పోవడం అనేది నేరుగా మానసిక, శారీరక హింసపై ఆధారపడి ఉంటుంది. నా హింసాత్మక వైవాహిక జీవితం వల్ల 43 కేజీలకు తగ్గాను. దాన్నుంచి బయటపడి ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను, కోల్పోయిన బరువును పొందగలిగాను. రెండేళ్ల తర్వాత జీవితం సంతోషంగా ఉంది.

– రియా సింగ్, స్త్రీవాది

అగౌరవం



తర్వాత వచ్చిన ప్రధాన మంత్రులను గౌరవించడంలో ఏ దోషమూ లేదు. కానీ భారత తొలి ప్రధానమంత్రిని అగౌరవపరచడం దేనికి? 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ' పేరు మార్చి, 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ' అని చేశారు.

– మనీష్ తివారీ, ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి

జీవశక్తిగల నేత



నేను ఎప్పుడూ బెర్లుస్కోనీ (ఇటలీ మాజీ ప్రధాని) విమర్శకురాలినే. ప్రత్యేకించి మహిళల పట్ల ఆయన వ్యాప్తి చేసిన సంస్కృతి పట్ల. కానీ ఆయన చనిపోయినప్పుడు కదిలిపోయాను. ఆయన ఇటలీలో ఒక సజీవమైన మనిషి. చిట్టచివరి ప్రసంగంలో 'నేను మళ్లీ సూట్ ధరించాను.' అని చెప్పినప్పుడు హృద్యంగా అనిపించింది (లుకేమియాతో హాస్పిటల్లో చేరారప్పటికి). ఆయన ఎలాంటి మనిషో సమగ్రంగా అప్పుడు దర్శించగలిగాను.

– అలెసాండ్రా బొక్కి, జర్నలిస్ట్

నూరేళ్ల కృషి



పీహెచ్‌డీ వర్క్ ఒకటి చదువుతుంటే, నాకు తెలిసిన అత్యంత పొట్టి పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాఖ్య జాన్ నాష్ (గణిత శాస్త్రజ్ఞుడు)ది అని గుర్తొచ్చింది: 27 పేజీలు. 22 ఏళ్ల వయసులో పూర్తిచేశాడు. 30 ఏళ్ల నాటికి అతడి ప్రధాన కృషి పూర్తయింది. 31 ఏళ్లు వచ్చేసరికి అతడి మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్న సంకేతాలు కనబడుతున్నాయి.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

బీసీ డిక్లరేషన్ కోసం పోరాడాలి!

సందర్భం



డా॥ చెరుకు సుధాకర్

దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, రంగాల్లో బీసీలకు ప్రాధాన్యత, రిజర్వేషన్లు, ఉద్దీపనల గురించి చర్చించేందుకు తెలుగు రాష్ట్రాల్లోని సామాజిక కార్యకర్తలు, విద్యావంతులు ఇటీవల హైదరాబాద్‌లో ఒక సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి ఢిల్లీ యూనివర్సిటీ చరిత్ర ప్రొఫెసర్ సూరజ్ మండల్ హాజరై తన అధ్యయనం, చేయవలసిన ఉద్యమాల గురించి చర్చించారు. ఈయన బిహార్ మాజీ సీఎం, మండల్ కమిషన్ ఛైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ మనుమడు అన్న సంగతి గమనార్హం.

దక్షిణ భారతదేశంలోని దళిత మేధావులు, విద్యాధికులు, చింతనాపరుల చొరవ మేరకు అప్పట్లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న దిగ్విజయ్ సింగ్ ఎస్సీ సబ్‌ప్లాన్, ఇంకా ఇతర అంశాలతో కూడిన 'భోపాల్ డిక్లరేషన్' ప్రకటించారు. దేశంలో 'నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్ వార్డ్ క్లాసెస్' (ఎన్‌సీబీసీ) ఏర్పడింది కాని కార్యాచరణ కుంటుపడింది. దీంతో దాని మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్యతో పాటు అనేక మంది బహుజన మేధావులు బీసీ డిక్లరేషన్‌కై పాలకుల మీద ఒత్తిడి తెచ్చే విధంగా కృషి చేస్తున్నారు. ప్రొఫెసర్ సూరజ్ మండల్ అందులో ఒకరు. జూన్ 11న జరిగిన సమావేశానికి హాజరైన మండల్‌ను 'సాక్షి' పత్రిక ఇంటర్వ్యూ చేసింది కూడా.

కేంద్రంలో ఉన్న బీజేపీ... ఆధిపత్య కులాలకు పెద్దపీట వేస్తూ, జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)తో విద్యను వ్యాపారంగా మార్చి, జాతీయ విద్యా సంస్థల్లో ఫీజులు పెంచింది. పేద విద్యార్థులు ఫీజులకు తూగక పోవడంతో మళ్ళీ వారి సీటు జనరల్ పూల్‌కు పోతున్నాయి. ఈ వైనాన్ని మండల్ ఎత్తి చూపారు. డీమ్డ్ యూనివర్సిటీల విచ్చలవిడితనానికి హద్దు లేకుండా పోయిందని వాపోయారు.



ప్రొఫెసర్ సూరజ్ మండల్

బీసీ డిక్లరేషన్ కోసం జులై 11న తిరుపతిలో జాతీయ సభ పెట్టాలనుకుంటున్న నేతలతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గంటసేపు చర్చించి తమ ప్రభుత్వం ఏ రకంగా బీసీలకు ప్రాధాన్యత ప్రణాళికలు రచిస్తున్నదీ వివరించారు. పార్టీలు ఏవైనా కనీస సామాజిక బాధ్యతగా సోషల్ జస్టిస్‌కు అవి కట్టుబడి ఉండాలి. జగన్ ఆ విషయంలో ముందంజలో ఉన్నారు. అందుకే బీసీ నేతలతో ఆయన అంతసేపు చర్చించారు. సూరజ్ మండల్ ఇంటర్వ్యూలో సీఎం జగన్ మోహన్ రెడ్డి చాలా మంది బీసీలను ఎమ్మెల్సీలుగా చేయడం, చట్టసభల్లో పెద్ద పీట వేయడం తమని ఆకర్షించిందని అన్నారు.

ఇక మేధో మథన సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ప్రమోషన్లు, కుల గణన, కుట్రపూరితంగా రాజ్యాంగ ఫలాలను బహుజనులకు రాకుండా చేసే పద్ధతులు వంటి వాటిపై సూరజ్ మండల్ తన తాత స్ఫూర్తిగా ధ్వజమెత్తారు. జనాభాలో ఈబీసీలు ఎంతమంది ఉన్నారో లెక్క తేలకుండానే 10 శాతంవారికి రిజర్వేషన్లు కల్పించిన మోదీ, షాల ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.


పూలే, కాన్షిరామ్ చూపించిన మార్గంలో... దమ్ముతో కొట్లాడే లాలూ ప్రసాద్ యాదవ్, సిద్ధరామయ్య, అశోక్ గెహ్లాట్, భూపేశ్ బఘేల్ వంటి వర్తమాన యోధుల అడుగుల్లో నడవాల్సిన అవసరాన్ని మండల్ నొక్కి చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఒక విస్తృత ఏకాభిప్రాయం కుల గణన కోసం వస్తున్నది. బీసీ ముఖ్యమంత్రులే కాక ఇతరులు కూడా రాజకీయ ఒత్తిడి రీత్యా, చిత్తశుద్ధితో కేంద్రం నుండి సానుకూల వైఖరి కోసం ప్రయత్నించాలి.

తిరుపతిలో జరిగే బీసీ డిక్లరేషన్ జాతీయ సభకు ఏపీ ముఖ్యమంత్రితో పాటు అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు 'బీసీ డిక్లరేషన్'పై తమ వైఖరు లేమిటో స్పష్టం చేయాలి.

వ్యాసకర్త టీపీసీసీ ఉపాధ్యక్షులు । 98484 72329

ఆ విజయంతో కాంగ్రెస్‌లో అతి ఆత్మవిశ్వాసం?

అభిప్రాయం



శ్యామ్ సుందర్ వరయోగి

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఇక దేశమంతా విజయ దుందుభి మోగించబోతున్నట్లు కలలు కంటున్నట్లుంది. అనేక రాష్ట్రాల్లోనూ, గత పార్లమెంటరీ ఎన్నికల్లోనూ చతికిలపడ్డ ఆ పార్టీలో ఈ విజయం అతి ఆత్మ విశ్వాసాన్ని నింపినట్లుందని పలువురు అంటున్నారు. తన నాయకత్వంలో ప్రతిపక్షాల ఐక్యత సాధించేసినట్లు, కేంద్రంతో పాటు తెలంగాణ వంటి రాష్ట్రాల్లోనూ తాను గెలవబోతున్నట్లు కాంగ్రెస్ అనుకుంటోంది. కానీ అది అసాధ్యం.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలవడానికి ఎన్నో అంశాలు దోహదం చేశాయి. ముఖ్యంగా అక్కడి మైనారిటీలు గత ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య చీలిపోగా ఈసారి గంపగుత్తగా కాంగ్రెస్‌కు ఓటే శారనే వాదనలు వినిపిస్తున్నాయి. కాబట్టే ప్రభుత్వ ఏర్పాటులో జేడీఎస్ గతంలో లాగా చక్రం తిప్ప వచ్చన్న పలు సర్వేలను తలకిందులు చేస్తూ ఆ పార్టీ చతికిల పడింది. అలాగే అక్కడ బలమైన సామాజిక వర్గమైన లింగాయతులు, వారికి సంబంధించిన మఠాధిపతుల్లో కొందరు సైతం ఈ దఫా కాంగ్రెస్ పక్షాన నిలిచారంటున్నారు. ఇన్ని రకాల అనుకూలాంశాలు పనిచేసినా కాంగ్రెస్ ఓట్లు, సీట్లు పెంచుకోగలిగిందే తప్ప బీజేపీకి అంతకుముందు ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని మాత్రం తగ్గించలేకపోయింది.

తెలంగాణ విషయానికి వచ్చేసరికి కాంగ్రెస్ కు కర్ణాటక లాంటి ఒక్క అనుకూలాంశం కూడా లేకపోగా ప్రతికూలాంశాలే ఎక్కువగా ఉన్నాయి. పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై ఆ పార్టీ నాయకుల్లోనే అసంతృప్తి ఉన్న విషయం బహిరంగ రహస్యం.

రేవంత్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో తన కులం ప్రాధాన్యతపై చేసిన వ్యాఖ్యలు కూడా ఆ పార్టీలో తీవ్ర దుమారాన్నే లేపాయి. తెలంగాణ కాంగ్రెస్‌ను వేధిస్తున్న మరో కీలకమైన అంశం గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేల అంశం. గత ఎన్నికల్లో 19 మంది కాంగ్రెస్



పార్టీ తరఫున గెలుపొందగా 12 మంది దాకా కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. దీంతో బీజేపీ ఈ అంశాన్ని ఆసరాగా చేసుకొని కాంగ్రెస్‌కు ఓటు వేసినా బీఆర్‌ఎస్‌కు వేసినట్లే అని ప్రచారం చేసింది. ఇదే ప్రచారాన్ని మళ్లీ బీజేపీ అందుకోవచ్చు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కించుకోలేక పోయిన బీజేపీ ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కరీంనగర్, సికింద్రాబాద్, నిజామాబాద్, అదిలాబాద్ ఎంపీ స్థానాల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీని ఓడించి ఘన విజయం సాధించింది. ఆ తర్వాత నాగార్జున సాగర్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి ఓడిపోగా బీఆర్‌ఎస్ గెలిచింది. మళ్ళీ ఇక్కడ బీజేపీ పరాజయాన్ని చవిచూసింది.

దుబ్బాక ఉప ఎన్నికల్లో రఘునందన్ రావు, హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ బీజేపీ తరఫున పోటీ చేసి గెలిచారు. నాగార్జున సాగర్ మిగిలిన అన్ని ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ సత్ఫలితాలు రాబట్టలేక పోయింది. అటువంటి కాంగ్రెస్ ఒక్క కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావంతో ఎకాఎకిన రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తుందను కుంటున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు.

రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా అదే పార్టీకి చెందిన సచిన్ పైలట్ రాష్ట్రంలో అవి నీతి పెచ్చరిల్లిందని ఆందోళన చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో జ్యోతి రాదిత్య సింధియా బీజేపీలో చేరడంతో కాంగ్రెస్ శక్తి క్షీణించింది.

ఇన్ని ఒడిదుడుకుల మధ్య కాంగ్రెస్‌కు కర్ణాటకలో వచ్చిన ఫలితాలే దేశం మొత్తం మీద వస్తాయా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య


చంద్రయ్య (ఫైల్)

ఎల్కతుర్తి: తన భార్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు చేసిన బిల్లులు రాక అప్పులపాలై ఆ మాజీ సర్పంచ్ భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ భర్త రేనుకుంట్ల చంద్రయ్య (45) ఐదేళ్ల క్రితం తన భార్య భాగ్య సర్పంచ్‌గా ఉన్నప్పుడు అప్పులు చేసి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేశాడు. ఆ బిల్లులు ఇంకా రాలేదు. అప్పులు తీర్చడానికి 20 గుంటల భూమిని అమ్మినా కూడా తీరలేదు. దీనికితోడు కుమారుల చదువు కోసం మరికొంత అప్పు చేశాడు. మొత్తం రూ.12 లక్షలు అప్పులు కావడంతో కొద్దిరోజులుగా దిగాలుగా ఉంటున్నాడు. మరో 10 గుంటల భూమి అమ్మి అప్పులు తీరుద్దామని అతన్ని కుటుంబసభ్యులు సముదాయించారు. అయినా అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపం చెందిన చంద్రయ్య శుక్రవారం తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముల్కనూరు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

- దొంగతనంపై కేసు నమోదుతో మనస్తాపం
- చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం

మహబూబాబాద్ రూరల్: తన గొర్రెను అమ్ముకున్నాడని గొర్రెల కాపరిపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురై అతను ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా నడివాడ గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నడివాడకు చెందిన కాడబోయిన ఉపేందర్ గొర్రె రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. ఆ గొర్రెను అమ్ముకున్నాడని అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ముప్పిడి నర్సయ్య (62)పై అనుమానంతో ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వచ్చి విచారణ చేస్తారని భయపడిన నర్సయ్య గురువారం ఉదయం ఇంటినుంచి వెళ్లిపోయాడు. పోలీసులు శుక్రవారం నడివాడకు వెళ్లి విచారణ నిర్వహించిన సమయంలో ఆయన గ్రామంలో లేడు. కొంత సమయానికి చంద్రుతండా సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లుగా సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఇన్‌చార్జ్ ఎస్సై తిరుపతి తెలిపారు.

షేర్ ఆటోను ఢీకొన్న కారు

- ముగ్గురు మహిళల దుర్మరణం
- 15 మందికి గాయాలు
- వికారాబాద్ జిల్లాలో ఘటన


అంజిలమ్మ


హెమ్లిబాయి


శశికళ

పరిగి: పదిహేడు మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఆటో డ్రైవర్ సహా 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. గండీడ్ మండలం వెన్నాచేడ్ గ్రామానికి చెందిన దస్తయ్య తన ఆటోను రిజిస్టర్ చేయించడానికి పరిగి ఆర్టీఏ కార్యాలయానికి బయలుదేరారు. మార్గ మధ్యంలో దోమ మండలం గుండాల్ గేట్, దాదాపూర్, బ్రాహ్మణ్‌పల్లి తదితర గ్రామాల వద్ద 14 మంది పెద్దవారిని, ముగ్గురు చిన్నపిల్లలను మొత్తం 17 మంది ప్యాసింజర్లను ఎక్కించుకున్నాడు. హైదరాబాద్ బీజాపూర్ జాతీయరహదారి తుంకుల్‌గడ్డ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలైన వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తపల్లికి చెందిన బోయిని అంజిలమ్మ (50), గుండాల్‌కు చెందిన శశికళ(35), బ్రాహ్మణ్‌పల్లితండాకు చెందిన నేనావత్ హెమ్లీబాయి (56) మృతి చెందారు. ఆటో డ్రైవర్‌తో పాటు మిగిలిన 14 మంది చికిత్స పొందుతున్నారు.

రూపాయి బిర్యానీ కోసం వెళ్తే రూ.235 జరిమానా

- కరీంనగర్‌లో రూపాయి నోటుకు బిర్యానీ అంటూ ఆఫర్ ఇచ్చిన ఓ హోటల్
- ఎగబడ్డ జనం..అరగంటలో అంతాఖాళీ
- రోడ్డుపై ట్రాఫిక్ జామ్
- హోటల్ ముందు నిలిపిన వాహనాలకు పోలీసుల ఫైన్లు


బిర్యానీ కోసం ఎగబడిన జనం

కరీంనగర్‌క్రైం: రూపాయి నోటుకు బిర్యానీ వేస్తుందని ఆశపడి వెళ్లిన వారికి రూ.100 నుంచి రూ.235 వరకు జరిమానా పడింది. కరీంనగర్‌లోని తెలంగాణచౌక్ సమీపంలో కొత్తగా ప్రారంభించిన ఒక బిర్యానీ సెంటర్ నిర్వాహకులు శుక్రవారం రూపాయి నోటు ఇచ్చిన వారికి బిర్యానీ ఇస్తామని ప్రచారం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమయాన్ని కూడా సూచించారు. ఈ విషయం సోషల్ మీడియాలో కూడా వైరల్ కావడంతో జనం రూపాయి నోటుకు బిర్యానీ కోసం ఎగబడ్డారు. అరగంటలో 800లకు పైగా బిర్యానీ ప్యాకెట్లను కొనుగోలు చేసేశారు. చాలామందికి బిర్యానీ లభించకపోవడంతో హోటల్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ పోలీసులు వచ్చి బిర్యానీసెంటర్‌ను మూసివేయించడంతోపాటు రోడ్లమీద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వందమంది వాహనాలకు రూ.100 నుంచి రూ.235వరకు జరిమానా విధించారు.

హనుమా.. భూమాయ కనుమా

- 34ఎకరాల ఆంజనేయ స్వామి ఆలయ భూమికి ఎసరు
- మాన్యం భూములను తమ పేరిట మార్చాలంటూ పూజారి కుమారుడు దరఖాస్తు
- అడిగిందే తడవుగా ఓఆర్‌సీలను జారీ చేసిన రెవెన్యూ అధికారులు
- దేవాదాయశాఖ, ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీల అభ్యంతరం
- నేడు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఆఫీసులో విచారణ..



సాక్షి, రంగారెడ్డి జిల్లా: రెవెన్యూ అధికారులు, పూజారి వారసులు కలిసి ఏకంగా ఆంజనేయ స్వామి భూములకే ఎసరు పెట్టారు. పహాణీలు, ధరణిలోని నిషేధిత జాబితాను పక్కన పెట్టి ఏకంగా 34 ఎకరాల దేవాదాయ భూమికి ఓఆర్‌సీ జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.కోటి వరకు పలుకుతుండటంతో ఎలాగైనా ఈ భూములను కొట్టేయాలని పక్కాగా ప్లాన్ చేశారు.

మాడ్గుల మండలం అర్కపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 88లో 9.18 ఎకరాలు, సర్వే నంబర్ 79/ఎ4లో 20 గుంటలు, సర్వే నంబర్ 283లో 11 ఎకరాలు, సర్వే నంబర్ 241లో 11.06 ఎకరాల భూమి ఆంజనేయస్వామి దేవాలయం పేరున ఉంది. ఈ భూమికి అప్పటి ఆలయ పూజారి పప్పు లక్ష్మయ్య దంపతులను రక్షిత కాపలాదారుగా నియమించి, ఆ మేరకు రికార్డుల్లో వారి పేర్లను నమోదు చేశారు. భూమి కౌలు ద్వారా వచ్చిన డబ్బులతో ధూపదీప నైవేద్యాలు సమకూర్చాల్సి ఉంది. ఆశించినస్థాయిలో కౌలు రాక, ఆలయ నిర్వహణ భారంగా మారి పూజారి లక్ష్మయ్య దంపతులు సుమారు 40 ఏళ్ల క్రితమే ఊరు విడిచి వెళ్లారు. అప్పటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతను గ్రామస్తులే చూసుకుంటున్నారు. పహాణీల్లోనే కాదు ధరణి పోర్టల్‌లోనూ ఈ భూములు ఆంజనేయస్వామి దేవాలయం పేరునే రికార్డు అయి ఉన్నాయి.

గుడ్డిగా ఓఆర్‌సీ జారీ చేసిన రెవెన్యూ..

తాజాగా ఈ భూమి తనదేనని, ఆయా భూములను తమ పేరున మార్చాల్సిందిగా కోరుతూ ఆలయ పూజారి కుమారుడు ఫైల్ నంబర్ 6820/2022న రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన అడిగిందే తడవుగా రెవెన్యూ అధికారులు ఓఆర్‌సీ జారీ చేశారు. ఈ విషయం తెలిసి ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ సభ్యులు సహా దేవాదాయశాఖ కమిషనర్ అప్రమత్తమయ్యారు. ఈ భూమిపై లావాదేవీలతో పాటు రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఓఆర్‌సీని సైతం నిలిపి వేయాల్సిందిగా కోరుతూ దేవాదాయశాఖ కమిషనర్ సహా గ్రామపంచాయతీ సభ్యులు రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నేడు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఆఫీసులో విచారణ

జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) తిరుపతిరావు ఆర్డీఓ జారీ చేసిన ఓఆర్‌సీని నిలిపివేయడంతో పాటు రెవెన్యూ కోర్టుకు ఈ కేసును సిఫార్సు చేశారు. శనివారం ఉదయం ఇబ్రహీంపట్నం రెవెన్యూ కోర్టులో ఈ అంశంపై ఇటు దేవాదాయ శాఖ, అటు పూజారి వారసులు, ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టాలని నిర్ణయించారు.

పరిశీలించకుండానే మ్యుటేషన్!

అర్కపల్లి రెవెన్యూ గ్రామానికి ఆనుకునే సర్వే నంబర్ 95/2లో సుమారు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రైతు ఇప్పటికే దీనిలో కొంత భాగాన్ని స్థానికులకు గుంటల్లో విక్రయించాడు. ప్రస్తుతం ఆ భూమిలో నివాసాలు కూడా వెలిశాయి. రెవెన్యూ రికార్డుల్లో గ్రామకంఠం భూమిగా రికార్డు చేశారు. ఇప్పటికే విక్రయించగా మిగిలిన పది గుంటల భూమిని తన పేరున మ్యుటేషన్ చేయాల్సిందిగా సదరు రైతు ఇటీవల రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, కనీస రికార్డులను పరిశీలించకుండా ఏకంగా నివాసాలు వెలిసిన భూమిని సైతం అమ్మిన రైతు పేరున మ్యుటేషన్ చేయడం గమనార్హం. భూ రికార్డుల నిర్వహణలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి ఇదో నిదర్శనం.

నాపై అప్రకటిత నిర్బంధం

- ఫోన్‌లో మాట్లాడకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారు
- అడుగుదామంటే మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదు
- ప్రముఖ దర్శకుడు బి.నర్సింగ్‌రావు



సాక్షి, హైదరాబాద్: బి.నర్సింగ్‌రావు... తెలంగాణ చిత్రానికి ప్రపంచస్థాయి గౌరవాన్ని తెచ్చిన ప్రముఖ దర్శకుడు. తెలుగు సమాజానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా చిరపరిచితుడు. ఆయన ఇటీవల సామాజిక మాధ్యమ వేదికగా మంత్రి కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 రోజులుగా తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. 'ఎక్కడ పుట్టిన కమలాలు మీరు'అంటూ తీవ్రంగా దుయ్యబట్టారు. తన పట్ల ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్న తీరును గర్హిస్తూ ఆయన రాసిన లేఖలు సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయ్యాయి.

లేఖలో ఏముందంటే..

''తెలంగాణ ప్రభుత్వం ఆధునిక హంగులతో నిర్మించిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' నుంచే ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ తన పర్యవేక్షణలన్నీ కొనసాగిస్తోంది. వారికెందుకో నేను కూడా టార్గెట్ అయ్యాను. నేను ఎవరితో ఫోన్లో మాట్లాడినా దాన్ని అడ్డుకుంటున్నారు. అవతలి వాళ్లు మాట్లాడేది నాకు వినబడకుండా చేస్తున్నారు. 2014 నుంచి ఫోన్ టాపింగ్‌కు గురవుతోంది. 2018 జనవరి నుంచి నా ఫోన్ కాల్స్‌ను అడ్డుకుంటున్నారు. ఐదున్నరేళ్లుగా నాకు నరకం చూపిస్తున్నారన్నారు. రెండు సార్లు కేటీఆర్‌ను కలిసి ఈ విషయం చెప్పినా పట్టించుకోలేదు.''అని పేర్కొన్నారు.

అకారణంగా వేధిస్తున్నారు..

ప్రభుత్వం 8 ఏళ్లుగా తన ఫోన్‌ను ట్యాపింగ్ చేస్తోందని నర్సింగ్‌రావు చెప్పారు. ఎవరితోనూ మాట్లాడనీయకుండా బంధువులు, స్నేహితులు, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన సంస్థలు, వ్యక్తులకు తనను దూరం చేస్తోందని, మానసికంగా వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితం ఫోన్‌పైనే ఆధారపడి కొనసాగుతోంది. అలాంటిది మొబైల్ ఫోన్‌ను తననుంచి దూరం చేసి ప్రభుత్వం తన జీవన గమనాన్నే అడ్డుకుంటోందని ఆయన 'సాక్షి'తో వాపోయారు. ప్రపంచంతో తన సంబంధాలన్నీ నిలిచిపోయాయని, చివరకు బంధువుల్లో ఎవరైనా చనిపోయినా సమాచారం అందుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ''నేను డాక్టర్‌తో మాట్లాడాలనుకున్నా మాట్లాడలేని పరిస్థితి. నన్ను కలిసేందుకు ఎవరైనా రావాలనుకున్నా ఫోన్‌లో ఆ విషయం చెప్పలేని స్థితి నెలకొంది''అని వెల్లడించారు. ప్రభుత్వం తనను అకారణంగా వేధిస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏనాడూ ఇలాంటి దుస్థితిని ఎదుర్కోలేదన్నారు.

ఇథనాల్ పరిశ్రమ రద్దుకు ఉరికంబమైనా ఎక్కుతాం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

వెల్గటూర్(ధర్మపురి): ప్రజల ప్రాణాలు తీసే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆరు గ్రామాల ప్రజలు చేస్తున్న ఉద్యమంలో పాల్గొంటామని, పోలీసు కేసులైనా, చివరికి ఉరికంబం ఎక్కడానికైనా సిద్ధంగా ఉన్నామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాశిగామలోని ఇథనాల్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. 2 నెలలుగా పోరు సాగిస్తున్న గ్రామస్తులకు సంఘీభావం ప్రకటించారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను జనావాసాల మధ్య నిర్మించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. పెద్ద ఉద్యమం జరుగుతున్నా జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇథనాల్ ప్రాజెక్టు రద్దు చేయకుంటే ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. అంతకుముందు రాజక్కపల్లిలో మెగా కంపెనీ బ్లాస్టింగ్‌లతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వచ్చే ఏడాది మరో 8 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు

- మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ లక్ష్యంతో వేగంగా అడుగులు వేస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మిగిలిన 8 జిల్లాలో మెడికల్ కాలేజీలు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 33 జిల్లాల్లో 25 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటుకాగా మిగిలిన 8 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ప్రారంభించేందుకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి, డీఎంఈ రమేష్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం నడుచుకునేలా మెడికల్ కాలేజీలను చూడాల్సిన బాధ్యత సూపరింటెండెంట్‌లపై ఉందన్నారు.

నేటితో కంటి వెలుగుకు 100 రోజులు...

కంటి వెలుగు కార్యక్రమం శనివారంతో 100వ రోజుకు చేరనుందని హరీశ్‌రావు తెలిపారు. 99 పని దినాల్లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 1.61 కోట్ల మందికి కంటి పరీక్షలు చేశామన్నారు. ఇందులో దృష్టి లోపం ఉన్న 40.59 లక్షల మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే 24 జిల్లాల్లో కంటి వెలుగు కార్యక్రమం పూర్తయిందన్నారు. రెండో విడత కంటి వెలుగును రాష్ట్ర వ్యాప్తంగా గత జనవరి 18 నుంచి వంద రోజుల కార్యక్రమంగా ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. 100 శాతం పరీక్షలు పూర్తి కాని జిల్లాల్లో పరీక్షలు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

తెలంగాణను ఏపీలో కలిపే ప్రయత్నం

- మంత్రి గంగుల

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రాన్ని మళ్లీ ఆంధ్రాలో కలిపేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చిన ఈ పది సంవత్సరాల్లో అద్భుతమైన అభివృద్ధి సాధించామన్నారు. కానీ.. కొన్ని దుష్టశక్తులు ఇప్పటికీ తెలంగాణపై విషం చిమ్ముతున్నాయని, మళ్లీ ఆంధ్రలో కలిపే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. 50 సంవత్సరాల దరిద్రం మళ్లీపట్టే అవకాశం ఉందని, తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. మళ్లీ ఆ తప్పు చేస్తే పిల్లల భవిష్యత్ అంధకారంలో ప డుతుందని హెచ్చరించారు. కాగా, రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటులో కేంద్రానిది పైసా లేదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్‌కుమార్ అన్నారు. మన రాష్ట్ర సొమ్ముతోనే ప్రతీ జిల్లాలో వైద్యకళాశాలలు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు.

రైతులకు ఒకేరోజు రూ.3 వేలకోట్లు

- ధాన్యం కొనుగోళ్ల చెల్లింపుల కోసం విడుదల చేశాం: మంత్రి గంగుల
- దాదాపు ముగిసిన సేకరణ.. ఈ నెల 20 నాటికి మొత్తం నిధులు విడుదల
- ఇప్పటివరకు 11 లక్షల మంది రైతుల నుంచి 65.10 లక్షల టన్నులు సేకరించాం
- యాసంగి ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ టాప్ అని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం సేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని.. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్ము విడుదల ప్రక్రియ దాదాపుగా ముగిసిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే రూ.3,000 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని.. ఈ నెల 20వ తేదీలోగా ధాన్యం విక్రయించిన ప్రతి రైతుకు సొమ్ము అందే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈసారి యాసంగిలో ప్రకృతి వైపరీత్యాలకు ఎదురెళ్లి విజయవంతంగా ధాన్యం సేకరణ జరిపామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

65.10 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

ఈ యాసంగిలో గురువారం నాటికి 11 లక్షల మంది రైతుల నుంచి రూ.13,383 కోట్ల విలువైన 65.10 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామని మంత్రి తెలిపారు. ఇందులో ఓపీఎంఎస్‌లో రూ. 10,439 కోట్ల రసీదులు అప్‌లోడ్‌కాగా.. ఇప్పటి వరకు రూ.9,168 కోట్లు విడుదల చేశామన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో విపత్కర పరిస్థితులను ముందుగానే అంచనా వేసి.. సాధారణం కంటే పదిరోజులు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం సేకరణ మొదలుపెట్టామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో కన్నా అధికంగా 7,037 కొనుగోలు కేంద్రాలను తెరిచామని.. ఇప్పటికే 90శాతానికి పైగా సేకరణ పూర్తవడంతో 6,366 కేంద్రాలను మూసేశామన్నారు. 18 జిల్లాల్లో సంపూర్ణంగా సేకరణ పూర్తయిందని, మిగతా జిల్లాల్లోనూ ఆదివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎక్కడైనా ఆలస్యంగా వరి కోతలు జరిగిన ప్రాంతాల్లో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని.. కొనుగోళ్లు చేపట్టేందు కు కలెక్టర్లకు అధికారం ఇచ్చామని వివరించారు. గత యాసంగి సీజన్ కన్నా ఈసారి ఇప్పటికే 16లక్షల టన్నులు అధికంగా సేకరించామన్నారు.

కేసీఆర్ రైతు అనుకూల విధానాలతోనే..

సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న రైతు అనుకూల విధానాలైన రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటు, అందుబాటులో సాగునీరు, మద్దతు ధరతో కొనుగోళ్లు వంటి కారణాలతో తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా మారిందని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కేవలం తొమ్మిదేళ్లలో ధాన్యం సేకరణలో దేశం గర్వించే స్థితికి తెలంగాణ చేరుకుందని వివరించారు. ఓవైపు పంటను సేకరిస్తూనే, మరోవైపు అకాల వర్షాల నుంచి కాపాడేందుకు పౌరసరఫరాల యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలోనే ఉండి రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఆత్మహత్యకు కూడా సిద్ధమే


జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: 'రాష్ట్రంలో మూడో సారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుంది. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నేను ఆత్మహత్యకు కూడా సిద్ధం. ఇందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సిద్ధమేనా?'అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, తనపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని రేవంత్ పగటి కలలు కుంటున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై ఇష్టానుసారం మాట్లాడితే రేవంత్ నాలుక చీరేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న పోప్ ఫ్రాన్సిస్

రోమ్: పోప్ ఫ్రాన్సిస్(86) శుక్రవారం రోమ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తొమ్మిది రోజుల క్రితం రోమ్‌లోని గెమెల్లీ పాలిక్లినిక్‌లో చేరారు. శస్త్రచికిత్స అనంతరం వీల్‌చైర్‌లో ఆసుపత్రి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి ఎదుట ప్రజలకు చిరునవ్వుతో అభివాదం చేశారు. ఆ తర్వాత కారులో వాటికన్ సిటీకి చేరుకున్నారు. ఆయనకు ఈ నెల 7న హెర్నియా ఆపరేషన్ జరిగింది.

కెనడాలో ఘోర రోడ్డు ప్రమాదం..15 మంది మృతి

టొరంటో: కెనడాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 15 మంది వయోధికులు చనిపోగా, మరో 10 మంది గాయాలపాలయ్యారు. మనిటొబా ప్రావిన్స్‌లోని కెర్బ్రెరీ వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. డాఫిన్‌లోని వయోధికుల కేంద్రంలో ఉండే 25 మంది గురువారం ఉదయం కర్బ్రెరీలోని శాండ్ హిల్స్ కేసినోకు బస్సులో బయలుదేరారు. ఈ బస్సు కెర్బ్రెరీ వద్ద కూడలిలో రవాణా ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో బస్సులోని 15 మంది వయోధికులు చనిపోగా, మరో 10 మంది గాయాలపాలయ్యారు.

సరిహద్దుల్లో అయిదుగురు ఉగ్రవాదులు హతం

కుప్వారా: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారాలో భద్రతా బలగాలు నియంత్రణ రేఖ వెంబడి భారీ చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా అయిదుగురు విదేశీ సాయుధ ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. నిఘా వర్గాల సమాచారం మేరకు కెరాన్ సెక్టార్‌లోని జుమాగుండ్ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి ఈ ఆపరేషన్ చేపట్టినట్లు 28వ డివిజన్ మేజర్ జనరల్ గిరీష్ కాలియా తెలిపారు. భారత, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్న సమయంలో 2021 తర్వాత తిప్పికొట్టిన అతిపెద్ద చొరబాటు యత్నమని పేర్కొన్నారు.

ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదికగా విపక్షాలు ఏకం కావాలి

జల్గావ్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కనీస ఉమ్మడి కార్యక్రమం(సీఎంపీ) ప్రాతిపదికన ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ చెప్పారు. 23న పట్నాలో జరిగే ప్రతిపక్ష పార్టీల భేటీలో ఇదే చెబుతానన్నారు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. భారీ హామీలతో, ప్రజల్లో ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన బీజేపీ చేసిందేమీ లేదన్నారు.

తుపాన్లు తలొంచుతున్నాయ్..!

మాండాస్, సిత్రాంగ్, అసానీ, గులాబ్, బిపర్‌జోయ్. పేరు ఏదైనా కానివ్వండి ఆ తుపాను ఎంత తీవ్రమైనదైనా కానివ్వండి మనం తట్టుకొని నిలబడుతున్నాం. 1990,-2000నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. ఒకప్పుడు తుపాన్లు, వరదలంటే భారీగా ప్రాణ నష్టాలే జరిగేవి. ఇప్పుడు ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ముందస్తుగా తుపాన్లను గుర్తించి పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాల్ని ఇస్తోంది. గుజరాత్‌లో ఏకంగా లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు యుద్ధ ప్రాతిపదికన తరలించడంతో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోలేదు. తుపాన్ల సన్నద్ధతలో ఒడిశా ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఆ రాష్ట్ర చర్యలకు ఐక్యరాజ్య సమితి కూడా శభాష్ అనడం విశేషం.

ఫలితాలు ఇలా..!

ప్రకృతి వైపరీత్యాలతో జరిగే ఆర్థిక నష్టాన్ని నివారించలేకపోయినా ప్రాణలైతే కాపాడగలుగుతున్నాం. గత కొద్ది ఏళ్లలో ఒడిశాను అల్లకల్లోలం చేసిన తుపాన్లలో ప్రాణనష్టం తగ్గుతూ వస్తోంది.

పారాదీప్ సైక్లోన్ (1999)	10 వేలు
ఫాలిని (2013)	44
టిట్లీ (2018)	77
ఫాని (2019)	64
అంఫాన్ (2020)	3
యాస్ (2021)	10



బిపర్‌జోయ్ తుపానుకు ముందు తీర ప్రాంత ప్రజలను హెచ్చరిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వారం రోజుల ముందే హెచ్చరికలతో పెరిగిన సన్నద్ధత

- ప్రాణనష్టాన్ని అధిగమించేలా ఆధునిక వ్యవస్థ
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిన ఒడిశా విధానాలు

అది 1999 సంవత్సరం అక్టోబర్ 29. ఒడిశా ప్రజలకు అదో కాళరాత్రి. పారాదీప్ సూపర్ సైక్లోన్ రాష్ట్రంపై విరుచుకుపడింది. సముద్రం అలల ధాటికి 14 జిల్లాల్లో భారీ విధ్వంసం జరిగింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లాకి జిల్లాయే తుడిచిపెట్టుకుపోయింది. తుపాను దెబ్బకి 10 వేల మంది జలసమాధి అయ్యారని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. 30 వేల మంది వరకు ప్రాణాలు పోగొట్టుకుని ఉంటారని ఒక అంచనా. అప్పట్లో భారత వాతావరణ కేంద్రం దగ్గర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదు. దీంతో తుపాను ముంచుకొస్తోందని కేవలం 48 గంటల ముందు మాత్రమే తెలిసింది. వాతావరణ శాఖ అధికారులు ఒడిశా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినప్పటికీ సన్నద్ధత లేని కారణంగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 10 వేలు నుంచి 30 వేల మంది మరణిస్తే, 3.5 లక్షల ఇళ్లు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు గ్రామాలే నీళ్లలో కొట్టుకుపోయాయి. 25 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రెండు లక్షల జంతువులు మరణించాయి. గంటకి 250 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు వీయడంతో కమ్యూనికేషన్ వ్యవస్థ నాశనమైంది.



ఒడిశాతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. ఈ పెను విధ్వంసంతో అప్పటి ఒడిశా ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

తుపాన్లు ఎదుర్కోవడంలో నవీన పంథా



◀ తుపాను హెచ్చరికలను తెలియజేసే వ్యవస్థ

సూపర్ సైక్లోన్ ముంచెత్తిన తర్వాత సంవత్సరం 2000లో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నవీన్‌పట్నాయక్ తుపాన్లు ఎదుర్కోవడంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. సూపర్ సైక్లోన్ తుపాను బీభత్సం నుంచి అప్పటికి ఇంకా రాష్ట్రం కోలుకోలేదు. భౌగోళికంగా ఒడిశా తుపాన్ల తాకిడిని తప్పించుకోవడం అసాధ్యం. 1891 నుంచి 100కి పైగా తుపాన్లు ఒడిశాను వణికించాయి. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం నవీన్ పట్నాయక్ ప్రాణ నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు

- → రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సంస్థను ఏర్పాటు చేశారు. ఇలా ఒక రాష్ట్రం విపత్తు నిర్వహణ కోసం ఒక అథారిటీని ఏర్పాటు చేయడం అదే మొదటి సారి. జిల్లాలు, బ్లాక్ స్థాయిలో కూడా విపత్తు కమిటీలు ఏర్పాటు చేశారు. 22 వేల గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక యువకుల్ని సభ్యులుగా నియమించారు. తుపాను హెచ్చరికలు అందిన వెంటనే లోతట్టు ప్రాంతాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే వీరు చేయాల్సిన పని
- → రాష్ట్రంలోని 480 కి.మీ. పొడవైన తీర ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లపై ప్రజల్ని అప్రమత్తం చేయడానికి 2018లో ప్రభుత్వం ఎర్లీ వార్నింగ్ డిస్సెమినేషన్ సిస్టమ్ (ఈడబ్ల్యూడీఎస్) ఏర్పాటు చేసింది. తుపాన్లు ముంచుకొస్తే లోతట్టు ప్రాంత ప్రజలకి కనీసం అయిదారు రోజుల ముందే హెచ్చరికలు అందుతాయి.
- → తీర ప్రాంతాల్లో నివసించే వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చింది
- → ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లో బాగా విస్తరించి సుశిక్షితులైన సిబ్బందిని 20 రెట్లు పెంచింది. వారి దగ్గర 66 రకాల ఆధునిక పరికరాలు అంటే జనరేటర్లు, చెట్లను కట్ చేసే, రోడ్లను శుభ్రం చేసే యంత్రాలు, పడవలు, ఫస్ట్ ఎయిడ్ మెడికల్ వంటివి ఎప్పుడూ ఉండేలా చర్యలు తీసుకుంది.
- → 1999 సూపర్ సైక్లోన్ సమయం నాటికి ఒడిశాలో కేవలం ఆరు జిల్లాల్లో కేవలం 23 శాశ్వత తుపాను శిబిరాలు ఉండేవి. తీర ప్రాంతాల్లో అడుగడుక్కీ బహువిధాలుగా ఉపయోగపడే శిబిరాలు నిర్మించారు. ఇప్పుడు వాటి సంఖ్య 870కి చేరుకుంది. ఒక్కో శిబిరంలో వెయ్యి మంది వరకు తలదాచుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఐక్యరాజ్యసమితి ప్రశంసలు

2013 సంవత్సరంలో ఫాలిని అత్యంత తీవ్రమైన తుపానుగా ఒడిశాను ముంచెత్తింది. అప్పుడు భారీగా ప్రాణ నష్టం జరుగుతుందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ తుపాను సమయంలో లక్షలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో 44 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఒడిశా ప్రభుత్వ సహాయక చర్యలకు ఐక్యరాజ్య సమితి ఫిదా అయింది. ఒడిశా ప్రభుత్వం చారిత్రక విజయాన్ని సాధించిందని అభినందించింది.

కేంద్రం మూడంచెల వ్యవస్థ

బిపర్‌జోయ్ మహా తుపాను గుజరాత్‌లో విధ్వంసం సృష్టించినా ప్రాణ నష్టం జరగలేదు. దీనికి తుపాన్లపై ముందస్తు సన్నద్ధతే కారణం. తుపాను ముప్పుని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం మూడంచెల వ్యవస్థని ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ పనితీరుతో ఏకంగా లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రాణాలు కాపాడగలిగారు. తుపాన్లు ఎప్పుడు ఏర్పడతాయి? ఏ దిశగా ప్రయాణిస్తాయి, ఎక్కడ తీరం దాటుతాయన్న అంశాలను వారం రోజులు ముందుగానే గుర్తించే ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ ఉంది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజల్లో తుపాన్లపై అవగాహన పెరుగుతుంది. ఇక రెండో అంచెగా శిబిరాల నిర్మాణం, ప్రజల్ని తరలించడం ఒక యుద్ధంలా చేస్తారు. ఇక మూడో దశలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్‌లో విద్యుత్ లైన్లు, మంచినీటి పైపుల నిర్మాణం, రైల్వే, విమానాశ్రయాల్లో రాకపోకలు సాగేలా ఏర్పాట్లు వంటి వాటిపై దృష్టి పెట్టింది.



కచ్‌లోని సహాయక కేంద్రం

ఐరాసలో యోగా వైట్‌హౌస్‌లో విందు

మోదీ షెడ్యూల్ ఖరారు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా, ఈజిప్టు దేశాల పర్యటన షెడ్యూల్‌ను శుక్రవారం విదేశాంగ శాఖ విడుదల చేసింది. జూన్ 20 నుంచి 25 వరకు ప్రధాని అమెరికా, ఈజిప్టులలో పర్యటిస్తారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగే యోగా కార్యక్రమానికి నేతృత్వం వహిస్తారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళుతున్నారు. ఈ సారి పర్యటనలో యూఎన్‌లో జరిగే యోగా డేలో ప్రధాని పాల్గొనడం విశేషం. ప్రతీ రోజూ యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రపంచంలో అవగాహన పెరగాలని మోదీ ప్రధాని పదవి చేపట్టాక చేసిన ప్రయత్నాలతో యూఎన్ 2014లో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. ఇప్పుడు తొమ్మిదేళ్లయ్యాక యూఎన్‌లో జరిగే కార్యక్రమానికి నేతృత్వం వహిస్తూ ఉండడంపై ప్రధాని మోదీ ఉద్విగ్నంగా స్పందించారు. యోగా మరింతగా ప్రజాదరణ పొందాలని ఒక ట్వీట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

పర్యాటన ఇలా..!

- ప్రధాని మోదీ అమెరికా పర్యటన న్యూయార్క్ నుంచి మొదలవుతుంది. జూన్ 21న యూఎన్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8 నుంచి 9 గంటలవరకు జరిగే యోగా సెషన్‌లో ప్రధాని పాల్గొంటారు. భారత్ యూఎన్‌కు బహుమతిగా ఇచ్చిన మహాత్మా గాంధీ విగ్రహం ఎదుటే ఈ యోగా కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో యూఎన్ ప్రతినిధులు, వివిధ దేశాల రాయబారులు యోగా గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతారు.
- న్యూయార్క్ నుంచి వాషింగ్టన్‌కు వెళతారు. జూన్ 22న అధ్యక్షుడు బైడెన్‌తో అత్యున్నత స్థాయి చర్చలు జరుపుతారు.
- అమెరికా ప్రతినిధుల సభ, సెనేట్ స్పీకర్ల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి మోదీ ప్రసంగిస్తారు
- అదే రోజు రాత్రి ప్రధాని గౌరవార్థం బైడెన్ దంపతులు శ్వేత సౌధంలో అధికారిక విందు ఇస్తారు.
- జూన్ 23న ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ప్రధానికి ఆతిథ్యమిస్తారు. అదే రోజు ప్రధాని పారిశ్రామికవేత్తలతో, కార్పొరేట్ సంస్థల సీఈవోలతో సమావేశమవుతారు. ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తారు.
- జూన్ 24న ఈజిప్టుకి బయల్దేరి వెళతారు. అక్కడ రెండు రోజులు పర్యటిస్తారు. మన గణతంత్ర ఉత్సవాలకు హాజరైన ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్ సిసి ఆహ్వానం మేరకు అక్కడ పర్యటించనున్నారు.

బలహీనపడిన బిపర్‌జోయ్

- గుజరాత్ నుంచి రాజస్తాన్ వైపు పయనం
- జలోర్, బార్మర్ జిల్లాల్లో రెడ్ అలర్ట్
- గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలు

707 మంది శిశువుల జననం

గుజరాత్‌లో మంగళవారం సాయంత్రం నుంచి తుపాను కల్లోలం మొదలైంది. తుఫాను ప్రభావిత ప్రాంతాల నుంచి లక్షల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతంలోని 8 జిల్లాల్లో 1,171 మంది గర్భిణులు ఉండగా, వీరిలో 1,152 మందిని ఇతర ప్రాంతాలకు తరలించారు. గత నాలుగు రోజుల్లో వీరిలో 707 మంది గర్భిణులకు వివిధ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సురక్షితంగా ప్రసవం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. 707 మంది శిశువులు జన్మించారని పేర్కొంది.

జైపూర్/అహ్మదాబాద్/న్యూఢిల్లీ: గుజరాత్ తీర ప్రాంతాన్ని వణికించిన బిపర్‌జోయ్ తుపాను బలహీనపడింది. ఈశాన్య దిశగా ప్రయాణిస్తూ పొరుగు రాష్ట్రమైన రాజస్తాన్ వైపు మళ్లిందని అధికారులు వెల్లడించారు. తుఫాను ప్రభావం వల్ల రాజస్తాన్‌లోని జలోర్, బార్మర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ రెండు జిల్లాల్లో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. గురువారం సాయంత్రం దాదాపు 70 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని వాతావరణ శాఖ ప్రకటించింది. జలోర్‌లో శుక్రవారం ఉదయానికల్లా 69 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలియజేసింది. రెండు జిల్లాల్లో 200 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. జోధ్‌పూర్, జైసల్మేర్, పాలీ, సిరోహీ వైపు తుపాను పయనిస్తోందని, అక్కడ సైతం భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. శుక్రవారం, శనివారం రాజ్‌సమంద్, దుంగార్పూర్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముందుజాగ్రత్త చర్యగా రాజస్తాన్ ప్రభుత్వం జైపూర్, కోట, భరత్‌పూర్, ఉదయ్‌పూర్, అజ్మీర్, జోధ్‌పూర్, బికనేర్ తదితర ప్రాంతాలకు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపించింది. అజ్మీర్ జిల్లాలోని కిషన్‌గఢ్‌కు ఎన్డీఆర్ఎఫ్ బృందం చేరుకుంది.


గుజరాత్‌లో ప్రాణ నష్టం సున్నా

గుజరాత్‌లో బిపర్‌జోయ్ తుఫాను వల్ల ఇప్పటిదాకా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అతుల్ కార్వాల్ శుక్రవారం చెప్పారు. వివిధ ప్రాంతాల్లో 23 మంది గాయపడ్డారని, దాదాపు 1,000 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఇంకా పునరుద్ధరించలేదని ప్రకటించారు. గుజరాత్‌లో తుపాను కంటే ముందే ఇద్దరు చనిపోయారని వెల్లడించారు. తుపాను హెచ్చరికలపై ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించి, చేపట్టిన చర్యల వల్లే ప్రాణనష్టం సంభవించలేదని అన్నారు. కచ్ ప్రాంతంలో 40 శాతం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. 500 ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. పక్కా ఇళ్లకు పెద్దగా నష్టం వాటిల్లలేదన్నారు. 800 చెట్లు కూలిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, ఇందుకోసం గుజరాత్ ఎస్డీఆర్ఎఫ్‌తో కలిసి పని చేస్తున్నామని వివరించారు. రహదారుల వ్యవస్థకు నష్టం జరగలేదన్నారు. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ యథాతథంగా పని చేస్తోందన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

గుజరాత్‌లో 8 జిల్లాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 1,000కి పైగా బృందాలను రంగంలోకి దించినట్లు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, మోర్బీ, జునాగఢ్, గిర్ సోమనాథ్, రాజ్‌కోట్, పోర్‌బందర్ తదితర జిల్లాల్లో తుపాను వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముందస్తు చర్యలు చేపట్టడం, లక్ష మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్ల తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ చెప్పారు. తుపాను సహాయక చర్యల్లో సహకారం అందించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


- బిపర్‌జోయ్ అత్యంత తీవ్ర నుంచి తీవ్ర తుపానుగా బలహీనపడింది. రాజస్తాన్‌లోకి ప్రవేశించింది.
- తుపాను ధాటికి గుజరాత్‌లోని కచ్-సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం సాయంత్రం నాటికి 5,120 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. 4,600 గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఇప్పటిదాకా 3,580 గ్రామాలకు సరఫరా పునరుద్ధరించారు. మరో 1,000కిపైగా గ్రామాలకు పునరుద్ధరించాల్సి ఉంది.
- దాదాపు 800 చెట్లు నేలమట్టమయ్యాయి. ఫలితంగా పలు రహదారులపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.
- ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు ప్రాణనష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగాన్ని గుజరాత్ ప్రభుత్వం అభినందించింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌కు ఫోన్ చేసి పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, అటవీ జంతువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
- ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలకు స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు కూడా సహకారం అందించాయి.
- మరో 3 రోజులపాటు 23 రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది.
- సీఎం భూపేంద్ర పటేల్ తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.
- పాకిస్తాన్‌లోనూ తీర ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. దక్షిణ సింధూ ప్రావిన్స్ నుంచి 82,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



గుజరాత్‌లో కచ్ జిల్లాలోని మాండ్వీ పట్టణంలో శుక్రవారం జలమయమైన ఓ రహదారి



మాండ్వీలో వరద నీటిలో మునిగిన ఇళ్లు



కచ్ జిల్లాలో బలమైన ఈదురు గాలుల ధాటికి దెబ్బతిన్న స్వామినారాయణ ఆలయం


తృణధాన్యాల ప్రాధాన్యంపై పాట.. గ్రామీ విజేత ఫాలుతో కలిసి పాడిన ప్రధాని మోదీ



న్యూయార్క్: తృణధాన్యాల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ప్రత్యేకంగా రాసిన పాటను గ్రామీ అవార్డు విజేత, భారతీయ అమెరికన్ ఫల్గుణి షాతో కలిసి ప్రధాని మోదీ పాడారు. ఈ పాటను 'అబండెన్స్ ఇన్ మిల్లెట్స్' అనే పేరుతో ఈ నెల 16న ఫల్గుణి, ఆమె భర్త గాయకుడు గౌరవ్ షా కలిసి ప్రపంచవ్యాప్తంగా అన్ని స్ట్రీమింగ్ వేదికలపైనా ఇంగ్లిష్, హిందీ భాషల్లో విడుదల చేశారు. ముంబైలో జన్మించిన గాయని, పాటల రచయిత ఫల్గుణి షాను ఫాలు అనే పేరుతో ప్రసిద్ధురాలయ్యారు. పిల్లల కోసం ఈమె రూపొందించిన 'ఎ కలర్‌ఫుల్ వరల్డ్' ఆల్బమ్‌కు 2022లో ప్రసిద్ధ గ్రామీ అవార్డు దక్కింది. గ్రామీ అవార్డు గెలుచుకున్న అనంతరం గత ఏడాది ప్రధాని మోదీని ఆమె ఢిల్లీలో కలిశారు. ఆ సమయంలో ప్రపంచ ఆకలిని తీర్చే సామర్థ్యమున్న, మంచి పోషక విలువలు కలిగిన తృణధాన్యాల గొప్పదనంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఒక పాట రాయాలని ప్రధాని మోదీ సూచించారని చెప్పారు. ఇందుకు సహకారం అందించేందుకు కూడా ప్రధాని మోదీ అంగీకరించారని వివరించారు. ఒక వైపు పాట కొనసాగుతుండగానే తృణధాన్యాల గొప్పదనంపై స్వయంగా రాసిన మాటలను ప్రధాని మోదీ వినిపిస్తారని ఫాలు పీటీఐకి తెలిపారు. భారత్ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

నెహ్రూ లైబ్రరీ ఇక ప్రధానమంత్రి లైబ్రరీ

కేంద్ర సాంస్కృతిక శాఖ తీర్మానం.. పేరు మార్పుపై కాంగ్రెస్ ఆగ్రహం




న్యూఢిల్లీ: ఢిల్లీలో తీన్‌మూర్తి భవన ప్రాంగణంలో ఉన్న 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ' పేరును కేంద్ర ప్రభుత్వం ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీగా మార్చింది. తొలి ప్రధాని నెహ్రూ అధికారిక నివాసం తీన్‌మూర్తి భవన్‌ను ప్రభుత్వం గత ఏడాది 'ప్రధానమంత్రి సంగ్రహాలయ'గా మార్చిన సంగతి తెలిసిందే. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ పేరును ప్రైమ్‌మినిస్టర్స్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీగా మారుస్తూ తీర్మానించినట్లు కేంద్ర సాంస్కృతిం శాఖ శుక్రవారం ప్రకటించింది. నెహ్రూ నుంచి మోదీ దాకా ప్రధానుల వివరాలు, వారి ఘనత, దేశ అభివృద్ధిలో వారి పాత్రకు సంబంధించిన సమాచారాన్ని ఈ లైబ్రరీలో ప్రదర్శించనున్నట్లు తెలిపింది. సొసైటీ ఉపాధ్యక్షుడైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నెహ్రూ తీన్‌మూర్తి భవన్‌లో 16 ఏళ్లకుపైగా 1964 మే 27న చనిపోయే దాకా ఉన్నారు. 1966లో ఇక్కడ 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ సొసైటీ' ఏర్పాటయ్యింది.

అల్పబుద్ధిని చాటుకున్న ప్రభుత్వం: కాంగ్రెస్

నెహ్రూ లైబ్రరీ పేరు మార్పుపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అల్పబుద్ధిని చాటుకుందని అన్నారు. భవనాల పేరు మార్చినంత మాత్రాన మహోన్నత వ్యక్తుల పేరు ప్రఖ్యాతులను చెరిపివేయలేరని పేర్కొన్నారు. చరిత్ర లేనివారే ఇతరుల చరిత్రను చెరిపివేసేందుకు ప్రయత్నిస్తారని ఎద్దేవా చేశారు.

ముందస్తును కొట్టిపారేయలేం: నితీశ్



పట్నా: దేశంలో ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ మరోసారి స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఏకమవుతుండడం అధికార బీజేపీకి కలవరం కలిగిస్తోందని చెప్పారు. విపక్ష కూటమి పూర్తిగా బలం పుంజుకోకముందే ఎన్నికలు నిర్వహించాలన్న యోచనలో అధికార పక్షం ఉండొచ్చని తెలిపారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఐచ్ఛికం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని గుర్తుచేశారు.

ఈడీ కస్టడీకి సెంథిల్ బాలాజీ

చెన్నై జిల్లా కోర్టు ఉత్తర్వులు



సాక్షి, చెన్నై: మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని 8 రోజుల ఈడీ కస్టడీకి అప్పగిస్తూ చెన్నై జిల్లా మొదటి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లిల్లీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గుండెపోటు రావడంతో ఆయన్ను కావేరీ ఆస్పత్రిలో చేర్చారు. శుక్రవారం డాక్టర్ ఏఆర్ రఘురాం నేతృత్వంలోని బృందం రెండు మూడు రోజులలో ఆయనకు బైపాస్ సర్జరీ చేయడానికి చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో సెంథిల్ బాలాజీని 15 రోజులు తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ వేసిన పిటిషన్‌పై చెన్నై జిల్లా మొదటి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లిల్లీ విచారణ చేపట్టి..ఎనిమిది రోజుల పాటు సెంథిల్ బాలాజీని కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న దృష్ట్యా, విచారణ అక్కడే జరగాలని ఆదేశించారు. సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్‌ను నిరాకరించారు. సెంథిల్ బాలాజీ సోదరుడు అశోకన్‌ను విచారించేందుకు ఈడీ సమన్లు జారీ చేసింది.

కేంద్ర మంత్రి ఇంటిపై పెట్రోల్‌బాంబులతో దాడి

మణిపూర్‌లో ఆగని హింసాత్మక ఘటనలు

ఇంఫాల్/కోచి: మణిపూర్‌లో తెగల మధ్య ఘర్షణలు చల్లారే సూచనలు కనిపించడం లేదు. గురువారం రాత్రి రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఆర్‌కే రంజన్ సింగ్ ఇంటిని ఆందోళనకారుల గుంపు ధ్వంసం చేసింది. ఆ ఇంటిని తగులబెట్టేందుకు యత్నించగా ఫైర్ సిబ్బంది భద్రతా బలగాలు మంటలను ఆర్పారు. 'పట్టణంలో కర్ఫ్యూ కొనసాగుతున్న సమయంలోనే నిరసనకారులు మంత్రి ఇంటిని చుట్టుముట్టి, నలువైపుల నుంచి పెట్రోల్ బాంబులు విసిరారు. మంత్రి నివాసం రక్షణ కోసం మొత్తంగా 22 మందిమి ఉన్నాం. వాళ్లేమో 1,200 వరకు ఉన్నారు. దాంతో, మేం నిస్సహాయ స్థితిలో ఉండిపోయాం'అని భద్రతా సిబ్బంది ఒకరు తెలిపారు. ఆసమయంలో మంత్రి రంజన్ సింగ్ ఇంట్లో లేరు. బుధవారం కుకీల గ్రామంపై కొందరు దాడి చేసి, 9 మందిని కాల్చి చంపడంతోపాటు 10 మందిని గాయపరిచిన ఘటనకు నిరసనగా అంతకుముందు ఆందోళనకారులు ఇంఫాల్‌లో రెండు నివాసాలకు నిప్పుపెట్టారు. అడ్డుకోబోయిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్)తో తలపడ్డారు. పట్టణంలో యథేచ్ఛగా సంచరించారు. టియర్ గ్యాస్, మాక్ బాంబులను ప్రయోగిస్తూ వారిని చెదరగొట్టేందుకు బలగాలు ప్రయత్నించాయి. ఈ సందర్భంగా ఇద్దరు నిరసనకారులు, ఆర్‌ఏఎఫ్ కానిస్టేబుల్ ఒకరు గాయపడ్డారు. నోంగ్‌మెయిబుంగ్, వాంగ్‌ఖై ప్రాంతాల్లో నిరసనకారులు రోడ్లపై రాళ్లు, ఇతర అడ్డంకులతో బలగాలతో తలపడ్డారు. ఇలా ఉండగా, కేరళలోని కోచిలో పార్టీ సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి రంజన్ సింగ్ తన నివాసంపై దాడి విషయం తెలుసుకున్నారు. తన కార్యక్రమాలను రద్దు చేసుకుని, తిరుగుపయనమయ్యారు. 'అది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రాష్ట్రంలో మే 3 నుంచి కొనసాగుతున్న హింసాత్మక ఘటనలను నివారించి, శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తున్నా. నా ఇంటిపై దాడితో మతానికి సంబంధం లేదు. ఇది మూక విధ్వంసం'అని పేర్కొన్నారు. కాగా, బుధవారం కాల్పుల ఘటనపై దర్యాప్తు జరిపి, కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం బిరెన్ సింగ్ తెలిపారు. దుండగుల కోసం కురంగ్‌పట్, యయింగంగ్‌పోక్పిల్లో ఇల్లిల్లూ గాలింపు జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. వదంతుల వ్యాప్తిని నివారించేందుకు ఇంటర్నెట్‌పై అధికారులు నిషేధం విధించారు. ఎస్టీ హోదా విషయమై మణిపూర్‌లోని కుకీ, మెయిటీ తెగల మధ్య కొనసాగుతున్న ఘర్షణల్లో ఇప్పటి వరకు 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

సాక్షి కరీంనగర్

శనివారం | 17 | జూన్ | 2023



పత్తిధర రూ.7,100

జమ్మికుంట: జమ్మికుంటలో క్వింటాల్ పత్తి రూ.7,100 పలికింది. మార్కెట్‌కు 14వాహనాల్లో 202క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. మోడల్ ధర రూ.7,050, కనిష్ట ధర రూ.6,700 పలికింది.

ముగ్గురు ఎస్సైలకు పదోన్నతి

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి వచ్చింది. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రహీంపాషా, రూరల్ పోలీసుస్టేషన్ ఎస్సై బి.ప్రశాంత్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న ఎం.డీ.రఫీక్‌ఖాన్‌లు సీఐలుగా పదోన్నతి పొందారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.0/29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం వేడిగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

అవగాహనతో మోసాలకు అడ్డుకట్ట



అవగాహన కల్పిస్తున్న ఏసీ విజయసారథి

కరీంనగర్ అర్బన్: తూకాలపై అవగాహన ఉన్నప్పుడే మోసాలకు అడ్డుకట్ట పడుతుందని తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విజయసారథి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని వినియోగదారులకు అవగాహన కల్పించారు. తూకాల్లో మోసాలు ఎలా చేస్తారో ప్రాక్టికల్‌గా వివరించారు. పెట్రోల్ పంపులు, సూపర్ మార్కెట్లు, చేపల మార్కెట్లు, బంగారం దుకాణాలు, స్టీల్, సిమెంట్ దుకాణాలు, ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లలో మోసపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. తూనికలు, కొలతల్లో ఎలాంటి మోసాలు జరిగినా 9441828975 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌స్పెక్టర్ భూలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ రూపేశ్‌కుమార్, సిబ్బంది సుభాష్, లక్ష్మి, కరుణాకర్, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

మాజీ మావోకు చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: మావోయిస్టు డీసీఎంగా పనిచేసి లొంగిపోయిన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగులపల్లికి చెందిన నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క(35)కు శుక్రవారం కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బరాయుడు తన కార్యాలయంలో రూ.5లక్షల ఆర్థికసాయం చెక్కును అందించారు. మావోయిస్టు నేరెళ్ల జ్యోతి గతనెల 12న పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు ఎదుట లొంగిపోయిన విషయం విదితమే. ప్రభుత్వం నుంచి విడుదలైన ఆర్థికసాయాన్ని శాశ్వత అవసరాలకోసం వినియోగించుకోవాలని సీపీ ఈ సందర్భంగా జ్యోతికి సూచించారు.


జగన్నాథ రథయాత్రకు కదలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్ కల్చరల్: ఈ నెల 28న కరీంనగర్‌లో ఇస్కాన్- మెట్‌పల్లి, ప్రజ్ఞాభారతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జగన్నాథ రథయాత్రకు కదలి రావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తనక్యాంపు కార్యాలయంలో రథయాత్ర పోస్టర్‌ను ఆయన నిర్వాహకులతో కలసి ఆవిష్కరించారు. ఏటా పూరీలో జరిగే రథయాత్ర కరీంనగర్‌లో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జగన్నాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు. రథయాత్ర చైర్మన్ కన్న కృష్ణ మాట్లాడుతూ 28న మధ్యాహ్నం 2:30కు రాంనగర్ రమాసత్యనారాయణస్వామి ఆలయం నుంచి యాత్ర ఉంటుందని తెలిపారు. ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు డాక్టర్ ఎల్. రాజభాస్కర్‌రెడ్డి, కో-కన్వీనర్ తుమ్మల రమేశ్‌రెడ్డి, నిరంజనాచారి, మెట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ చైర్మన్ ప్రభుదాస్ పాల్గొన్నారు.

గిరిజనబంధు ఇవ్వకుంటే పోరాటమే..



విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: దశాబ్ది ఉత్సవాల ముగింపులోపు గిరిజన బంధు అమలుచేస్తూ జీవో జారీచేయాలని చేయాలని, లేకుంటే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ హెచ్చరించారు. గిరిజనబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు.గిరిజనబంధు అమలుచేస్తామని గత ఏడాది సెప్టెంబర్ 17న సీఎం కేసీఆర్ ప్రకటించి, ఎనిమిది నెలలు కావస్తున్నా అమలుకు నోచుకోకపోవడం దుర్మార్గమని ఆరోపించారు. ఎప్పుడు అమలుచేస్తారో స్పష్టత ఇవ్వాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నాయకులు శివరాజు, లక్‌పతి నాయక్, తిరుపతినాయక్, ప్రకాశ్‌నాయక్, తదితరులున్నారు.

టార్గెట్లు.. షోకాజ్ నోటీసులు

- జిల్లాలో ఆయిల్‌పామ్ రగడ
- ఏఈవోలకు ఉన్నతాధికారుల లక్ష్యం
- సాగుకు ఆసక్తి చూపని రైతులు
- ఏఈవోలను బాధ్యులను చేస్తున్నారని ఆరోపణ
- మంత్రితో సమస్యల ఏకరవు
- నేడు కార్యాచరణ సమావేశం



మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం ఇచ్చి, తమ ఇబ్బందులను వివరిస్తున్న ఏఈవోలు

కరీంనగర్ అర్బన్: ఆయిల్‌పామ్ లక్ష్యం ఏఈవోల మెడకు చుట్టుకుంటోంది. షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్ వరకు చేరుకున్నట్లు సమాచారం. ఇప్పటికే సామర్థ్యానికి మించి పనిభారం మోస్తుండగా అధికారుల వేధింపులు ఆందోళన రేపుతోంది. విసిగి వేసారిన ఏఈవోలు టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. అసలే వివిధ రకాల పనులతో నానాపాట్లు పడుతుండగా ఆయిల్‌పామ్ లక్ష్యం చేరలేదంటూ వేధిస్తున్నారని వాపోయారు. ఇప్పటికే 10 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా ముగ్గురి సస్పెన్షన్‌కు ఫైల్ సిద్ధం చేస్తుండటంతో ఏఈవోలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి కార్యాచరణతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు వినికిడి.

టార్గెట్లు సరే.. రైతుల ఆసక్తి ఏదీ

ఆయిల్‌పామ్ సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించడంలో నిర్దేశిత లక్ష్యం చేరుకోవాలన్నది ఉన్నతాధికారుల మాట. రైతులు ఆసక్తి చూపకపోవడంతో జిల్లాలో అనుకున్నంతగా లక్ష్యం చేరలేదు. ఉన్నతాధికారులు ప్రతివారం ఒక్కో ఏఈవో వారీగా పనితీరును పరిశీలిస్తున్నారు. టార్గెట్ చేరుకోవడంలో పేలవ ప్రదర్శన ఉందంటూ 10 మంది ఏఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా ముగ్గురిని సస్పెండ్ చేసేందుకు ఫైల్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఒక్కో ఏఈవోకు గరిష్ఠంగా 200 ఎకరాలు నిర్దేశించారు. రైతు వేదికల ద్వారా, వివిధ కార్యక్రమాల్లో ఆయిల్‌పామ్‌పై ఏఈవోలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కానీ రైతులే ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో టార్గెట్‌లో కనీసం 50ఎకరాలు కూడ చేరుకోని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో మొక్కలను ఎలా నాటించగలమని ఏఈవోలు వాపోతున్నారు.

సేవలు అనేకం

జిల్లాలో 76 క్లస్టర్లకు 76 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. నాలుగు వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. వీఆర్వో వ్యవస్థ ఉన్నపుడు వీరికి పనిఒత్తిడి తక్కువగా ఉండేది. వీఆర్వోలను ఇతర శాఖల్లో కలపడంతో వారి విధులను ఏఈవోలే నిర్వహిస్తున్నారు. ధాన్యం కొనుగోలు, పంటల వివరాల నమోదు, ఇతరత్ర సేవల్లో ఇపుడు వీరిదే ప్రధాన పాత్ర. ధాన్యం విక్రయించే క్రమంలో కౌలు రైతులకు సర్టిఫికెట్ జారీ చేయడం, ధాన్యం సరఫరా వంటి పనులు చేపడుతున్నారు. ముందస్తుగా పంటల సాగు, విత్తనోత్పత్తి, పంట ప్రణాళిక, పంట నష్టం తదితర పనులతో పాటు తాజాగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అలుపెరగని విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయిల్‌పామ్ లక్ష్యమంటూ చివాట్లు పెడుతుండటం గందరగోళానికి దారితీస్తోంది. ఆయిల్‌పామ్ సాగు చేయాలంటే పెద్ద రైతులు ఆసక్తి చూపితేనే లక్ష్యం చేరుకునే పరిస్థితి. చిన్న, సన్నకారు రైతులు ఆయిల్‌పామ్ అంటేనే వద్దని ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. పెద్ద రైతుల స్పందన అంతంతే.

రైతు వేదికల నిర్వహణకు నిధుల్లేవ్

రైతు వేదికల నిర్వహణకు నిధుల విడుదల లేకపోగా ఏఈవోలకు భారంగా మారింది. గత సంవత్సరం మే వరకు నెలకు రూ.9500 మెంటనెన్స్ గ్రాంట్ వచ్చేది. ఇందులో వాచర్‌కు రూ.3వేలు, పారిశుధ్యం, తాగునీరు, కాగిత ఖర్చులు, కరెంట్ బిల్లు తదితర ఖర్చులకు రూ.4500లు కేటాయించగా గత జూన్ నుంచి నిర్వహణ నిధులు రాకపోగా తలకు మించిన భారంగా మారిందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా జేబు నుంచి ఖర్చు చేస్తుండగా వాచర్‌గా రూ.3వేలకు పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఆయిల్‌పామ్ లక్ష్యం, రైతు వేదిక నిర్వహణ నిధుల లేమి తదితర సమస్యలపై కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

ధాన్యం డబ్బులు పడ్డాయి!



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

జిల్లా	శుక్రవారం	ఇప్పటివరకు	లక్ష్యం
కరీంనగర్	రూ.210 కోట్లు	రూ.510 కోట్లు	రూ.600 కోట్లు
జగిత్యాల	రూ.250 కోట్లు	రూ.600 కోట్లు	రూ.853 కోట్లు
సిరిసిల్ల	రూ.50 కోట్లు	రూ.330 కోట్లు	రూ.511 కోట్లు
పెద్దపల్లి	రూ.190 కోట్లు	రూ.450 కోట్లు	రూ.694 కోట్లు
మొత్తం	రూ.700 కోట్లు	రూ.1890 కోట్లు	రూ.2,658 కోట్లు

- ఉమ్మడి జిల్లాకు రూ.1890 కోట్లు విడుదల
- శుక్రవారం ఒక్కరోజే రూ.700 కోట్లు
- 20వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎప్పుడెప్పుడా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్న ధాన్యం డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. శుక్రవారం పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా రూ.3 వేల కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు రూ.700 కోట్లు ఇచ్చింది. ఈసారి అకాల వర్షాలు, వడగళ్ల వానలతో అతలాకుతలమైన రైతు దిగుబడి తగ్గి తల్లడిల్లిపోయాడు. అనంతరం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు వరుణదేవుడు ముప్పతిప్పలు పెట్టాడు. ఇవి చాలవన్నట్లుగా కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు, నిర్వాహకులు రైతులను తాలు, తేమ పేరుతో క్వింటాలుకు 9 నుంచి 11 కిలోలు తరుగు పేరిట వేధించారు.

ఇప్పటివరకు రూ.1890 కోట్లు...

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచి పౌరసరఫరాలశాఖ కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. మధ్యలో అకాల వర్షాలు, వడగండ్లు ఇబ్బంది పెట్టినా.. రైతులకు సమయానికి డబ్బులు ఇవ్వాలన్న లక్ష్యంతో ఎప్పటికపుడు ఖాతాల్లో డబ్బులు జమచేసింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు రూ.1890 కోట్లు విడుదల చేసింది. కరీంనగర్‌లో 59,186 మంది రైతుల వద్ద మూడులక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.510 కోట్లు చెల్లించింది. జగిత్యాలలో 60,000 మంది నుంచి 41.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.600 కోట్లు ఇచ్చింది. సిరిసిల్లలో 2.45 లక్షల మంది నుంచి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంకొని రూ.330 కోట్లు జమ చేసింది. పెద్దపల్లి జిల్లాలో 47,584 మంది రైతుల వద్ద 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.450 కోట్లు రైతులకు అందజేసింది. ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ కొనసాగుతున్నప్పటి నుంచే వరి సాగులో మేటిగా ఉండేది. తెలంగాణ వచ్చాక సాగు విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో తన రికార్డులను తానే తిరగరాస్తోంది.

ఆదివారంతో కొనుగోళ్లు పూర్తి



రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ ప్రక్రియ ఆదివారానికి పూర్తవుతుంది. ఆదివారంతో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేసి, 20వ తేదీనాటికి డబ్బులు రైతుల ఖాతాల్లో వేసేలా చర్యలు చేపట్టాం. సీఎం ప్రవేశపెట్టిన 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుల వద్ద చెంతనే కొనుగోలు కేంద్రాలు వంటి రైతు అనుకూల విధానాలతో రాష్ట్రంలో దిగుబడి గణనీయంగా పెరిగింది.

– గంగుల కమలాకర్, పౌరసరఫరాల మంత్రి

కాళేశ్వరంతో పెరిగిన దిగుబడి



రాష్ట్రంలో వరి కొనుగోలు ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. రెండురోజుల్లో మొత్తం కొనుగోళ్లు, డబ్బుల జమ ప్రక్రియ కూడా ముగుస్తుంది. సీఎం రైతు పక్షపాతి. కాళేశ్వరం జలాలతోనే రాష్ట్రంలో పంట దిగుబడి అనూహ్యంగా పెరిగింది. ఎంత పంట వచ్చినా కొనుగోలుకు వెనకాడవద్దని సీఎం చెప్పారు.

– సర్దార్ రవీందర్‌సింగ్, చైర్మన్, పౌరసరఫరాల శాఖ

'పర్లపల్లి'కి ఐఎస్‌వో-9001 గుర్తింపు



పంచాయతీరాజ్ మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న సర్పంచ్

తిమ్మాపూర్: అభివృద్ధిలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామ పంచాయతీ రాష్ట్రంలోనే తొలిసారిగా ఐఎస్‌వో-9001 గుర్తింపు పొందింది. ఈ మేరకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్‌లో సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సర్టిఫికెట్ అందుకున్న తొలి సర్పంచ్‌గా భారతి రికార్డుకెక్కారు. తెలంగాణలో ఈ సర్టిఫికెషన్ పొందిన తొలి పంచాయతీగా పర్లపల్లికి గుర్తింపు దక్కింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధిలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న పర్లపల్లి, ముఖరా(కె) గ్రామ పంచాయతీలతోపాటు 27 పంచాయతీలు ఐఎస్‌వో- 9001 సర్టిఫికెట్లు పొందాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు, బీఆర్‌ఎస్ఎల్పీ కార్యదర్శి మాదాడి రమేశ్‌రెడ్డి, తిమ్మాపూర్ ఎంపీపీ వనిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశ దశదిశ మార్చిన మోదీ ప్రభుత్వం


- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ



మాట్లాడుతున్న రాణి రుద్రమ

కరీంనగర్‌టౌన్: కేంద్రంలోని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో భారతదేశ దశదిశ మారిందని, విశ్వంలోనే దేశాన్ని నంబర్‌వన్‌స్థాయికి తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కుతుందని, భారతీయ జనతా పార్టీలోని ఓబీసీ,ఎస్సీ,ఎస్టీ, మహిళా, మైనారిటీ, కిసాన్, యువ మోర్చాలు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ పిలుపునిచ్చారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ మోర్చా సంయుక్త సమావేశం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మి గార్డెన్‌లో జాడిబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రుద్రమ మాట్లాడుతూ.. ఆయా మోర్చా బాధ్యులందరూ తమవర్గాలకు 9ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన మేలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటా చేరేలా కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మోదీ ప్రభుత్వ పథకాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు గుగ్గిళ్లపు రమేశ్, కొరటాల శివరామకృష్ణ , కోమల ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, కోమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, పుల్లెల పవన్, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

కరీంనగర్‌టౌన్:కనీసం 50శాతం గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు.గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు, వాక్సినేషన్, ఇతర ఆరోగ్య కార్యక్రమాలపైన ప్రగతిని సమీక్షించారు. 50శాతం కన్నా తక్కువ ప్రసవాలు జరుగుతున్న గంగాధర, మానకొండూర్, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను జూన్ మాసంలో ప్రసవాల సంఖ్య పెంచేవిధంగా చూడాలని ఆదేశించారు. అదనపు డీఎంహెచ్‌వో సుజాత, డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

బల్దియాకు మరో అవార్డు



అవార్డు అందుకుంటున్న కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థకు రాష్ట్రస్థాయిలో మరో అవార్డు దక్కింది. లక్ష జనాభా పైన ఉన్న నగర కేటగిరిలో వీధివ్యాపారులు, మహిళా సమాఖ్య విభాగంలో అవార్డు వచ్చింది. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా కమిషనర్ సేవా ఇస్లావత్, మేయర్ యాదగిరి సునీల్ రావు అవార్డు అందుకున్నారు.నగరపాలకసంస్థ పారిశుధ్య కార్మికురాలు సంతోషిని మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు,రూ.5వేల నగదు, పట్టు చీర అందుకున్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఈ అవార్డులు ప్రకటించారు.

ఆత్మగౌరవం పెరిగేలా అభివృద్ధి

- గుడ్డి దీపం నుంచి వెలుగుల కరీం'నగరం'
- మంత్రి గంగుల కమలాకర్



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న మంత్రి కమలాకర్, వినోద్‌కుమార్, కౌశిక్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: దశాబ్దకాలంలో ఆత్మగౌరవం పెరిగేలా అద్భుతమైన అభివృద్ధి సాధించామని, తెలంగాణ ఏర్పాటుతోనే ఇది సాధ్యమైందని రాష్ట్ర పౌరసరఫరాల, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది కరీంనగర్ మున్సిపాలిటీయేనని, అందుకే తాను నగర అభివృద్ధితో రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పద్మనాయక కల్యాణ మండపంలో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. సమైక్య రాష్ట్రంలో గుడ్డి దీపాలుగా ఉన్న పరిస్థితుల నుంచి తెలంగాణలో జిగేలుమనే వెలుగులుగా నగరంగా మారిందన్నారు. ఆంధ్రరాష్ట్రంలో తాను కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో దరఖాస్తు ఇచ్చి దండం పెట్టినా రూ.1లక్ష నిధులు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అప్పుడు గుంతల రోడ్లు, మురికి కాలువలు, చెత్తా చెదారం కంపుకొట్టే వాతావరణం నగరంలో చూశామని, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిందన్నారు. మానేరు రివర్‌ఫ్రంట్ ప్రారంభోత్సవం అనంతరం ప్రపంచస్థాయికి చేరుతుందన్నారు. హైదరాబాద్, వరంగల్‌లు స్మార్ట్‌సిటీ జాబితాలో చోటు కల్పించేందుకు అవకాశం వస్తే, హైదరాబాద్‌కు బదులుగా కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీకి ఎంపిక చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. ప్రణాళికాబోర్డు ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్‌ను లండన్‌గా మారుస్తామని కేసీఆర్ చెబితే, కొంతమంది పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. తన సోదరుడి ప్రతిమ, మరో చల్మెడ కళాశాలలున్నందున కరీంనగర్‌కు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ రాదని ప్రచారం చేస్తే తాము నవ్వుకున్నామన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కళాశాల కావాలని కాంగ్రెస్ అడిగితే, తాము ఉమ్మడి జిల్లాలో నాలుగు కళాశాలలు ఇచ్చామన్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ రూ.వేయి కోట్లతో నగరంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాలుగు సంవత్సరాల తమ పాలనలో రూ.800 కోట్లకు పైగా నిధులతో పనులు చేశామని, ఇది గర్వకారణమన్నారు. శాసన మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, సుడా చైర్మన్ జి.వి.రామకృష్ణారావు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, నగరపాలకసంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



కార్మికులు, కార్పొరేటర్లతో భోజనం చేస్తున్న మంత్రి



నగరపాలక పారిశుధ్య వాహనాల భారీ ప్రదర్శన

ఆకట్టుకున్న వాహన ర్యాలీ

పట్టణ ప్రగతి నగరంలో అట్టహాసంగా సాగింది. నగరపాలకసంస్థ కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు మానవహారాన్ని చేపట్టారు. మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు వేసిన ముగ్గులు అలరించాయి. అంబేడ్కర్ స్టేడియం నుంచి నగరపాలక వాహనాల ర్యాలీని ప్రారంభించారు. తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన వేదిక నుంచి వాహన ప్రదర్శనను తిలకించారు. స్టేడియం నుంచి తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తా, కాపువాడ మీదుగా కమాన్‌చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన సభలో ఉత్తమ కార్మికులు, అధికారులు, ఉద్యోగులను షీల్డ్‌తో సత్కరించారు. పట్టణ ప్రగతి నివేదిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. 6,214 మంది వీధి వ్యాపారులకు రూ.12,42,80,000 రుణం అందించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి కమలాకర్, వినోద్, సునీల్‌రావు సహపంక్తి భోజనాలు చేశారు.

క్లుప్తంగా

గల్ఫ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్



రమేశ్‌కు నియామకపత్రం ఇస్తున్న రవిగౌడ్

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్ అధ్యక్షతన శుక్రవారం జగిత్యాలలో గల్ఫ్ జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. గల్ఫ్ జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిలుముల రమేశ్‌ను నియమించారు. గుగ్గిళ్ల రవిగౌడ్ మాట్లాడుతూ, రవిగౌడ్ దుబాయ్‌లో 16ఏళ్లపాటు పనిచేసిన అనుభవం, గల్ఫ్ కార్మికుల కోసం చేసిన సేవలు గుర్తించి అధ్యక్షుడిగా నియమించామన్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలు 50 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తున్నారని, సురక్షిత, చట్టబద్ధ వలసల కోసం అవగాహన, చైతన్య కార్యక్రమాలు చేపడతామని, హక్కుల కోసం పోరాడుతామని అన్నారు. గల్ఫ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల, కార్యదర్శి బుత్కూరి కాంత, నాయకులు ఊట్నూరి రవి, దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవా సమితి అధ్యక్షుడు బాబుస్వామి పాల్గొన్నారు.

రేపు రజనీశ్రీ కథా పురస్కారం ప్రదానోత్సవం

కరీంనగర్ కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింభవన్‌లో నాట్యాచార్యుడు, తెలంగాణ బళ్లారి రాఘవ, సాహితీవేత్త రజనీ కథా పురస్కారం-2023 ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పురస్కార కమిటీ కన్వీనర్, అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ తెలిపారు. పురస్కారాన్ని 'కలుంకూరి గుట్ట' కథా సంపుటికి గాను చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన యువ కథా రచయిత కేవీ. మేఘనాథరెడ్డికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాస్యకథా రచయిత్రి, సినిమా కథా రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి, అతిథులుగా సాహితీ వేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, రచయిత, విమర్శకుడు బి.వినోద్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రిమిసంహారక మందు తాగి యువతి ఆత్మహత్య



పూజిత మృతదేహం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన ఆలకుంట పూజిత (21) యువతి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు, ఎస్సై రాజేశ్ కథనం ప్రకారం.. ఆలకుంట శివయ్య-భార్య పద్మ పదేళ్లక్రితం కుటుంబంతో కలిసి సుందరగిరికి వచ్చాడు. ఇక్కడే వ్యవసాయబావులు తవ్వుతూ జీవిస్తున్నాడు. పూజిత శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. తలనొప్పిగా ఉందని, చెమటలు పడుతున్నాయని కుటుంబసభ్యులకు తెలపడంతో హుస్నాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం పూజిత మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా పూజితకు కొన్నిరోజులుగా కడుపునొప్పి ఉండేదని, పెళ్లి కావడం లేదనే బెంగతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ కోర్సులకు నోటిఫికేషన్

- జూలై 15 వరకు గడువు



పాలాసలోని వ్యవసాయ కళాశాల

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, హార్టికల్చర్ వంటి కోర్సుల్లో చేరేందుకు అవసరమైన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసింది. బైపీసీ ఉత్తీర్ణులై, తెలంగాణ ఎంసెట్-2023(మెడికల్ అండ్ అగ్రికల్చర్)లో సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వెటర్నరీ సైన్స్ కోర్సు వ్యవధి ఐదున్నర ఏళ్లు కాగా, మిగతా కోర్సుల వ్యవధి నాలుగేళ్లు.

సీట్ల వివరాలు..

- హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లా పొలాస, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, వరంగల్ అర్బన్ జిల్లా, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏడు అగ్రికల్చర్ కళాశాలలు ఉన్నాయి.
- ఇందులో 520 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 200 సెల్ఫ్ ఫైనాన్స్(పేమెంట్) సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్సీ(వెటర్నరీ) కళాశాలలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, వరంగల్ అర్బన్ జిల్లా మామునూరులో ఉన్నాయి. వీటిలో 174 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎఫ్ఎస్సీ(ఫిషరీష్) కళాశాలలు : వనపర్తి జిల్లా పెబ్బేరులో 28 సీట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్‌లో తెలంగాణ విద్యార్థులకు 11 సీట్లు కేటాయించారు.
- బీఎస్సీ(హార్టికల్చర్) కళాశాలలు : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లా మోజర్లలో ఉండగా, ఇందులో 170 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 34 పేమెంట్ సీట్లను కేటాయించారు.
- బీఎస్సీ(కమ్యూనిటీ సైన్స్) కళాశాల: హైదరాబా ద్‌లోని సైఫాబాద్‌లో ఉండగా, 38 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 5 పేమెంట్ సీట్లు ఉన్నాయి. అన్ని కోర్సుల్లో పేమెంట్ సీట్లను ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు.

జూలై 15 వరకు గడువు..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1,800, ఎస్సీ, ఎస్టీలు రూ.900 చెల్లించాలి. సీటు లభిస్తే.. వ్యవసాయ, కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు రూ.45,550, వెటర్నరీ కోర్సులకు రూ.57,500, ఫిషరీష్ కోర్సులకు రూ.43,740, హార్టికల్చర్ కోర్సులకు రూ.50,425 ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అగ్రికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.10 లక్షలు, హార్టికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.9 లక్షలు చెల్లించాలి. ఎంసెట్-2023 ర్యాంకుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు జూలై 15వ తేదీ వరకు గడువు ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దఖాలు చేసేందుకు జూలై 17వ తేదీ వరకు గడువు విధించారు.

అర్హతలివే..

- 2023 డిసెంబర్ 31 నాటికి జనరల్ అభ్యర్థులు వయస్సు 17 ఏళ్లు పూర్తయి, 22 ఏళ్లు దాటి ఉండకూడదు.
- ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు, పీహెచ్‌లకు 27 ఏళ్ల వరకు అనుమతి ఉంటుంది.
- ఒక వెటర్నరీ కోర్సుకు జనరల్ అభ్యర్థులు 17–25 ఏళ్ల మధ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు 30 ఏళ్ల వరకు ఉండవచ్చు.
- ఎకరం వ్యవసాయ భూమి ఉన్న రైతుల పిల్లలకు వెటర్నరీ కళాశాలల్లో 25 శాతం, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- అయితే, ఆ భూమి విద్యార్థి పేరిట లేదా తల్లితండ్రుల పేరిట పట్టా ఉండాలి.
- ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్ల పాటు నాన్ మున్సిపల్ ఏరియా(గ్రామీణ ప్రాంతం)లో చదివి ఉండాలి.
- బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీజేటీఎస్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను లాగిన్ కావాలి.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ గుర్తింపు రద్దుచేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మల్యాల రాకేశ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అన్నిప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో లాభార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నడిపిస్తున్నా పట్టించుకున్న వారే లేకుండాపోయారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యను వ్యాపారం చేస్తున్న అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించడంతో స్పందించిన అధికారులు నోటీసులు జారీచేసి బుక్స్ సీజ్‌చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విష్ణు, జోనల్ ఇన్‌చార్జి నందు, నగర సంయుక్త కార్యదర్శి వంశీ, రాకేశ్, సంహిత్ కార్యకర్తలు అబ్దుల్, సిద్ధు, సన్నీ, ప్రదీప్, రక్షణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ట్రైనీ కలెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువు అందని ద్రాక్షలా మారిందని కేజీ టూ పీజీ ఉచిత విద్య ఉత్తదేనన్నారు. విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. పాఠశాలలో సబ్జెక్టుల వారిగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, స్కావెంజర్ పోస్టులు, ప్రతి పాఠశాలకు గ్రంథాలయం, డిజిటల్ క్లాసులకు అవసరమయ్యే సామగ్రి, ప్రతీ పాఠశాలకు జిల్లావ్యాప్తంగా సరిపడనిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల్లో కనీసం టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, కరెంటు, వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడిపల్లి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, పూరెల్ల సాయిప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా 'పట్టణ ప్రగతి అభివృద్ధి'

- పచ్చదనం, పారిశుధ్యానికి పెద్దపీట
- పట్టణ ప్రగతితో మౌలిక వసతుల కల్పన
- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/జమ్మికుంట: పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులతో పాటు, పారిశుధ్యం, పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమం చేపడుతున్నారని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో, జమ్మికుంట పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పట్టణ ప్రగతి దశాబ్ది వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. హుజూరాబాద్ పట్టణంలో పారిశుధ్య కార్మికులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది భారీ ర్యాలీ తీశారు. జమ్మికుంట గాంధీచౌక్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మానవహారం నిర్వహించి, పాత మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉత్తమ అధికారులు, పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్సీ ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలపై సీఎం కేసీఆర్, మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా దృష్టిసారించి, వేలాది కోట్లతో అభివృద్ధి పనులు, మౌళిక వసతులు కల్పించారన్నారు. ఈ సందర్భంగా ప్రగతి నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ దేశిని స్వప్నకోటి, తహసీల్దార్ రాజేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, పురపాలక సంఘ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ప్రత్యేక అధికారి శ్రీధర్, కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ కొలిపాక నిర్మల, ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ అధికారులు జోత్స్న, అశ్విని గాంధీ, కౌన్సిలర్లు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


రేపు వెరికోస్, ఫైల్స్‌కు మెగా వైద్య శిబిరం...



కరీంనగర్‌టౌన్: రెనే ఆస్పత్రి, మేవెన్ మెడికల్ సెంటర్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో వెరికోస్ వెన్స్, ఫైల్స్, ఫిస్టులా, ఫిషర్స్‌కు సంబంధించి ఉచితమెగా వైద్యశిబిరం ఈనెల 18న రెనే ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ బాలాజీ పటేల్ కోలా, ప్రముఖ సర్జన్ డాక్టర్ సంజయ్‌సింగ్ యాదవ్ తెలిపారు. శుక్రవారం రెనే ఆసుపత్రిలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మెగా వైద్య శిబిరంలో రూ.2వేల విలువైన అనోస్కోపీ రూ.3,500 కలర్ డాప్లర్ స్క్రీనింగ్ పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తిస్థాయి అత్యున్నత స్థాయి ప్రమాణాలతో, ఆధునిక పద్ధతులతో అతితక్కువ ఖర్చుతో వ్యాధులను నయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సెస్సీ బోర్డు నిర్వాకం

- రీవెరిఫికేషన్‌లో 10 జీపీఏ సాధించిన వైష్ణవి



శంకరపట్నం: ఎస్సెస్సీబోర్డు నిర్వాకంతో కేశవపట్నం జెడ్పీపాఠశాల విద్యార్థిని కొత్తపల్లి వైష్ణవికి 9.7 జీపీఏ వచ్చింది. దీంతో రీవెరిఫికేషన్ చేయించడంతో శుక్రవారం 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. కేశవపట్నం గ్రామానికి చెందిన వైష్ణవి తల్లి మరణించగా తండ్రి శ్రీనివాస్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ప్రైవేట్ స్కూల్ కాదని స్వగ్రామంలోని కేశవపట్నం జెడ్పీపాఠశాలలో చదివింది. చదువులో ముందుండే వైష్ణవి అన్ని సబ్జెక్ట్‌ల్లో 10 జీపీఏ సాధించగా సాంఘీకశాస్త్రంలో 55 మార్కులతో ఇటీవల విడుదలైన ఫలితాల్లో 9.7జీపీఏ సాధించినట్లు ఫలితాలు వెలువడ్డాయి. 75 మార్కులు పేపర్‌కు 55 మార్కులు రావడంతో తప్పులతడకగా ఎస్సెస్సీ బోర్డు మార్కులు వేసిందని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థిని సాంఘీకశాస్త్రం రీవేరిఫికేషన్ చేయించగా శుక్రవారం విడుదలైన ఫలితాల్లో 10 జీపీఏ సాధించినట్లు ఎస్సెస్సీ బోర్డు ప్రకటించింది. ఈ సందర్భంగా వైష్ణవిని హెచ్‌ఎం మమతాగౌతమి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తండ్రి శ్రీనివాస్ పాఠశాల సిబ్బంది, అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చొప్పదండి: పట్టణంలోని యూనియన్ బ్యాంకు సమీపంలోని గుర్రం మల్లారెడ్డి ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం మల్లారెడ్డి, స్వరూపరాణి దంపతులు ఈనెల 12న తీర్థయాత్రలకు వెళ్లారు. వారి కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రోజులాగే పనిమనిషి సుగణ ఇంటికి వచ్చి చూడగా శుక్రవారం తాళం పగులగొట్టి ఉండడం గమనించి మల్లారెడ్డి కుమారులకు సమాచారం అందించింది. వారు వచ్చిచూడగా అల్మారలో రూ.48వేలు నగదు, ఇతర చోట్ల దాచిన తులం పావు బంగారు ఆభరణాలు 15 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు మల్లారెడ్డి కుమారుడు ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్ర చారి తెలిపారు.

పల్లెలన్నీ పట్టణాలయ్యాయి

- పట్టణ ప్రగతితో పట్టణాల స్వరూపం మారింది
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



సెంట్రల్ లైటింగ్ పనులు పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతితో పాటు, నూతన మున్సిపల్ చట్టం, నూతన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటుతో రాష్ట్రంలో పట్టణీకరణ పెరుగుతోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ల నిర్మాణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించి పట్టణ ప్రగతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పట్టణ ప్రగతితో పట్టణాలు, నగరాల స్వరూపం మారిపోయిందన్నారు. అంతిమ సంస్కారాలకు రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.200 కోట్లు, ఇతర వనరుల నుంచి రూ.175 కోట్లు సమకూర్చామన్నారు. చెత్త నిర్వహణకు కంపోస్టింగ్ ప్లాంటులు, డీఆర్‌సీసీలు ఏర్పాటుచేశామన్నారు. ప్రజా మరుగుదొడ్లు నిర్మించామని, పారిశుధ్య సిబ్బంది సంఖ్య పెంచామని, జీతాలు కూడా పెంచామన్నారు. హరితహారంతో పట్టణాల్లో ప్లాంటేషన్ పెరిగిందన్నారు. అర్బన్ మిషన్‌లో వాటర్‌కనెక్షన్‌లు పెంచామన్నారు. తెలంగాణలో జాతీయస్థాయి అవార్డుల సంఖ్య పెరుగుతోందన్నారు. మున్సిపాలిటీకి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పాలకవర్గ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వైస్‌చైర్మన్ చీకట్ల రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అంబటి రజిత, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కరీంనగర్: జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీఫర్ తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలకు ఏఐవైఎఫ్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో పుట్టగొడుగుల్లా హోటళ్లు, బిర్యాని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని నిర్వాహకులు అడ్డగోలుగా ధరలు నిర్ణయించి భోజన ప్రియుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా లైసెన్స్ లేకుండా కుళ్లిన చికెన్, మటన్‌తో బిర్యానీలు వండి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. జిల్లాకేంద్రంలో జరిగిన పలు ఘటనలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఖాళీకుర్చీ మాత్రమే దర్శనమిస్తోందన్నారు. జిల్లా కేంద్రంలో కేవలం జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులతో ఫుడ్‌సేఫ్టీ అధికారి కార్యాలయం నిర్వహణ కొనసాగుతోందన్నారు. ఇకనైనా రెగ్యులర్ పోస్టును భర్తీచేసి సంబంధిత నిర్వాహకులకు అడ్డుకట్ట వేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సురేశ్, ప్రశాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా మార్చిన బీఆర్ఎస్

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



డాక్టర్ నగేశ్

హుజూరాబాద్: మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై, అప్పులపై, మంత్రుల ఆస్తులపై చర్చ జరపాలన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ దోపిడీకి గురైందని, ఒకరోజు ఆర్థిక దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే ప్రస్తుతం అప్పుల రాష్ట్రంగా మారిందని బీఆర్ఎస్ పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అప్పులతో ప్రభుత్వం నడుస్తోందని, జీతాలు ఇవ్వలేని దుస్థితి, బిల్లులు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక విధానాలు అమలుచేయడంలో విఫలమయ్యారన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా

కొత్తపల్లి: విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా విధించారు. రామగిరి మండలం బేగంపేటకు చెందిన గెటవేని అలియాస్ చిల్లవేణి కొమురయ్య, బసంతనగర్ మండల పాలకుర్తికి చెందిన గుడిన మురళి వారి ఇంటికి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారు. విద్యుత్‌శాఖ అధికారులు పట్టుకొని వారిపై కరీంనగర్ విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదుచేయగా మొదటి నేరం కింద కేసులు నమోదుచేసి రూ.1000 జరిమానా విధించారు. జరిమాన కట్టడంతో క్షమించి వదిలేశారు. ఈక్రమంలో మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వీరిద్దరిపై రెండో నేరం కింద కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించగా జిల్లా సెషన్ జడ్జి డి.హేమంత్‌కుమార్ రూ.18,445, రూ.19,348ల జరిమానా, మూడు నెలలు సాధారణ జైలుశిక్ష విధించినట్లు విజిలెన్స్ అధికారి కె.స్వామి తెలిపారు. సమావేశంలో సీఐ వెంట విజిలెన్స్ ఎస్సైలు నిరంజన్‌రెడ్డి, టి.నరేశ్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపా చట్టం కేసులు ఎత్తివేయాలి

- నిరంకుశ పాలన కొనసాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి
- సీపీఐ(ఎంఎల్)ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

కరీంనగర్: ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు 152 మందిపై ఉపా చట్టం కేసులు నమోదుచేయడం ఎంతవరకు సమంజసమని అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్,సంధ్య, విమలక్కతో పాటు 150 మందిపై అక్రమ కేసులు బనాయించడం దొరతనానికి నిదర్శనమన్నారు. ప్రజాపంథా నాయకులు జిందం ప్రసాద్, బత్తుల రాజు, అనిల్, మారుతి, కుమార్, నవీన్, హరీశ్, కుమార్, రవి, యుగేందర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

వేములవాడ రూరల్ : వేములవాడ మండలంలోని హన్మాజీపేటకు చెందిన సందెల ప్రసాద్ (32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు. ప్రసాద్ గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతోనే ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

మూడు ఆలయాల్లో దొంగతనం

కోనరావుపేట: మండలంలో ఎగ్లాస్‌పూర్, కోనరావుపేట, నిజామాబాద్‌లోని ఆలయాల్లో శుక్రవారం చోరీ జరిగింది. నిజామాబాద్ శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన కేబుళ్లను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టారు. ఆలయంలోని అమ్మవారి బంగారు కండ్లు, గంటలు, సీసీ కెమెరాల సామగ్రిని ఎత్తుకెళ్లారు. హుండీలోని డబ్బులను తీసుకొని పెద్దగుట్ట సమీపంలో పడేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నేనర్ల శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో, ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ ఆలయాల్లోనూ దొంగలు గంటలు ఎత్తుకెళ్లారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రవికుమార్

కరీంనగర్ క్రైం: కరీంనగర్ వన్ టౌన్ సీఐగా ఎం.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ సీఐగా పని చేసిన నటేశ్ జగిత్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రవికుమార్ హనుమకొండ జిల్లా హసన్‌పర్తి నుంచి బదిలీపై వచ్చారు.

రూరల్ సీఐకి శుభాకాంక్షలు


సీఐ ప్రదీప్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న హరీశ్‌గౌడ్

కరీంనగర్‌రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌కుమార్‌ను వైకే ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర హరీశ్‌గౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీసుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు


హారతి ఇస్తున్న అర్చకుడు

కరీంనగర్ కల్చరల్: కృత్తికా నక్షత్రం సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి వారికి విశేష పూజలు, అర్చనలు ఘనంగా జరిగాయి. భగత్‌నగర్ అంజనాద్రి అనంత సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫలపంచామృతాభిషేకం

విద్యానగర్: కరీంనగర్ మండలంలోని నగునూర్‌లో గల పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో శ్రీవల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామివార్లకు వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులున్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కేబుల్ బ్రిడ్జి పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 11 కేవీ ఎల్లమ్మ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, కోతిరాంపూర్, పోచమ్మవాడ, ఆంధ్రజ్యోతి ఆఫీస్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. తీగల వంతెన పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వరకాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఎన్జీవోస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్ ఏరియా, అంబేడ్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్, బస్టాండ్ ఏరియా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, తిరుమల్‌నగర్, రమేశ్‌నగర్, హనుమాన్‌నగర్, దోబివాడ, కమాన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. అలాగే 33/11 కేవీ ఉజ్వలపార్క్ సబ్‌స్టేషన్ ఏరియాలో అల్కాపురి, ఎన్టీఆర్ విగ్రహం ఏరియా, కోతిరాంపూర్, గణేశ్‌నగర్, కట్టరాంపూర్ ఏరియా, వినాయకనగర్, గౌతమినగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

మెడికల్ రికార్డులు వెతికేందుకు ఇబ్బందులు


కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి


ఇరుకు గదిలో మెడికల్ రికార్డులు

- జనన, మరణ, మెడికో లీగల్ రికార్డులు ఇరుకు గదుల్లో నిర్వహణ
- రెగ్యులర్ గదిలో ఐదేళ్లవి మాత్రమే అందుబాటులో..
- అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు
- కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో దుస్థితి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అత్యంత కీలకమైన రికార్డులు భద్రపరిచేందుకు స్థలం కరువైంది. రికార్డులన్నింటినీ ఒక గదిలో కాకుండా మూడు ఇరుకు గదుల్లో ఉంచుతుండటంతో అత్యవసర పరిస్థితుల్లో వెతికేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనన, మరణ, పేషెంట్లకు సంబంధించిన కేస్ షీట్లవి సుమారు 15 ఏళ్లకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచాలి. అయితే ఇవి అవసరమైనప్పుడు వెతికి, బాధితులకు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఐదేళ్లకు సంబంధించిన రికార్డులు మాత్రమే రెగ్యులర్‌గా ఉపయోగించే గదిలో ఉంచుతున్నారు. మిగతావి కావాలంటే రోజుల తరబడి వెతకాల్సిందే.

జనన, మరణాలవే అత్యధికం..

కరీంనగర్ కేంద్రంగా ప్రధాన రహదారులు ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాద మృతులకు తోడు, ఆత్మహత్యలు, హత్యలు, అనుమానాస్పద, సహజ మరణాలు సైతం ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రతీ మరణానికి సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా భద్రపరచాల్సి ఉంటుంది. ప్రతీ నెలలో కనీసం 150కి పైగా మరణాలకు సంబంధించిన రికార్డులు ఉంటాయి. వీటికితోడు మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో గర్భిణులు చాలామంది ఇక్కడికే ప్రసవాల కోసం వస్తున్నారు. నెలకు సుమారు 700 నుంచి 800 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. సంబంధిత రికార్డులను భద్రపరచాల్సి ఉంటుంది.

సిబ్బంది కొరత.. నిర్వహణ భారం

జనన, మరణాలకు సంబంధించి ఎవరికైనా రికార్డులు అవసరమై వచ్చినప్పుడు ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా అనుమానాస్పద మరణాలపై కోర్టు కేసులు అయినప్పుడు పోలీసులుకు, కోర్టులకు సమర్పించాలి. రికార్డు గదికి ఒక ఉద్యోగి, ఒక అసిస్టెంట్ మాత్రమే ఉండటంతో మూడు గదుల్లో రికార్డుల నిర్వహణ తలకు మించిన భారంగా మారుతోంది. పెద్ద గదిని కేటాయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఒకేచోటుకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నాం..



ఆస్పత్రికి సంబంధించిన జనన, మరణ, మెడికో లీగల్‌కు సంబంధించిన రికార్డులను వేర్వేరు గదుల్లో కాకుండా ఒకేచోటుకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకు అనువైన గదిని ఏర్పాటు చేసి, త్వరలోనే రికార్డులన్నీ మార్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కృష్ణప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఎస్‌యూలో ఫిజికల్ టెస్ట్‌లు ప్రారంభం


ఫిజికల్ టెస్ట్ ప్రారంభిస్తున్న వీసీ మల్లేశం

కరీంనగర్ సిటీ: తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023లో భాగంగా డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్షలను శుక్రవారం శాతవాహన యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ఆచార్య మల్లేశం ప్రారంభించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 నిర్వహించే బాధ్యతను ఎస్‌యూకు అప్పగించిన విషయం విదితమే. పరీక్షలను ప్రారంభించిన అనంతరం వీసీ మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో మొదటిసారి ఇలాంటి పరీక్షలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో వర్సిటీ న్యాక్ గ్రేడ్ పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సహకారంతో ఈ పరీక్షలు విజయవంతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 వరకు పరీక్షలు జరుగుతాయని, సుమారు 3 వేల మంది అభ్యర్థులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

మొదటిరోజు 400 మంది..

బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, లాన్‌టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, 100, 800 మీటర్స్ రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్ అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని వీసీ మల్లేశం పేర్కొన్నారు. మొదటిరోజు 400 మంది అభ్యర్థులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు రాష్ట్రంలోని వివిధ వ్యాయామ విద్య కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 పరీక్షల కన్వీనర్ ఆచార్య రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణం అన్ని విధాలుగా సౌకర్యంగా ఉందని, భవిష్యత్‌లో మరిన్ని పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పురుష అభ్యర్థులకు ఈ నెల 16 నుంచి 19 వరకు, మహిళా అభ్యర్థులకు 20 నుంచి 22 వరకు ఎంట్రన్స్ టెస్ట్‌లు జరుపుతామని చెప్పారు. ఈ పరీక్షలకు ఆచార్య డిప్లా, ఆచార్య జగన్, ఆచార్య సురేశ్‌రెడ్డి, ఆచార్య ఇబ్రహీం, ఆచార్య ఇమ్మాన్యుయేల్‌లు పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, వన్నాల రమేశ్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ నమీముద్దీన్ మునావర్, పీడీ విజయకుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, కరీంనగర్ ప్రభుత్వ మహిళా కళాశాల పీడీ శ్రీధర్‌రావు, పీడీ హరిరాం, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు, సిల్ట్ తొలగింపు



కోళ్ల వ్యర్థాలను, డ్రైనేజీలోని సిల్ట్‌ను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారిలో కోళ్ల వ్యర్థాలను బొమ్మకల్ పంచాయతీ సిబ్బంది తొలగించగా దుర్శేడ్‌లో మురికి కాలువలను శుభ్రం చేశారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'చనిపోయిన కోళ్లతో దుర్వాసన', 'ఇదేనా పల్లె ప్రగతి' శీర్షికలతో ప్రచురితమైన కథనాలకు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. కోళ్ల వ్యర్థాలను తొలగించాలని, మురికి కాలువల్లో సిల్ట్ తీయాలని బొమ్మకల్, దుర్శేడ్ పంచాయతీ కార్యదర్శులు హిదయతుల్లా, సంజీవ్‌రెడ్డిలను ఆదేశించారు. వారు పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకున్నారు.

ఘనంగా తెలంగాణ దశాబ్ది వేడుకలు


బతుకమ్మ, బోనాలతో బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కరీంనగర్: తెలంగాణ దశాబ్ది వేడుకలను కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ ఆధ్వర్యంలో బతుకమ్మలు పేర్చి, బోనాలు తీశారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య హాజరై, మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న బీసీలకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదన్నారు. ఇకనైనా బీసీల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వారాల జ్యోతి, కార్యదర్శి ఎ.ఆనంద్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజ రాకేశ్, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మదాసు సంజీవ్, ఉపాధ్యక్షుడు మంతెన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పట్టణ ప్రగతి దినోత్సవం


మానవహారంగా ఏర్పడిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

కొత్తపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తపల్లి మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో మహిళలు రంగవల్లులు వేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు జాతీయ జెండా ఎగురవేశారు. డంపింగ్‌యార్డు వద్ద డీఆర్‌సీసీ షెడ్డును ప్రారంభించారు. విద్యార్థులు, మహిళలు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టి, స్థానిక అంగడి బజార్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సఫాయి సిబ్బందిని సన్మానించారు. రంగవల్లుల పోటీల్లో గెలిచిన వారికి మున్సిపల్ చైర్మన్ బహుమతి అందజేశారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, మెప్మా సిబ్బందికి తెలంగాణ ఉత్తమ సేవా పురస్కార్ సర్టిఫికెట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా దశాబ్ది ఉత్సవాలను ప్రజలు రాష్ట్రమంతటా చాలా సంతోషంగా జరుపుకుంటున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, స్పెషల్ ఆఫీసర్ దేవేందర్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, అంజలి, మనుపటి వేణుగోపాల్, గుణాల విజయ, నాజియా, గండు రాంబాబు, చింతల సత్యనారాయణ రెడ్డి, వేముల కవిత, కో–ఆప్షన్ సభ్యులు ఎండి.ఫక్రుద్దీన్, శెట్టిపల్లి ప్రభాకర్, కట్ల మమత, నాయకులు బండ గోపాల్‌రెడ్డి, జేరిపోతుల శ్రీకాంత్, స్వర్గం నరసయ్య, వేముల శేఖర్, గుణాల రమేశ్, కట్ల సుధాకర్, ఎస్కే. బాబా తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలో చేపట్టిన ఇంటింటి ఓటరు సర్వేను శుక్రవారం ఆర్డీవో ఆనంద్‌కుమార్ తనిఖీ చేశారు. ఓటర్ల వివరాలు, సర్వే తీరును బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. బోగస్ ఓట్లను తొలగించాలని సూచించారు. తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ అఫ్రా తదితరులున్నారు.

జాబ్ మేళాకు స్పందన

- 120 మందికి పైగా అభ్యర్థుల హాజరు
- 20 మంది ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 20 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, టీఎస్‌కేసీ, రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్వశక్తితో ఎదిగి, తమ ఉపాధి అవకాశాలు తాము సృష్టించుకోవాలని చెప్పారు. తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ సీహెచ్.మారుతి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడొద్దన్నారు. ప్రైవేట్ రంగంలోనూ చాలా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో ఉద్యోగం సాధించాలంటే కమ్యూనికేషన్, లీడర్‌షిప్, పర్సనాలిటీ స్కిల్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 120 మంది పైగా మంది అభ్యర్థులు హాజరవ్వగా ఇంటర్వ్యూలో 20 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రొడక్షన్ మేనేజర్ అచ్యుత్, హెచ్‌ఆర్ మేనేజర్, టీఎస్‌కేసీ మెంటార్ డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకూ రూ.లక్ష ఇవ్వాలి


మాట్లాడుతున్న సదానందచారి

విద్యానగర్: కులవృత్తుల వారికి ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్ష ఆర్థికసాయాన్ని విశ్వబ్రాహ్మణులకూ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సంఘాల అభివృద్ధి సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు తొవిటి సదానందచారి డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2018లో బీసీ కులాలకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఇప్పటివరకు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుతం ఇస్తున్న లక్ష రూపాయల ఆర్థికసాయంలో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాసుల కిరణ్‌కుమార్, కోశాధికారి కట్ట వెంకటాచారి, ఉపాధ్యక్షులు వెలిచాల రమేశ్ కట్ట భాస్కరాచారి, కందుకూరి శ్రీనివాస్ కార్యవర్గసభ్యులు చంద్రగిరి వేణు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, వార్డుసభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో ఎంపీ ల్యాడ్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గతేడాది వానాకాలంలో డ్రైనేజీ లేకపోవడంతో నీళ్లన్నీ ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన నిధులు మంజూరు చేశారు. రాచమల్ల రమేశ్ ఇంటి నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వరకు సైడ్ డ్రైనేజీని నిర్మించనున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, వార్డుసభ్యులు దాసరి శ్రవణ్‌రెడ్డి, నరేశ్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సత్యనారాయణ, ఆకుల పద్మ, సతీశ్, రమేశ్, తిరుపతిరెడ్డి, నవీన్‌రెడ్డి, శంకరయ్య, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వింధ్యావాలీ' సిల్వర్ జూబ్లీ


వేడుకలను ప్రారంభించిన సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు

సప్తగిరికాలనీ: కరీంనగర్ మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను శుక్రవారం సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. వింధ్యావాలీ యాజమాన్యం 25 ఏళ్లుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తోందని అభినందించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. 1999లో పాఠశాలను ప్రారంభించామని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి సాగర్, పాఠశాల వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫామ్స్

- 20న విద్యాదినోత్సవం రోజు పంపిణీకి ఏర్పాట్లు
- కరీంనగర్ నియోజకవర్గంలో 15,597 మంది విద్యార్థులు


దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలకు ఆటోలో వచ్చిన యూనిఫామ్స్

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యాదినోత్సవం రోజు పిల్లలకు యూనిఫామ్స్ అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు రెండు రోజులుగా కరీంనగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు స్టాక్‌ను ఎమ్మార్సీ కార్యాలయం నుంచి చేరవేస్తున్నారు.

127 పాఠశాలలు..

కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి మండలాల్లో మొత్తం 127 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 15,597 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ప్రభుత్వం ఏటా రెండు జతల యూనిఫామ్స్ ఇస్తోంది. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బాలురకు రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు, 8వ తరగతి నుంచి 10వ తరగతి చదివే బాలురకు రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలు, బాలికలకు రెండు జతల చొక్కాలు, స్కర్ట్‌లు అందిస్తారు. మొదట ఈ నెల 12న పాఠశాలల పునఃప్రారంభం రోజే యూనిఫామ్స్ పంపిణీ చేయాలని నిర్ణయించారు. కానీ విద్యాదినోత్సవం రోజు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు 16,948 యూనిఫామ్స్ సిద్ధంగా ఉన్నాయి. వీటిలో కరీంనగర్ రూరల్‌కు 2,854, కరీంనగర్ అర్బన్‌కు 9,807, కొత్తపల్లి మండలానికి 4,287 యూనిఫామ్స్ కేటాయించారు.

ఒక్కొక్కరికి రెండు జతలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యాదినోత్సవం రోజు విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేస్తాం. ఒక్కొక్కరికి రెండు జతలు ఇస్తాం. ఆయా పాఠశాలల విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫామ్స్ స్టాక్‌ను దశలవారీగా పంపిస్తున్నాం.

– ఎం.మధుసూదనాచారి, ఎంఈవో

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎస్‌బీఐ వెంకటేశ్వర్లు

కరీంనగర్‌క్రైం: సమస్యల తీవ్రతను పరిగణలోకి తీసుకుని ఫిర్యాదులు సత్వరం పరిష్కారం అయ్యేలా పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక పర్యవేక్షణ అధికారి ఏసీపీ పి.కాశయ్య, ఆ విభాగం ఇన్‌చార్జి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం కమిషనరేట్ కేంద్రం ఏవోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులు ఎస్‌హెచ్‌ఓలతో సమానమైన విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో లేకున్నా.. దృష్టికి వచ్చిన సమస్యలు, ఫిర్యాదులను స్వీకరిస్తూ వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 5ఎస్ కార్యక్రమం అమలుతీరును ప్రతిరోజు పర్యవేక్షించాలని సూచించారు.

క్లుప్తంగా...

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ కోటా విడుదల

తిరుమల: టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను ఈ నెల 19న విడుదల చేయనుంది. భక్తులు https:// tirupatibalaji. ap. gov. in వెబ్‌సైట్‌లో వీటిని బుక్ చేసుకోవచ్చు. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం ఉంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవ వర్చువల్ సేవల కోటాను, వాటికి సంబంధించిన దర్శన టికెట్ల కోటాను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

హక్కుల ఉద్యమ నేత కుక్కల ఏసు కన్నుమూత



లబ్బీపేట (విజయవాడ తూర్పు): పేదల సమస్యలపై నిరంతరం ఉద్యమించిన హక్కుల ఉద్యమ నేత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి(ఓపీడీఆర్) ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) నేత కుక్కల ఏసు (75) మరణించారు. విజయవాడ 24వ డివిజన్‌లో న్యూ గిరిపురంలో నివసించే ఏసు వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన భార్య 20 ఏళ్ల కిందటే మరణించగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏసు ఎయిడెడ్ కళాశాలలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తూనే సీపీఐ (ఎంఎల్), ఓపీడీఆర్‌లో చురుగ్గా వ్యవహరించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 14 పేటలకు సంబంధించి స్మశాన వాటిక ఆక్రమణలకు గురికాగా, దానికోసం వీరోచితంగా ఉద్యమం నడిపారు. ఈ విషయంలో అనేక పర్యాయాలు అరెస్ట్ కూడా అయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మశాన వాటికను సాధించగలిగారు.



కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన సభకు భారీగా హాజరైన జన సందోహంలో ఓ భాగం

ఇళ్ల యజ్ఞం

ఊళ్లకు ఊళ్లే నిర్మాణం

నాలుగేళ్లుగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు

గుడివాడలో టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమంలో సీఎం జగన్

దేవుడి దయతో, మీ అందరి ఆశీర్వాదంతో మనం అధికారంలోకి రాగానే 300 అడుగుల టిడ్కో ఇళ్లను కేవలం ఒక్క రూపాయికే ఇస్తామని గతంలో ఇదే గుడివాడ బహిరంగ సభలో చెప్పాను. ఈ రోజు ఆ మాటను నిజం చేసి చూపిస్తున్నా. ఇవిగో ఆ ఇళ్లు.. ఇవిగో ఆ ఊళ్లు. టిడ్కో ఇళ్ల ద్వారా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మన ప్రభుత్వం రూ.16,601 కోట్లు లబ్ధి చేకూర్చుతూ ఖర్చు భరిస్తోంది. ఇందులో చంద్రబాబు చేసింది ఏమిటి? గుమాస్తాగిరీ కూడా సరిగా చేయలేదు. నిస్సిగ్గుగా తాను చేయని పనులు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. నోరు విప్పితే అబద్ధాలే.

– సీఎం వైఎస్ జగన్



ఇంటి హక్కు పత్రాలను అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఏపీలో ఇళ్ల నిర్మాణ యజ్ఞం కొనసాగుతోందని, ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 77 ఎకరాల ఒకే లేఅవుట్‌లో పూర్తయిన 8,912 టిడ్కో ఇళ్లను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొని, ఇంటి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకంగా 30.60 లక్షల ఇంటి పట్టాలు అందజేశామని, ఇళ్లు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పేదలను అప్పులపాలు చేయాలని చూస్తే, మనందరి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేశామని చెప్పారు. అక్కచెల్లెమ్మలు హక్కుదారులుగా ఆయా కుటుంబాల చరిత్రను మార్చేలా ఇవాళ మనం ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నామని చూపించే గొప్ప కార్యక్రమం గుడివాడలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొత్త గుడివాడ కనిపిస్తోంది

- ఒకవైపు టిడ్కో ఇళ్లు.. మరోవైపు మనం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు చూస్తుంటే.. ఇక్కడ కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. మొత్తం 257 ఎకరాల్లో రూ.800 కోట్లతో 8,912 ఇళ్లు కట్టడమే కాకుండా.. వాటిని నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చే కార్యక్రమం ఇవాళ చేస్తున్నాం. ఇదే లేఅవుట్‌లో 7,728 ఇళ్ల స్థలాలను ఇళ్లు లేని నా నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. మొత్తంగా 16,640 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండబోతున్నాయి.
- ఈ లేఅవుట్‌తో పాటు నియోజకవర్గం మొత్తం 13,145 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వీటికి 8,912 టిడ్కో ఇళ్లు కూడా కలిపితే 22 వేల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చామని చెబుతున్నా.
- ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో కడుతున్నాం. అక్కడ డ్రైయిన్లు, రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఇంటి నిర్మాణం పూర్తయితే కనీసం రూ.10–15 లక్షలు వాళ్ల చేతుల్లో పెట్టినట్టవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 30.60 లక్షల ఇళ్లు కూడా చూసుకుంటే మహాయజ్ఞం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తిని అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నాం.
- ఇవాళ ఇచ్చిన పట్టాలకు సంబంధించి 4,200 ఇళ్లు మంజూరైతే మొత్తం 13,145 ఇళ్ల పట్టాలలో కూడా ఇళ్లు వస్తాయి. జూలై 8.. నాన్న గారి జయంతి రోజున ఈ ఇళ్లు కూడా మంజూరు చేస్తాం.

టిడ్కో ఇళ్ల పేరుతో నాడు పేదలపై భారం

- ఈ రాష్ట్రంలో కొంతమందికి ఈర్ష్య, ద్వేషం ఎక్కువయ్యాయి. ఏ మాత్రం కళ్లార్పకుండా అబద్ధాలు చెబుతున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన నిర్వాకమిది. నిరుపేదలు నివాసం ఉండే 300 చదరపు అడుగుల ఫ్లాట్ కట్టడానికి అయ్యే ఖర్చు అడుగుకు రూ.2 వేలు చొప్పున ఒక్కో ఫ్లాట్‌కు దాదాపు రూ.5.75 లక్షలు, మౌలిక సదుపాయాలకు మరో రూ.లక్ష అవుతుంది. రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఒక్కో ఫ్లాట్‌కు కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే రాష్ట్రం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన రూ.3 లక్షలు చంద్రబాబు హయాంలో పేద వాడి పేరు మీద అప్పుగా రాశారు. ప్రతి నెలా రూ.3 వేలు 20 ఏళ్ల పాటు పేదవాడు కడుతూపోవాలి.
- మీ బిడ్డ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 300 చదరపు అడుగులలో నిర్మిస్తున్న 1,43,600 టిడ్కో ఇళ్లను అన్ని హక్కులతో ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నాం. రూ.6.75 లక్షలయ్యే ఒక్కో ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో ఇస్తున్నాం.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

- నాలుగేళ్లలో మన ప్రభుత్వం ఇన్ని లక్షల ఇళ్లు ఎలా కట్టగలిగింది? 30 లక్షల ఇళ్ల స్థలాలు ఎలా ఇవ్వగలిగింది? ఇదే పని 30 ఏళ్ల క్రితమే సీఎం అయిన చంద్రబాబు, మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న ఈ బాబు, 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా ఎందుకు చేయలేకపోయారు? కారణం చంద్రబాబు పేదల వ్యతిరేకి కాబట్టి చేయలేదు.
- 40 ఏళ్ల రాజకీయ జీవితం తర్వాత కూడా ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేని చంద్రబాబుకు రెండు పక్కలా రెండు పార్టీలు ఉంటే తప్ప లేచి నిలబడలేని పరిస్థితి. ఇలాంటి ఈ చంద్రబాబు.. 175 నియోజకవర్గాల్లో 175 మంది అభ్యర్థులను కూడా పెట్టలేని ఈ చంద్రబాబు మనకు ప్రత్యర్థి అట! రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్ల తర్వాత కూడా తాను చంద్రబాబు కోసమే పుట్టానంటున్నట్లు ప్రవర్తిస్తున్న ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు మరో వంక. తన జీవితమే బాబు కోసమని, తన వ్యాన్‌ను చూసి మురిసిపోతూ, ఇక తాను కూడా ఎమ్మెల్యే అవుతానని, తనను ఎవరు ఆపుతారో చూస్తానంటున్నారు. వీరికితోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. మొత్తంగా గజ దొంగల ముఠా మళ్లీ రాష్ట్రాన్ని దోచుకోవాలని ప్రజల ముందుకు వస్తోంది. మీరంతా ఈ దుష్టచతుష్టయం అబద్ధాలను నమ్మకండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మారండి.

సీఎం కావడానికి నేను సిద్ధమే

- 14 ఏళ్ల వనవాసం పూర్తయ్యింది
- సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇవ్వండి
- వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్



పిఠాపురంలో పవన్ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సీఎం కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. తన 14 సంవత్సరాల వనవాసం పూర్తయిందని, ఈ సారి అంతా జనసేన వైపు చూడండని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. తనకు సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇస్తే దేశంలో ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏ పదవీ లేకున్నా ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నానని చెప్పుకొచ్చారు. నాడు తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఉంటే ఈ రోజు ఇలా ఉండేది కాదన్నారు. శక్తిపీఠం సాక్షిగా చెబుతున్నానని, ఆంధ్రా వీడి వెళ్లనని, సురక్ష ఆంధ్రాగా తీర్చిదిద్దుతానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దుష్ట ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. జనసేన అధికారంలోకి వస్తే మొదటగా రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిలో పెడుతుందన్నారు. రాష్ట్రంలో 219 హిందూ ఆలయాను కూల్చివేస్తే ఈ ముఖ్యమంత్రి, ఈ ప్రభుత్వం ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. హిందువులు ప్రపంచంలో మైనార్టీలన్నారు. తవ్వేకొద్దీ వైఎస్సార్‌సీపీ అవినీతి బయటపడుతుందని అన్నారు. తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ నిధులను అడ్డగోలుగా దోచేస్తున్నారని విమర్శించారు. మన కులపోడు అని చూడకూడదని, ఆంధ్రా బాగుపడాలంటే సరైనోడు కావాలి అనుకోండి అని అన్నారు.

ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఉందా పవన్?

- సీఎం అవ్వాలనుకుంటున్నావా? లేదా?
- సగం స్థానాల్లోనైనా అభ్యర్థులను నిలబెడతావా? సింగిల్ పోటీ చేస్తావా?
- మంత్రి అంబటి రాంబాబు సూటి ప్రశ్నలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఎన్నికల్లో పోటీపై జనసేన నేత పవన్ కల్యాణ్‌కు స్పష్టత ఉందా అని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. '175 స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందా? సగం స్థానాల్లోనైనా బరిలోకి దిగుతారా? సింగిల్‌గా పోటీ చేస్తావా' అన్న క్లారిటీ పవన్ ఇవ్వాలని అన్నారు. మంత్రి రాంబాబు శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి హీరో అనిపించుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అయితే.. పవన్ కామెడీ యాక్టర్ అయ్యాడని విమర్శించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టిన పవన్ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎవరిని ప్రశ్నించారని దుయ్యబట్టారు. మంచి పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని ప్రశ్నించేందుకే పార్టీ నడుపుతున్నారని అన్నారు. పవన్ గతంలో పొత్తులన్నారని, ఇప్పుడేమో లేదంటున్నారని, పర్యటనకో మాట మారుస్తున్నారని చెప్పారు. సీఎం అభ్యర్థి ఆయన కాదని చెప్పిన పవన్.. 2024, 2029 ఎన్నికల్లో గెలిపించాలని చెప్పడం ఆయన చంచల మనస్తత్వానికి నిదర్శనమన్నారు. కేవలం అసెంబ్లీలో అడుగు పెట్టేందుకే రాజకీయం చేస్తున్నారా? ఆయనకు సీఎం అవ్వాలని ఉందా? లేదా? చంద్రబాబును సీఎం చేసేందుకు యాత్రలు చేస్తున్నారా సూటిగా చెప్పాలని అన్నారు. ఎక్కడ నిలబడతాడో కూడా తెలియని వ్యక్తితో జన సైనికులు, వీర మహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏ విషయంలోనూ స్పష్టత లేని పవన్‌తో సావాసం కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లేనన్నారు. పవన్ రాజకీయాలకు పనికిరాడని స్పష్టంగా చెప్పారు. చిరంజీవి పార్టీ పెట్టి 18 సీట్లు గెలిచారని, రాజకీయాల్లో నిలబడలేనని నిశ్చయించి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాలించాలనుకున్న పార్టీ అధినేత ఎక్కడైనా చెప్పులు చూపిస్తారా అని ప్రశ్నించారు. పవన్, చంద్రబాబు, బీజేపీ కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. పవన్, చంద్రబాబువి ఉడత ఊపులేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం అమలు చేసిన జగన్ పక్షానే పేదలు ఉన్నారని తెలిపారు.

ఓటును నోటుకు అమ్ముకోవద్దు



బెజ్జూర్‌లో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కుమురంభీం జిల్లా బెజ్జూర్‌లో రోడ్ షో

బెజ్జూర్(సిర్పూర్): ప్రజలు ఓటును నోటుకు అమ్ముకోవద్దని.. ఓటే మనకు వజ్రాయుధం లాంటిదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలంలో 'ఓటు మీదే.. నోటు మీదే' అనే నినాదంతో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బెజ్జూర్‌లో రోడ్ షో నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీఎస్పీ అధికారంలోకి వస్తే రూ.5వేల పింఛన్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సిర్పూర్ నియోజకవర్గంలో అన్యాయం, అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. డబ్బా గ్రామంలో సర్పంచ్ కుమారుడిపై గ్రామస్తులు కేసు పెట్టినా ఇప్పటివరకు అరెస్టు చేయలేదని, అదే అమాయకులు ఎవరైనా తప్పు చేస్తే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఒక్క బస్టాండ్ సక్రమంగా లేదన్నారు. ప్రజలు కోరుకుంటే పార్టీ హైకమాండ్ నిర్ణయం మేరకు మీ మధ్యకే వస్తానని తెలిపారు. ప్రాణహిత ప్రాజెక్టును తరలించి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేశారని, కమీషన్ల కోసం కల్వకుంట్ల కుటుంబం ఏదైనా చేస్తుందని మండిపడ్డారు. నేను గెలిచిన తర్వాత ఇక్కడున్న ప్రతీఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గణపతి, జిల్లా అధ్యక్షుడు గణేశ్, మండల అధ్యక్షుడు సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నాయకులు చిన్నయ్య, ఇస్తారి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే మాట విని నిందితులపై చర్యలు తీసుకోవడం లేదు'

చింతలమానెపల్లి(సిర్పూర్): సిర్పూర్ నియోజకవర్గంలో పోలీసులు.. ఎమ్మెల్యే మాట విని నిందితులపై చర్యలు తీసుకోవడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో శుక్రవారం ఆదివాసీలతో మాట్లాడారు. గ్రామంలోని ఆదివాసీల మనోభావాలు కించపరిచే విధంగా వ్యవహరించిన డబ్బా సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని తప్పు పట్టారు. అబ్దుల్ రషీద్ ఆదివాసీవర్గానికి చెందిన ఒంటరి మహిళను లోబర్చుకునే ప్రయత్నం చేయగా.. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారని పేర్కొన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కాగజ్‌నగర్ డీఎస్పీతో మాట్లాడినట్లు వివరించారు. ఆదివాసీ నాయకులు కుంరం నారాయణ, నాయకులు ఉన్నారు.

'ఓపెన్' టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్‌అర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత, కుమురంభీం డీఈవో అశోక్‌కుమార్, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతిలో 934 మందికి 463 మంది ఉత్తీర్ణత సాధించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 489 మందికి 257 మంది ఉత్తీర్ణులయ్యారు. మంచిర్యాల జిల్లాలో 624 మంది విద్యార్థులకు 529 మంది పాసయ్యారు. నిర్మల్ జిల్లాలో 736 మందికిగాను 539 మంది పాసయ్యారు. ఇంటర్‌లో ఆదిలాబాద్ జిల్లాలో 499 మందికిగాను 215 మంది పాసయ్యారు. కుమురంభీంలో 394 మందికి గాను 181మంది పాసయ్యారు. మంచిర్యాలలో 1,335 మందికిగాను 925 మంది పాసయ్యారు. 69.29 నిర్మల్ జిల్లాలో 515 మందికి గాను 289 మంది పాసయ్యారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. మార్కుల మెమోలు అధ్యయన కేంద్రానికి వస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి రీకౌంటింగ్ కోసం పేపర్‌కు రూ.350, ఇంటర్‌కు రూ.400, రీవెరిఫికేషన్‌కు పది, ఇంటర్ అభ్యర్థులు రూ.1,200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

పారిశుధ్య కార్మికురాలికి రాష్ట్రస్థాయి అవార్డు



కల్పనకు అవార్డు అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తానూరు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా తానూరు మండల కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు వాగ్మారే కల్పనకు రాష్ట్రస్థాయి అవార్డు లభించినట్లు ఎంపీవో మోహన్ సింగ్ తెలిపారు. తానూరు గ్రామపంచాయతీలో కల్పన పారిశుధ్య కార్మికురాలిగా ఉత్తమ సేవలందిస్తోంది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కల్పనకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి జలాంసింగ్ తదితరులున్నారు.

ఆగని ఇసుకాసురులు..!

- ఎస్పీ హెచ్చరికలు పట్టించుకోకుండా ఇసుక దందా
- ఇష్టానుసారంగా గోదావరిని తోడేస్తున్న వ్యాపారులు
- మన ఊరు .. మన బడి పేరుతో తవ్వేస్తున్న వైనం
- పోలీసు, రెవెన్యూ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు
- సివిల్ పనుల పేరిట యథేచ్ఛగా సాగుతున్న తరలింపు



గోదావరి నదిలో కొనసాగుతున్న ఇసుక తరలింపు

సాక్షి ప్రతినిధి,కరీంనగర్/జగిత్యాలక్రైం: అక్రమ ఇసుక దందాపై ఇటీవల జగిత్యాల ఎస్పీ ఎగ్గిడి భాస్కర్ ఇచ్చిన హెచ్చరికలు ఇసుకాసురులకు చెవికెక్కలేదు. పోలీసుల ఆదేశాలు ఏ మాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా తమపని తాము చేసుకుపోతున్నారు. చిన్న కారణాలు చూపించి పరిమితికి మించి ఇసుక తోడేస్తున్నారు. మృగశిర కార్తె ప్రవేశించినా.. వేసవి కొనసాగుతుండటం, ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్లు తగ్గడంతో ధర్మపురి చుట్టుపక్కల ప్రాంతాల్లోని గోదావరి నది పరీవాహక ప్రాంతం నుంచి భారీ ఎత్తున ఇసుక తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాను నియంత్రించాల్సిన చర్యలకు దిగకపోవడంతో ఇసుక దోపిడీకి అడ్డులేకుండాపోయింది. వివరణ అడిగితే.. చిన్నపాటి అనుమతులు ఉన్నాయని సర్ది చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. చిన్నసివిల్ పనులకు వందలాది, వేలాది ట్రాక్టర్ల ఇసుక ఎలా అవసరం అవుతుంది? అన్న ప్రశ్నలకు మాత్రం వారివద్ద సంతృప్తికర సమాధానాలు ఉండకపోవడం గమనార్హం.

భారీఎత్తున తరలింపు

ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ధర్మపురి ఎగువ ప్రాంతంలో పూర్తిగా నీరుతగ్గిపోయింది. దీంతో భారీగా ఇసుక మేటలను అక్రమ రవాణాదారులు గుర్తించారు. గతంలోలాగా గప్‌చిప్‌గా కాకుండా..ఏకంగా ఇసుక మేటల వరకు రహదారి నిర్మించి ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. రోజుకు వందలాది ట్రాక్టర్ల ఇసుకను ఒడ్డుకు చేర్చుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ధర్మపురి, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్ ప్రాంతాల నుంచి భారీగా ఇసుక తరలిస్తూ యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. అలా తరలించిన ఇసుకను ఒడ్డుకు తరలించి భారీ ఎత్తున డంపింగ్ చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నా ఇటు మైనింగ్, అటు రెవెన్యూ అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదు.

అధికారుల నిర్లక్ష్యం

ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ కొరడా ఝుళిపించాల్సి ఉన్నా.. అలాంటి పరిస్థితులు ఇక్కడ కనిపించడం లేదు. స్థానికంగా కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ధర్మపురి గోదావరి నుంచి భారీగా ఇసుక అక్రమంగా తరలిస్తుండటమే దీనివెనుక అసలు కారణం. వీరి వెనుక కూడా బలమైన పెద్దనాయకులు ఉండటంతో ఇసుకాసురుల దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండాపోయింది. ఇసుక తరలింపుపై ఎలాంటి ఫిర్యాదులు ఇంతవరకూ పరిష్కారానికి నోచుకోలేదంటే అధికారులపై ఎంతటి రాజకీయ ఒత్తిడి ఉందో అర్థమవుతుంది. అందుకే, ఇసుక తరలింపు ఆపాలంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. వారు చర్యలు తీసుకుంటామంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారే తప్ప.. అడ్డుకునే యత్నం చేయడం లేదు.

మన ఊరు.. మన బడి కోసమట

ధర్మపురి పరీవాహక ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై అధికారులు విచిత్రమైన వివరణలు ఇస్తున్నారు. ప్రస్తుతం ధర్మపురి మండలంలో జరుగుతున్న మన ఊరు .. మన బడిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే సివిల్ పనుల కోసం ఇసుక తీసుకు వెళ్తున్నారని ప్రచారం చేస్తున్నారు. అయితే, మండలంలోని పాఠశాలల్లో కొన్ని చిన్న నిర్మాణాలు, మరమ్మతులే సాగుతున్నాయి. వాటికోసం వేలాది ట్రాక్టర్లతో ఇసుక తరలించాల్సిన అవసరం లేదు. కానీ, అధికారులు ఇదే మంత్రాన్ని వల్లె వేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న సివిల్ వర్కుల పేరిట ఎంత ఇసుక తోడుతున్నారన్నదానికి లెక్కాపత్రం లేకుండా పోతోంది. స్థానికులు చెబుతున్న ప్రకారం.. గోదావరి నది నుంచి రాత్రీపగలు తేడా లేకుండా రోజుకు 1,500 నుంచి 2,000 ట్రాక్టర్ల వరకు ఇసుక తరలిస్తున్నారు.

చర్యలు చేపడతాం

ధర్మపురి గోదావరి నది నుంచి మన ఊరు.. మన బడి కింద చేపట్టిన పనులకు స్థానిక తహసీల్దార్ నుంచి అనుమతులు తీసుకుని ఇసుక కొన్నిచోట్ల నుంచి తరలిస్తున్నారు. ధర్మపురి సమీప నది పరీవాహక ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో కొద్దిరోజుల క్రితం కొన్నిఇసుక డంప్‌లను సీజ్ చేశాం. వాటిని తహసీల్దార్ పర్యవేక్షణలో ఉంచాం. అక్రమ రవాణాపై చర్యలు చేపడతాం.

– విజయ్‌కుమార్ రాథోడ్, జిల్లా మైనింగ్ శాఖ అధికారి

వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మాసశివ రాత్రిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు.



క్లుప్తంగా...

తెలంగాణ ఉద్యమాన్నే వక్రీకరిస్తారా?

సీఎం కేసీఆర్‌పై వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: మూడు తరాల నాయకులు ముక్త కంఠంతో ఉద్యమిస్తే వచ్చిన తెలంగాణ ఉద్యమాన్ని వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. జై తెలంగాణ అంటే.. నై తెలంగాణ అని చెప్పిన్న సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహి అని ఆమె ధ్వజమెత్తారు. శుక్రవారం ట్విట్టర్ వేదికగా కేసీఆర్ పై వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పుట్టకపోయిన, దీక్ష చేయకున్న రాష్ట్రమే వచ్చేదికాదు అని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడాన్ని ఆమె తప్పుపట్టారు. ఉద్యమం కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరులను, సకల జనులను అవమానించడమే కేసీఆర్ వైఖరని ఆరోపించారు. దొంగ దీక్షలతోనో, పెట్రోల్ పోసుకొని అగ్గిపెట్టె దొరకలేదని నాటకాలు ఆడితేనో తెలంగాణ రాలేదని పేర్కొన్నారు. ఎంతోమంది తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేస్తే వచ్చింది తెలంగాణ అని ఆమె స్పష్టం చేశారు.

టీటీడీపీ బలోపేతానికి మహిళా శక్తిని మేల్కొలపాలి

టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు మహిళా శక్తిని మేల్కొలపాల్సిన బాధ్యత తెలుగు మహిళలపై ఉందని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగు మహిళా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో టీడీపీ పార్టీ బలోపేతం చేసేందుకు మహిళలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు షకీలారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

119 నియోజక వర్గాల్లో పోటీ చేస్తాం

శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింగారి శివాజీ

బోధన్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వ వైఫల్యాలు, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను గట్టిగా ఉద్యమిస్తామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన తరఫున 119 నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామని శివసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింకారి శివాజీ స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి కిషన్ అధ్యక్షతన నిర్వహించిన శివసేన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 50% బీసీలు, 33% మహిళలకు, తెలంగాణ ఉద్యమకారులు, జర్నలిస్టులకు పార్టీ టికెట్లు ఇస్తామని పేర్కొన్నారు.

పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరణ!

బండి సంజయ్ కసరత్తు

- ఎన్నికల టీమ్ కోసం బీజేపీలో సంస్థాగత మార్పులు
- మరో ప్రధాన కార్యదర్శి, ఇద్దరు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధుల నియామకానికి యోచన
- వివిధ సెల్‌ల ఏర్పాటుకు చర్యలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి సంస్థాగత బలోపేతంలో భాగంగా రాష్ట్ర బీజేపీని పునర్వ్యవస్థీకరించే దిశగా అధ్యక్షుడు బండి సంజయ్ కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల టీమ్‌ను సిద్ధం చేసుకునే క్రమంలో త్వరలోనే వివిధ స్థాయిల్లో సంస్థాగత మార్పులకు, కొత్తగా ఆయా వృత్తులు, ఇతర రంగాల వారీగా వివిధ సెల్‌ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గం, మోర్చాలలో పలువురి నియామకం, పనితీరు సరిగాలేని కొన్ని జిల్లాల అధ్యక్షుల మార్పుపై కూడా దృష్టి సారించినట్లు పార్టీవర్గాల సమాచారం. అదనంగా మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మరో ఇద్దరు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులను నియమించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఎన్నికలకు సంబంధించిన వివిధ రకాల విధులను రాష్ట్ర పార్టీ నాయకులతో పాటు అన్ని స్థాయిల వారికి అప్పగించనున్నట్లు సమాచారం. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'మహా జనసంపర్క్ అభియాన్'ముగిశాక (ఈనెల 30న) మార్పులు, నియామకాలు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కులాలు, వర్గాలు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం లభించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

125 మందికి ప్రాధాన్యత పోస్టులు

రాష్ట్ర పార్టీని సంస్థాగతంగా విస్తరించడంలో భాగంగా అన్ని సామాజిక వర్గాలు, అన్ని భౌగోళిక ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా 125 మందిని రాష్ట్ర కార్యవర్గభ్యులుగా సంజయ్ నియమించారు. వీరిలో సీనియర్లు, నేతలుగా ఇప్పటికే ఎదిగిన వారికి మళ్లీ చేపట్టబోయే మార్పులు, చేర్పుల సందర్భంగా తగిన ప్రాధాన్యత ఉన్న పోస్టుల్లో నియమించే అవకాశాలున్నట్టు చెబుతున్నారు.

రాష్ట్రంలో అభియాన్ కార్యక్రమాలిలా...

తెలంగాణలో చేపడుతున్న 'అభియాన్'లో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలు, మూడుచోట్ల నిర్వహించే భారీ సభల్లో మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా పాల్గొంటారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక్కో బహిరంగసభ చొప్పున నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మండల కేంద్రాలు, శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్‌ల స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21న మండల స్థాయిల్లో ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, సామాజిక సంస్థలు, ఉద్యోగ సంఘాలను భాగస్వాములను చేసి యోగా దివస్ నిర్వహిస్తారు. పార్టీ సిద్ధాంత కర్త డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి రోజైన 23వ తేదీ మొదలుకుని 30 వరకు ఇంటింటి ప్రచారంలో భాగంగా మోదీ ప్రభుత్వ విజయాలు, కేంద్ర సంక్షేమ పథకాలపై పుస్తకాలు, కరపత్రాలు పంపిణీ చేయనున్నారు. 23న దేశవ్యాప్తంగా పార్టీ పోలింగ్‌బూత్ కమిటీలతో మోదీ వర్చువల్‌గా మాట్లాడతారు. 25న ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలి

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



కరీంనగర్ టౌన్: హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలని, దీనిని సాధించేందుకు అన్ని పార్టీలు కలసి రావాలని బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని అంబేడ్కర్ ఏనాడో ప్రస్తావించారని, తన వ్యక్తిగత అభిప్రాయం కూడా అదేనని పేర్కొన్నారు. రెండో రాజధానికి కావాల్సిన అర్హతలన్నీ హైదరాబాద్‌కు ఉన్నాయని తెలిపారు. అంబేడ్కర్ మనవడు కూడా ఇటీవల ఇదే విషయాన్ని వెల్లడించారని విద్యాసాగర్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని అన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లలాగా దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ పేరిట ఓట్లు ఉన్నాయని, మిగతా పార్టీల ఓట్లు జాయింట్ అకౌంట్లలో ఉంటాయని, వాటిని విడిపించే సత్తా తమ పార్టీ నాయకులకు ఉందని చెప్పారు. మోదీ పాలనలో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందని, ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు అన్ని దేశాలు ప్రధాని మోదీ సలహాలు తీసుకుంటున్నాయని వివరించారు. రాజకీయాల్లో ప్రస్తుతం క్రియాశీలకంగా లేనని, తాను సాధారణ బీజేపీ సభ్యుడిని మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కరీంనగర్ కల్లోల జిల్లా కాదు కళకళలాడే జిల్లా అని తాను ఆరోజే చెప్పానని, జిల్లా అభ్యున్నతి వెనక అన్ని పార్టీల కృషి ఉందని అన్నారు. కరీంనగర్ తనకు జన్మభూమితో పాటు కర్మభూమి కూడా అని పేర్కొన్నారు.

పదేళ్ల తెలంగాణ సాధించిందేమిటి?

- మేధావులు చర్చించాలన్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- నల్లగొండ మండలం జి.చెన్నారంలో భట్టిని కలిసిన న్యాయవాదులు, సామాజికవేత్తలు



భట్టి విక్రమార్కకు 'వైఎస్‌ఆర్ ఛాయలో' పుస్తకాన్ని బహూకరిస్తున్న విద్యావేత్త గోనారెడ్డి

నల్లగొండ: 'తెలంగాణ వచ్చి పదేళ్లు అవుతుంది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో లక్ష్యాలు, సాధించిన ఫలితాలు ఏమిటన్న దానిపై మేధావులు విస్తృతంగా చర్చించాలి'అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్ మార్చ్‌లో భాగంగా నల్లగొండ నియోజకవర్గం పరిధిలోని జి.చెన్నారం పాదయాత్ర క్యాంపులో శుక్రవారం తనను కలిసిన మేధావులు, ఉద్యమకారులు, న్యాయవాదులు, సామాజికవేత్తలతో భట్టి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో ఏం సాధించామన్న విషయంపై నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సెమినార్లు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ఫాసిస్టు బీఆర్ఎస్ ప్రభుత్వ పీడను వదిలించుకోవడానికి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావులు, జర్నలిస్టులు, సామాజిక వేత్తలు, ప్రగతిశీలవాదులు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో నల్లగొండ జిల్లాలో ఒక్క ఎకరాకూ అదనంగా నీరందించలేదని, ఇప్పుడు అందుతున్న సాగునీరు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ఫలితమేనని తెలిపారు. గత ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములను ధరణి పార్ట్-బీలో పెట్టి, ఆ భూములను తిరిగి దొరలకు ఇప్పించే పనిలో కేసీఆర్ ఉన్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పోరాటం కీలకమైందని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్‌కు బార్ల మీద ఉన్న సోయి బడుల మీద లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమైందని, వాటన్నింటినీ ప్రజలకు తెలియజేయాలని వారికి కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మామిడి బాలయ్య, ఎస్.నర్సింహ, సామాజిక వేత్తలు, విద్యావేత్తలు, గోనారెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, నరేష్‌రెడ్డి, సరస్వతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పీఏసీ భేటీ

- పార్టీలోకి చేరికలు, మండల కమిటీలు, రాజకీయ పరిణామాలపై చర్చ
- బీసీ డిక్లరేషన్ అధ్యయనంపై నిర్ణయాలు తీసుకోనున్న నేతలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం శనివారం జరగనుంది. టీపీసీసీ చీఫ్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం గాంధీభవన్‌లో జరగనున్న ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చించనున్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ కేడర్‌లో కొత్త జోష్ వచ్చిన నేపథ్యంలో ఈ ఉత్సాహాన్ని మరింత ముందుకు కొనసాగించడం ఎలా అన్నదానిపై కాంగ్రెస్ ముఖ్య నేతలు చర్చించనున్నారు. ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు కొందరు నాయకులు జరుపుతున్న చర్చలు, పార్టీ మండల కమిటీల ఏర్పాటుతో పాటు త్వరలో చేయనున్న బీసీ డిక్లరేషన్ గురించి ఈ సమావేశంలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఇక, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా నల్లగొండ, ఖమ్మంలో భారీ సభల నిర్వహణ, సూర్యాపేటలో చేయాలనుకున్న బీసీ డిక్లరేషన్ తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి.

కొత్త ఇన్‌చార్జి కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

ఏఐసీసీ నుంచి ఇన్‌చార్జులుగా వచ్చిన నూతన కార్యదర్శులు విష్ణునాథ్, మన్సూర్‌అలీ ఖాన్ శుక్రవారం ఉదయం గాంధీభవన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు సంపత్‌కుమార్ తదితరులు వారికి స్వాగతం పలికారు. అనంతరం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ యాదవ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కూడా వారు పాల్గొన్నారు. కొత్త కార్యదర్శులు గాంధీభవన్‌కు వచ్చిన సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జరగనున్న పీఏసీ సమావేశంలో వారు కూడా పాల్గొంటారని, రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు పరిచయం కావడంతో పాటు వారి ఆలోచనలను కూడా పంచుకుంటారని తెలుస్తోంది. కాగా, బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఇద్దరు ఏఐసీసీ కార్యదర్శులు మాట్లాడుతూ రానున్న ఐదు నెలల పాటు కష్టపడి పనిచేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అధికారం కచ్చితంగా దక్కుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జూపల్లి ఇంటికి సంపత్, కోదండరాం

- రేవంత్ ఆలోచనను జూపల్లి, కోదండరాంకు వివరించా
- కాంగ్రెస్‌లో టీజేఎస్ విలీనమా? కలిసి పనిచేయాలా అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయి: సంపత్

సాక్షి, హైదరాబాద్: త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్న మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుతో ఆ పార్టీ నేతల సంప్రదింపులు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంతో కలిసి హైదరాబాద్‌లోని జూపల్లి నివాసానికి వెళ్లా రు. ఈ ముగ్గురి మధ్య రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది. కాంగ్రెస్ పార్టీలో చేరడానికే మొగ్గు చూపిన జూపల్లి కొన్ని విషయాలను సంపత్‌తో పాటు కోదండరాం దృష్టికి తెచ్చినట్టు సమాచారం. రాహుల్‌గాంధీ అమెరికా నుంచి రాగానే ఢిల్లీ వెళ్లి కలవాలని, ఆ తర్వాత ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో సభలు పెట్టి పార్టీలో చేరాలనే విషయాలపై చర్చ జరిగిందని తెలుస్తోంది. సమావేశం అనంతరం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ ఆలోచనా విధానాన్ని జూపల్లికి, కోదండరాంకు వివరించానని తెలిపారు. టీజేఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయాలా లేక కలిసి పనిచేయాలా అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయని, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా తాను ముందుకు వెళతానని కోదండరాం చెప్పారని వెల్లడించారు.

కేసీఆర్ పాలన భరించే ఓపిక ప్రజలకు లేదు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- హైదరాబాద్‌లో గెలిస్తేనే రాష్ట్రంలో అధికారం... కాంగ్రెస్‌లో చేరికలు గాలివాటం కాదు
- కేసీఆర్‌కు వ్యతిరేకంగానే రాజకీయ పునరేకీకరణ
- కేటీఆర్ పుట్టకముందే తెలంగాణ ఉద్యమం పుట్టింది



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ దోపిడీకి నాలుగు కోట్ల ప్రజలు బలయ్యారని, ఇక రాష్ట్రంలో కేసీఆర్ పాలనకు నూకలు చెల్లినట్టేనని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనను భరించే ఓపిక కూడా ప్రజలకు లేదని పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది గంగాపురం రాజేందర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భీముడు నాయక్, అచ్చంపేట, చారగొండ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరికలు గాలివాటం కాదని, కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణలో భాగమేనని అన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ నుంచి విముక్తి చేసే దిశలోనే ఈ చేరికలు జరుగుతున్నాయన్నారు. కేసీఆర్ పుట్టకపోయి ఉంటే తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కేటీఆర్ అంటున్నారని, అయితే కేటీఆర్ పుట్టకమునుపే తెలంగాణ ఉద్యమం పుట్టిందన్న విషయాన్ని ఆయన గ్రహించాలని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రేవంత్ చెప్పారు.

హైదరాబాద్‌లో గెలిస్తేనే..!

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా, హైదరాబాద్‌లో కూడా కాంగ్రెస్ జెండా ఎగిరిందని, హైదరాబాద్‌లో గెలిస్తేనే రాష్ట్రంలో పార్టీకి అధికారం దక్కుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన అనిల్‌కుమార్ యాదవ్ శనివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ కార్యదర్శులు మన్సూర్‌అలీ ఖాన్, విష్ణునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ హైదరాబాద్ బస్తీల్లో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో చేసిందేనని అన్నారు. వందలాది ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తెచ్చింది కూడా కాంగ్రెస్సేనన్నారు. తెలంగాణలో ఈసారి ఎదురుకానున్న ఓటమికి ఎమ్మెల్యేలను బాధ్యులను చేయాలని కేసీఆర్ చూస్తున్నారని, ఓటమిని వారి ఖాతాలో వేసేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ విమర్శించారు. 2023 డిసెంబర్ 9 కల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, అప్పుడు డిసెంబర్ 9న తెలంగాణ ఆవిర్భావ ప్రకటన దినోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు.

రేపు కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఇప్పటికే కొడంగల్‌లో రేవంత్‌తో ఓ మారు ఆయన చర్చలు జరపగా, శుక్రవారం ఉదయం రేవంత్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయనను కాంగ్రెస్ పార్టీలో చేరాలని రేవంత్‌రెడ్డి కోరారు. రేవంత్ ఆహ్వానాన్ని మన్నించిన గుర్నాథ్‌రెడ్డి ఆదివారం పార్టీలో చేరనున్నారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

121 మంది ఎస్ఐలకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘంగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలకు తీపికబురు తెలిపింది. 121 మంది ఎస్ఐలకు ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులు ఇస్తూ మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఎస్ఐలకు పలు దఫాల్లో పదోన్నతులు కల్పిస్తూ వస్తున్న అధికారులు, ఖాళీలకు అనుగుణంగా తాజాగా మరో 121 మందికి పదోన్నతి కల్పించారు.

7 తర్వాత రాష్ట్రానికి ప్రియాంక!

- ఎంపీ కోమటిరెడ్డి వెల్లడి
- త్వరలో పర్యటన తేదీలు ఖరారు
- ప్రియాంకతో వెంకట్‌రెడ్డి భేటీ



ఢిల్లీలో ప్రియాంకను కలిసి వస్తున్న కోమటిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే నెల 7 తర్వాత రాష్ట్రంలో పర్యటిస్తానని, నిర్దిష్ట తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హామీ ఇచ్చినట్లు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కోమటిరెడ్డి శుక్రవారం సోనియాగాంధీ నివాసంలో 20 నిమిషాల పాటు ప్రియాంకతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితి, భట్టి పాదయాత్ర, నేతల చేరికలు, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన, సూర్యాపేట, ఖమ్మంలో బహిరంగ సభలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే ఉన్న దృష్ట్యా రాష్ట్ర పర్యటనలకు ఎక్కువ సమయం ఇవ్వాల్సిందిగా ప్రియాంకా గాంధీని కోరినట్లు తెలిపారు. 33 జిల్లాలను కవర్ చేసేలా ప్రతి పది రోజులకు ఒకసారి రాష్ట్రంలో పర్యటించాలని కోరినట్లు చెప్పారు. సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు హాజరవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశానన్నారు.

అందరూ కాంగ్రెస్‌లోకి వస్తారు

తెలంగాణలో రాజకీయ పరిస్థితులపై స్టార్ క్యాంపెయినర్‌గా ప్రియాంకతో లోతుగా చర్చించానని, అయితే అంతర్గత అంశాలను బయటకు చెప్పలేనని కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో ఎక్కువ ఎంపీ స్థానాలు గెలవడంతో పాటు, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేలా నేతలంతా సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆమె సూచించారని తెలిపారు. కర్ణాటకలో రెండు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించారని, అదే మాదిరి తెలంగాణలోనూ 60% సీట్లు ముందుగానే ప్రకటించాలని తాను కోరినట్లు తెలిపారు. సోనియా గాంధీ ఇచ్చిన ప్రత్యేక రాష్ట్ర ఉద్దేశం నెరవేరడం లేదని తెలిపినట్లు వివరించారు. పార్టీలో అందరం కలిసికట్టుగా ఉన్నామన్న కోమటిరెడ్డి.. ఇతర అంశాలపై మాట్లాడేందుకు నిరాకరించారు. మీ సోదరుడు రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తారా? అని అడగ్గా.. 'అందరూ వస్తారు'అని సమాధానమిచ్చారు.

ఢిల్లీలో రాజనర్సింహ..

మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ గత రెండ్రోజులుగా ఢిల్లీలో ఉన్నారు. ఆయన పలువురు నేతలతో భేటీ అయినట్లు తెలుస్తున్నా, వివరాలు వెల్లడి కాలేదు.

హరితనిధి సొసైటీ రిజిస్ట్రేషన్‌కు సర్కార్ అనుమతి..

సాక్షి, హైదరాబాద్: 2001 తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద 'తెలంగాణ హరితనిధి సొసైటీ'ని రిజిస్టర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు శుక్రవారం సీఎస్, స్పెషల్ సీఎస్ అటవీశాఖ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ఈ సొసైటీ మెమొరాండం ఆఫ్ అసోసియేషన్, సొసైటీ బైలాస్‌లను అపెండిక్స్-1, అపెండిక్స్-2 కింద జోడిస్తూ (అపెండెడ్) నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ పీసీసీఎఫ్‌ను ఆదేశించింది.

సెప్టెంబర్ నాటికి వంద శాతం మురుగుశుద్ధి


- స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ద్వారా బస్తీల పరిరక్షణ
- వేగంగా మెట్రో విస్తరణ, ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్‌వే పనులు
- తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: వచ్చే సెప్టెంబర్ నాటికి నగరంలో వందశాతం మురుగునీటిని శుద్ధి చేయనున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. మూసీనదిపైన 14 చోట్ల బ్రిడ్జీలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. బస్తీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శిల్పకళావేదికల ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి సంబరాలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బస్తీల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. దీంతో బస్తీలకు వరద ముప్పు తప్పుతుందన్నారు. నగరంలో మెట్రో విస్తరణ, ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వే పనులు వేగంగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు, ప్రపంచ నగరాలకు దీటుగా హైదరాబాద్‌ను అభివృద్ధిచేసేందుకు సమగ్రమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

పట్టణాలే కీలకం...: రానున్న ఐదేళ్లలో మెజారిటీ జనాభా పట్టణాల్లో నివాసం ఉంటుందన్నారు. పరిశ్రమలకైనా, నివాసగృహాలకైనా నిర్ణీత సమయంలో.. వేగంగా అనుమతులు ఇస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనన్నారు. తెలంగాణలో సమగ్ర, సమ్మిళిత, సంతులిత, సమతుల్య పరిపాలన కొనసాగుతున్నదన్నారు. విప్లవాత్మకమైన ఆలోచన విధానంతో సమాజంలోని అన్ని వర్గాలను, పట్టణాలను, పల్లెలను ఎలాంటి తేడా లేకుండా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ విధానాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా ముందుకు తీసుకుపోతున్న ఘనత రాష్ట్రంలోని ఆరున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగులకు దక్కుతుందన్నారు. నెల రోజుల వ్యవధిలో విజయవంతంగా హైదరాబాద్ నగరంలో 150 వార్డుల్లో వార్డు కార్యాలయ వ్యవస్థను ప్రారంభించినట్టు తెలిపా రు. ప్రజలంతా భయాందోళనకు గురైన కరోనా సంక్షోభ కాలంలోను జీహెచ్ఎంసీ అధికారులు రోడ్లనిర్మాణం, లింకురోడ్ల నిర్మాణం, బ్రిడ్జిల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ వంటి కార్యక్రమాల్లో ప్రాణాలకు తెగించి పాల్గొన్నారన్నారు.

ప్రతి పట్టణానికి మినీ స్టేడియం...: క్రీడా శాఖతో కలసి పురపాలకశాఖ ప్రతి పట్టణంలో ఒక మినీస్టేడియాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. రూ.71 కోట్లతో పట్టణాల్లోని అన్ని బడుల్లో స్వచ్ఛబడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు.

సిటీకి నీళ్లు మస్తు: భవిష్యత్తులో హైదరాబాద్ నగర జనాభా ఎంత పెరిగినా అందుకు తగిన నీటి వసతి ఉందని మంత్రి కె.తారక రామారావు అన్నారు. 2050 వరకు జనాభా రెండితలు పెరిగినా అందుకు తగిన నీటి వసతి ఉన్న ఏకైక నగరం హైదరాబాద్ అని తెలిపారు. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి రాకుండా అనేక ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికోసం ప్రస్తుతం సుంకిశాల ప్రాజెక్టు నిర్మిస్తున్నామని, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌ల నుంచి నీరు సరఫరా చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. జలమండలి ఎండీ దాన కిశోర్ మట్లాడుతూ.. ప్రస్తుతం హైదరాబాద్ మహా నగరానికి సమృద్ధిగా నీళ్లు ఇస్తున్నామని, భవిష్యత్తు అవసరాలకు తగిన ప్రణాళికలు రచించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, అరికెపూడి గాంధీ, ఇతర ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీడీఎంఏ కమిషనర్, డైరెక్టర్ సత్యనారాయణ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

బీఆర్ఎస్‌తో పొత్తుపై సందిగ్ధంలో లెఫ్ట్!

ముఖ్యమంత్రి ఎటూ తేల్చడం లేదంటున్న నేతలు

- పొత్తులపై చర్చలకు బీఆర్ఎస్ అనాసక్తితో వామపక్షాల అసంతృప్తి
- అవసరమైతే కాంగ్రెస్ వెంట వెళ్దామనే చర్చ లేవనెత్తుతున్న కొందరు నేతలు



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు కొనసాగుతుందా? లేదా? అన్న దానిపై వామపక్షాల్లో సందిగ్ధం నెలకొంది. 'మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పొత్తుతో ముందుకు వెళ్లినా.. ప్రస్తుతం ఆ పార్టీతో పొత్తు వ్యవహారం యథాతథ స్థితిలో ఉంది'అని ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్య చర్చనీయాంశమైంది. పొత్తుల విషయంలో బీఆర్ఎస్ మౌనంగా ఉండటంపై వామపక్ష నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కలసి పనిచేసిన తర్వాత.. ఇప్పుడా పార్టీని కాదని మరో పార్టీతో ముందుకెళితే ప్రజల్లో చులకన భావన ఏర్పడుతుందని అంటున్నారు. బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందా, లేదా అన్నదానిపై తమ కార్యకర్తలకు ఏమీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నామని వాపోతున్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం, ఆ ప్రభావం ఇక్కడా ఉంటుందన్న చర్చల నేపథ్యంలో హస్తం పార్టీ వైపు వెళ్లాలని కొందరు వామపక్ష నేతలు చర్చ లేవనెత్తుతున్నారు.

పొత్తులపై త్వరలో తేలుస్తామంటున్న నేతలు

సీపీఐ, సీపీఎం నేతలు ప్రజాసమస్యలతోపాటు పొత్తులపైనా సీఎం కేసీఆర్‌తో చర్చించాలని అనుకున్నారు. దీనిపై సీఎం అపాయింట్‌మెంట్ కూడా అడిగారు. కానీ వారాలు గడిచినా అపాయింట్‌మెంట్‌పై ఎలాంటి స్పందనా రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిజానికి గతంలో బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు 'పొత్తులుంటాయి కానీ.. లెఫ్ట్ పార్టీలకు సీట్లు ఇవ్వబోం. కేవలం ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తాం' అని పేర్కొనడం.. దానిపై వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తమవి ప్రజా పార్టీలనీ, ఎన్నికల్లో పోటీ చేయాల్సిందేనని స్పష్టం చేయడం గమనార్హం. పొత్తులో భాగంగా చెరో 10 సీట్లు అడగాలని సీపీఐ, సీపీఎం భావించాయి. చివరికి చెరో ఐదు సీట్లతో అయినా పొత్తుకు సిద్ధం కావా లని అనుకున్నాయి. కానీ బీఆర్ఎస్ నుంచి స్పందన లేదు. దీనితో వామపక్షాలను బీఆర్ఎస్‌ను పట్టించుకోవడం లేదన్న చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొంది. తాము ఖమ్మం, నల్లగొండ వంటి రెండు, మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రభావితం చూపుతామని.. పొత్తు పెట్టుకుంటే బీఆర్ఎస్‌కే లాభమని వామపక్షాలు అంటున్నాయి.

త్వరలో ఏదో ఒకటి తేల్చుతాం!

పొత్తులపై త్వరలోనే ఏదో ఒకటి తేల్చుతామని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల తర్వాత కేసీఆర్‌ను కలసి ఒక ఒప్పందానికి వస్తామని వామపక్షాలు అంటున్నాయి. తమకు గౌరవ ప్రదమైన సంఖ్యలో సీట్లు ఇవ్వకపోతే పొత్తుపై పునరాలోచిస్తామని.. అయితే ఈ విషయంలో తొందర పడబోమని పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ నేతలు కూడా వామపక్షాలంటే లెక్కలేకుండా ఉన్నారని, కనీసం తమను సంప్రదించలేదని, వారితో ఎలా ముందుకు సాగగలమని లెఫ్ట్‌నేతలు అంటున్నారు. ఏదిఏమైనా బీజేపీని ఓడించే శక్తులతో ముందుకు వెళ్లాలన్నదే తమ అభిమతమని స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తే.. వామపక్షాల పొత్తు అంశం అంతుబట్టడం లేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.



ఇండోర్ సైక్లింగ్ ఎన్నో వ్యాయామాలకు సరిసాటి

వ్యాయామం చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు న్యాయనే విషయం అందరికీ తెలుసు. అయితే అందరికీ వ్యాయామం చేయడం కుదరకపోవచ్చు. కొందరికైతే కనీసం వాకింగ్ చేయడం కూడా కష్టమే అవుతుంటుంది వారున్న పరిస్థితులలో. అలాంటప్పుడు కనీసం ఇండోర్ సైక్లింగ్ లేదా స్టేషనరీ సైకిల్‌తో వ్యాయామం చేసినా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇండోర్ సైక్లింగ్ వల్ల ఏయే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో చూద్దాం...

ఇండోర్ సైక్లింగ్ శరీరాన్ని ఫిట్ గా ఉంచడమే కాకుండా గుండె జబ్బుల ముప్పును కూడా తగ్గిస్తుంది.

ఇండోర్ సైక్లింగ్ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఇండోర్ సైక్లింగ్ ఎన్నో రోగాల ముప్పు నుంచి కాపాడుతుంది. ఏరోబిక్ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. అలాగే హృదయ స్పందన రేటును పెంచుతుంది. ఇది మీ గుండె కండరాలను బలోపేతం చేయడానికి, శరీరంలోకి రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేయడానికి సహాయపడుతుంది. ఈ వ్యాయామాన్ని స్థిరంగా చేయడం వల్ల రక్త ప్రసరణ, ఊపిరితిత్తుల సామర్థ్యం మెరుగుపడుతుంది. దీంతో అధిక రక్తపోటు పోటు సమస్యలు రావు. గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది.

మెటబాలిజాన్ని పెంచుతుంది

ఏ రకమైన కదలిక అయినా సరే శరీరానికి ఎంతో మంచి చేస్తుంది. సైక్లింగ్ ఎఫెక్టివ్ కేలరీల బర్నింగ్ వ్యాయామం. సైక్లింగ్ తో బెల్లీ ఫ్యాట్ ను తగ్గించుకోవచ్చు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రకారం.. 70 కిలోల బరువున్న వ్యక్తి ఇండోర్ సైక్లింగ్ వల్ల 250 నిమిషాల్లో 30 కేలరీలను కరిగించగలడు. అందుకే మీరు బరువు తగ్గాలనుకుంటే జిమ్ముకు బదులుగా ఇంట్లో ఉండి ఇండోర్ సైక్లింగ్ చేస్తే సరి! అంతేకాదు ఈ సైకిల్‌ను తొక్కడం వల్ల మీ కాలి కదలికలు మెరుగుపడతాయి. ఫలితంగా కాళ్లలోని కండరాల సమూహాలు - క్వాడ్రిసెప్స్, గ్లూట్స్, తొడ కండరాలు కాలక్రమేణా బలంగా, టోన్ అయ్యేలా చేస్తాయి.

ఇండోర్ సైక్లింగ్ మీ కీళ్లకు మంచిది

ఇండోర్ సైక్లింగ్ ప్రభావవంతమైన తక్కువ-ప్రభావ వ్యాయామంగా పరిగణించబడుతుంది. ఇది వృద్ధులకు, మోకాలి, కీళ్ల నొప్పులు ఉన్నవారికి బాగా సహాయపడుతుంది. ఇది కీళ్లపై తక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. మోకాలి సమస్య లేదా వెన్నునొప్పి ఉన్నవారు ఇండోర్ సైక్లింగ్‌కు ముందు డాక్టర్‌తో మాట్లాడాలి. వైద్యుడి సలహా మేరకే ఈ సైకిల్‌ను తొక్కాలి.

ఒత్తిడిని తగ్గిస్తుంది


ఇండోర్ సైక్లింగ్ మానసిక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. ఏదో ఒక రూపంలో శారీరకంగా చురుకుగా ఉండటం వల్ల మీ శరీరం ఎండార్ఫిన్లు అని పిలువబడే ఫీల్-గుడ్ హార్మోన్లను విడుదల చేస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం.. సైక్లింగ్ డోపామైన్, సెరోటోనిన్ ను కూడా పెంచుతుంది. ఫలితంగా మీ మానసిక స్థితి మెరుగ్గా ఉంటుంది. ఒత్తిడి స్థాయిలు కూడా తగ్గుతాయి.

శక్తి సామర్థ్యాలను పెంచుతుంది

ఇండోర్ సైక్లింగ్ మీ స్టామినాను పెంచడానికి కూడా సహాయపడుతుంది. దీన్ని రెగ్యులర్ గా తొక్కుతుంటే క్రమంగా అలసట తగ్గి రోజువారీ కార్యకలాపాలను నిర్వహించడానికి, ఇతర వ్యాయామాలలో పాల్గొనడానికి ఎక్కువ శక్తి, సామర్థ్యాన్ని కలిగి ఉండటానికి సహాయపడుతుంది.

మీరు ఈ పరీక్షలు చేయించుకున్నారా?

కొలెస్ట్రాల్ నుంచి క్యాన్సర్ వరకు ఆరోగ్య సమస్యలను సకాలంలో కనుక్కుంటే చికిత్స సులువు అవుతుంది. ఇటీవలి కాలంలో చాలామంది రకరకాల వ్యాధులకు సంబంధించిన లక్షణాలు ముదిరే వరకు వాటిని గుర్తించడంలో ఆలస్యం చేస్తున్నారు. దీనివల్ల ప్రాణాలు పోయే పరిస్థితి కూడా వస్తుంది. అందుకే వయసుల వారీగా చేయించుకోవలసిన వైద్యపరీక్షల జాబితాను దగ్గర ఉంచుకుని తమ వయసుని బట్టి ఆయా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరం అయితే సరైన సమయంలో చికిత్స తీసుకుంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మనం పైన చెప్పుకున్న దానిని బట్టి ఏ వయసులో ఏ పరీక్ష చేయించుకోవడం అవసరమో చూద్దాం.



20 ఏళ్ల వయసులో...




సాధారణంగా ఈ వయసులో ఎక్కడ పడితే అక్కడ తినడం, టాటూలు వేయించుకోవడం, అబ్బాయిలయితే హెయిర్ కట్ లేదా షేవింగ్ చేయించుకోవడం లేదా ఎలా పడితే అలా ఉండటం జరుగుతుంటుంది. రకరకాల కారణాల వల్ల హెచ్.ఐ.వి. బారిన పడే ప్రమాదం ఉండే అవకాశం ఎక్కువ. అందువల్ల హెచ్.ఐ.వి. పరీక్ష చేయించుకోవడం మంచిది. అలాగే హెపటైటిస్ సి కోసం పరీక్షలు చేయించుకుంటే మంచిది. ఇక మహిళలు గర్భాశయ క్యాన్సర్ కోసం స్క్రీనింగ్ 21 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు పరీక్షలు చేయించుకోవాలి. అదేవిధంగా బీపీ, షుగర్ టెస్ట్ కూడా!

30 ల్లో...



30 నుంచి 65 సంవత్సరాల వయసు గల స్త్రీ పురుషులు మధుమేహం, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న వాళ్లు ప్రీడయాబెటిస్, టైప్ 2 మధుమేహం స్క్రీనింగ్ తప్పనిసరి. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం 35 ఏళ్ల పైబడిన వారందరూ టైప్ 2 డయాబెటిస్ పరీక్ష చేయించుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. 35 ఏళ్ల వయసు మహిళలు కొలెస్ట్రాల్ స్థాయిలు తనిఖీ చేయించుకోవాలి. 30 నుంచి 65 సంవత్సరాల వయసు గల మహిళలకు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పాప్ స్మియర్ టెస్ట్ కొనసాగించాలి. హెచ్ పీవీ వైరస్ గర్భాశయ, ఇతర క్యాన్సర్లకు కారణమవుతుంది.

40 ల్లో...



స్త్రీలు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునేందుకు 45 ఏళ్ల వయసు సరైన సమయం. కోలన్ క్యాన్సర్ పరీక్షించేందుకు కోలోనోస్కోపీ లేదా మెయిల్ ఇన్ స్టూల్ టెస్ట్ ద్వారా పరీక్ష చేయించుకోవాలి. రొమ్ముక్యాన్సర్ స్క్రీనింగ్ కోసం 40 దాటిన మహిళలు ప్రతి రెండేళ్లకు ఒకసారి మామోగ్రామ్ చేయించుకోవడం అవసరం. అదేవిధంగా కంటి సంబంధిత పరీక్షలు కూడ ముఖ్యం. మధుమేహం ఉంటే అధిక రక్తపోటు, కంటివ్యాధుల పరీక్షలు తప్పనిసరి. ఈ వయసులో పురుషులు, స్త్రీలు ఇద్దరూ విటమిన్ డి, కాల్షియం టెస్ట్ చేయించుకోవడం అవసరం.

50 ల్లో...



మెనోపాజ్ దశలోకి వచ్చిన తర్వాత మహిళలు తప్పనిసరిగా ఆస్టియో పొరాసిస్ ఉందేమో పరీక్షించుకోవాలి. ఇందుకోసం బోన్ డెన్సిటీ టెస్ట్ అంటే ఎముక సాంద్రత ఎంత ఉందో తెలిపే పరీక్ష చేయించుకోవాలి. ఇక ధూమపానం చరిత్ర ఉన్న పెద్దలు ఊపిరితిత్తుల క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రోస్టేట్ క్యాన్సర్ పరీక్షలు పురుషులు చేయించుకోవాలి.

60 ల్లో...



65 ఏళ్ల అంతకంటే పైబడిన వయసు ఉన్న మహిళల్లో ఎముకల అరుగుదల కనిపిస్తుంది. అందుకే బోలు ఎముకల వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం కూడా బోన్ డెన్సిటీ టెస్ట్ అవసరం. ఇక 65 నుంచి 75 సంవత్సరాల మధ్య వాళ్ళకి బ్రెయిన్ అనూరిజం పరీక్షలు తప్పనిసరి.



ముఖ్యమైన విషయం... 35 సంవత్సరాలు దాటిన స్త్రీ పురుషులు తప్పనిసరిగా హృదయ సంబంధిత పరీక్షలు చేయించుకోవడం అవసరం. అదే వారి కుటుంబంలో ఎవరికైనా హృద్రోగం ఉంటే ప్రతి ఆరునెలలకు ఒకసారి గుండె సంబంధిత టెస్ట్‌లు చేయించుకోవడం తప్పనిసరి.

మీకు తెలుసా



స్నానపు నీటిలో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్‌ను కలపడం ద్వారా మరింత రిలాక్స్‌డ్‌గా, రిఫ్రెష్‌డ్‌గా ఉన్న అనుభూతిని పొందవచ్చు. లావెండర్ వాసన నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. రక్త పోటును తగ్గిస్తుంది, కండరాల నొప్పి నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు మీ ఒత్తిడిని తగ్గించి మానసిక స్థితిని కూడా మెరుగుపరుస్తుంది. అలాగే స్నానం చేసిన వెంటనే మీ చర్మానికి మాయిశ్చరైజర్ రాయండి. తద్వారా మీ జుట్టు, చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

హెల్త్ టిప్స్





తులసి ఆకుల రసంలో అంతే మొత్తంలో తేనె కలిపి తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.

* * *

ఓ నాలుగైదు తమలపాకులను వెచ్చచేసి, వాటిని నూరి రసం తీసి, దానిలో అంతే మొత్తంలో తేనె కలిపి తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.

* * *

ఓ రెండు చెంచాల నూనెను కాచి, ఒక పెద్ద చెంచాడు కర్పూరాన్ని పొడిచేసి నూనెలో కలిపి ఒక సీసాలో నిల్వ వుంచాలి. దీనిని ఛాతీకి, గొంతుకకూ రాస్తే దగ్గు, జలుబు తగ్గుతాయి.

* * *

గుప్పెడు జామాయిలు (యూకలిప్టస్) ఆకుల్ని రెండు గ్లాసుల నీళ్లల్లో పోసి అవి మరిగి ఒక గ్లాసు అయ్యేదాకా మరగబెట్టాలి. అనంతరం ఆ నీటిని వడగట్టి అందులో కొంచెం పంచదార కలిపి, రోజుకు మూడుసార్లు తాగితే దగ్గు, జలుబు తగ్గుతాయి.

సినిమా

కథ మళ్లీ కలిపింది


● మణిరత్నం


● కమల్


● శంకర్

ఒక హీరో-ఒక డైరెక్టర్ ఒక హిట్ సినిమా ఇస్తే.. వారిది 'హిట్ కాంబో' అవుతుంది. అందుకే ఆ కాంబినేషన్‌లో రెండో సినిమా రావాలని ఫ్యాన్స్ కోరుకుంటారు. తమ కాంబో రిపీట్ అవ్వాలని హీరో-డైరెక్టర్‌కి కూడా ఉంటుంది. కానీ కథ కుదరాలి. అలా కొందరు హీరో-దర్శకులను మళ్లీ కథ కలిపింది. రెండోసారి రిపీట్ అవుతున్న ఆ కాంబినేషన్ గురించి తెలుసుకుందాం.


● ఎన్టీఆర్



కొరటాల శివ

దశాబ్దాల తర్వాత

హీరోగా కమల్‌హాసన్, దర్శకుడిగా మణిరత్నంలది ఇండస్ట్రీలో సుదీర్ఘ ప్రయాణం. కానీ కమల్‌హాసన్, మణిరత్నంల కాంబినేషన్‌లో ఇప్పటి వరకూ వచ్చిన చిత్రం ఒక్కటే. అదే 'నాయకన్' (తెలుగులో 'నాయకుడు'-1987). అప్పట్లో బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. అయితే ఇంతటి బ్లాక్‌బాస్టర్ సక్సెస్ అందుకున్నప్పటికీ కమల్, మణిరత్నంల కాంబినేషన్‌లో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లలేదు. ముప్పైఐదేళ్ల తర్వాత ఇప్పుడు కమల్, మణిరత్నంల కాంబో రిపీట్ కానుంది. మరోవైపు దర్శకుడు శంకర్‌తో ప్రస్తుతం 'ఇండియన్ 2' సినిమా చేస్తున్నారు కమల్‌హాసన్. శంకర్, కమల్ కాంబోలోనే 1996లో రిలీజైన బ్లాక్‌బస్టర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్ ఇది. సో.. కమల్-శంకర్ కాంబో మళ్లీ సెట్ అవ్వడానికి పాతికేళ్ల పైనే పట్టింది అన్నమాట.

దేవర

ఎన్టీఆర్ కెరీర్‌లో ఉన్న సూపర్ హిట్ చిత్రాల్లో 'జనతా గ్యారేజ్' ఒకటి. క్లాస్ టచ్‌తో మాస్ ఎలిమెంట్స్‌ను జోడించి దర్శకుడు కొరటాల శివ ఈ సినిమాను తెరకెక్కించారు. కాగా ఆరేళ్ల తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' సినిమా సెట్స్‌పై ఉంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. విస్మరణకు గురైన భారతదేశ తీర ప్రాంతవాసుల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' విడుదల కానుంది.


● విజయ్,


పరశురామ్

డబుల్ ఇస్మార్ట్


హీరో రామ్‌లోని పవర్‌ఫుల్ మాస్ యాంగిల్‌ని 'ఇస్మార్ట్ శంకర్' (2019)లో వెండితెరపైకి తెచ్చారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ చిత్రం ఇటు రామ్, అటు పూరి జగన్నాథ్ కెరీర్‌లకు ఆ సమయంలో బాగా బూస్టప్ ఇచ్చింది. ఇప్పుడు 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చేయనున్నారు రామ్ అండ్ పూరి. వచ్చే ఏడాది మార్చి 8న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు.


● నితిన్


వెంకీ

ఫ్యామిలీ స్టార్

'గీత గోవిందం' (2018)తో రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరారు హీరో విజయ్ దేవరకొండ. ఈ సినిమాకు పరశురామ్ దర్శకుడు. ఐదేళ్ల తర్వాత విజయ్, పరశురామ్ కాంబోలో సెకండ్ ఫిల్మ్‌గా రూపొందనున్న సినిమా ప్రారంభోత్సవం ఇటీవల జరిగింది. ఇందులో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. కాగా ఈ చిత్రానికి 'ఫ్యామిలీ స్టార్', 'కుటుంబరావు' అనే టైటిల్స్‌ని పరిశీలిస్తున్నారని సమాచారం.


● రామ్


పూరి జగన్నాథ్

అడ్వెంచరస్ డ్రామా

రెండున్నరేళ్ల క్రితం కోవిడ్ సమయంలో విడుదలైన 'భీష్మ' చిత్రాన్ని ఆడియన్స్ ఆదరించారు. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ఇది. ఇప్పుడు నితిన్-వెంకీ కుడుమల రెండోసారి మరో ఫిల్మ్ చేస్తున్నారు. 'భీష్మ' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రష్మికా మందన్నా ఈ చిత్రంలో కూడా హీరోయిన్ పాత్ర చేస్తున్నారు. ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ ఇటీవల మొదలయ్యాయి. అడ్వెంచరస్ ఎంటర్‌టైనర్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది.

రాక్షస రాజు

'నేనే రాజు నేనే మంత్రి' (2017) చిత్రంలో జోగేంద్ర పాత్రలో హీరో రానా కాస్త నెగటివ్ షేడ్స్‌లో మెప్పించారు. అలాంటి కథతో ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు తేజ. అయితే రానా, తేజ కాంబోలో మరో సినిమా కన్ఫార్మ్ కావడానికి ఆరేళ్ల సమయం పట్టింది. రానా, తేజ కాంబినేషన్‌లోని సెకండ్ ఫిల్మ్ 'రాక్షస రాజు' (వర్కింగ్ టైటిల్) షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.



● రానా


తేజ

భైరవ కోనలో...

'టైగర్' (2015) చిత్రం కోసం తొలిసారి చేతులు కలిపారు హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్. ప్రస్తుతం వీరి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'ఊరిపేరు భైరవకోన'. సస్పెన్స్, థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

వీరే కాదు.. మరికొందరు హీరోలు, దర్శకులు తమ కాంబోలో రెండో సినిమా ఇవ్వడానికి రెడీ అవుతున్నారని తెలుస్తోంది.


● సందీప్


ఆనంద్


జపాన్ భాషలో ఆర్ఆర్ఆర్


● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ చిత్రం గత ఏడాది మార్చి 25న విడుదలైన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' తెలుగు వెర్షన్‌ని జపనీస్ సబ్ టైటిల్స్‌తో 2022 అక్టోబరు 21న జపాన్‌లో విడుదల చేశారు. జపాన్ బాక్సాఫీస్ వద్ద రూ. 130 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందీ చిత్రం. ఇంకా అక్కడ ప్రదర్శితమవుతోంది. దీంతో ఈ చిత్రాన్ని జపాన్ భాషలో రిలీజ్ చేస్తున్నట్లుగా శుక్రవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ''జపాన్ సబ్‌టైటిల్స్‌తో కూడిన తెలుగు వెర్షన్ 'ఆర్ఆర్ఆర్' సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమవుతోంది. ఇప్పుడు జూలై 28న ఈ సినిమాను జపాన్ భాషలో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నాం'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది.

మాస్ రత్నమాల

ఊర మాస్ రత్నమాలగా కనిపించనున్నారు అంజలి. శుక్రవారం (జూన్ 16) ఆమె పుట్టినరోజు సందర్భంగా 'వీఎస్ 11' (వర్కింగ్ టైటిల్) సినిమాలో ఆమె చేస్తున్న రత్నమాల పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో రత్నమాలగా అంజలి కనిపించనున్నారు. ఆమె పాత్ర మాస్ ప్రేక్షకులను అలరిస్తుంది. విశ్వక్ సేన్ తొలిసారి ఈ చిత్రంలో క్రూరమైన పాత్రను పోషిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాది, సహనిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి.


● అంజలి

కృత్రిమ మేధస్సుతో...


● రియా, శ్రవణ్

శ్రవణ్ రెడ్డి, రియా కపూర్ జంటగా వాసుదేవ్ పిన్నమరాజు దర్శకత్వంలో కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. దేవాస్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శ్యామ్ దేవభక్తుని నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సుహాస్ కృష్ణ దేవభక్తుని కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు అజయ్ ఘోష్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత కిరణ్ స్క్రిప్ట్ అందించగా, వాసుదేవ్ పిన్నమరాజు దర్శకత్వం వహించారు. ''కృత్రిమ మేధస్సు నేపథ్యంలో భారతదేశపు మొట్టమొదటి సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. ఇందులోని ప్రధాన సన్నివేశాలను వర్చ్యువల్ ప్రొడక్షన్ టెక్నాలజీలో చిత్రీకరించనున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: అఖిల్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ కుమార్ గోపరాజు.

సస్పెన్స్.. థ్రిల్


● వీరు, శ్రీవిష్ణు

వీరు, శ్రీహర్ష హీరోలుగా, కుషీచౌహాన్, నిషా సింగ్ హీరోయిన్లుగా తోట కృష్ణ దర్శకత్వంలో 'చండిక' సినిమా ఆరంభమైంది. కేవీ పాపారావు నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ క్లాప్ కొట్టారు. ''హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు తోట కృష్ణ. ''చండిక'కి నేనే కథ అందించాను'' అన్నారు కేవీ పాపారావు.

నాతో నేను


● శాంతికుమార్, రాజ్ కందుకూరి

సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య రాజీవ్ కనకాల కీలక పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'నాతో నేను'. 'జబర్దస్త్' ఫేమ్ శాంతి కుమార్ తుర్లపాటి దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ – ''ఈ సినిమా పాయింట్ కొత్తగా అనిపించింది. ఈ మధ్యకాలంలో కొత్త లైన్, కొత్త టీమ్ చేసే ప్రతి సినిమా సక్సెస్ అవుతోంది. ఈ టీమ్‌కు అభినందనలు'' అన్నారు. ''దర్శకత్వం వహించడంతో పాటు కథ, మాట, పాటలు నేనే రాసుకుని నిర్మాతల సహకారంతో ఈ సినిమా పూర్తి చేశా'' అన్నారు శాంతి కుమార్. ''త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని నిర్మాత తెలిపారు.

ఆట మొదలైంది


● రాజేష్, ప్రీతి

సిరిపురం రాజేష్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కుట్ర'. (ద గేమ్ స్టార్ట్స్ నవ్) అన్నది ఉపశీర్షిక. ప్రీతి, గీతిక రతన్, ప్రియ దేశ్‌పాల్ హీరోయిన్లు. ఈ చిత్రం ఈ నెల 23న రిలీజవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, టీఎస్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎక్స్ చైర్మన్ ఉప్పాల శ్రీనివాస్ గుప్తా, టీఎస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎక్స్ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ అతిథులుగా హాజరయ్యారు. ''ఇద్దరు మిత్రుల మధ్య సాగే సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు సిరిపురం రాజేష్.

సాక్షి బిజినెస్
శనివారం
17-6-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	467	63,385
నిఫ్టీ ▲	138	18,826

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్‌	13,769	▼	14
డోజోన్స్‌	34,476	▲	68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,643	▲	14
డాక్స్‌	16,358	▲	68
షాంఘై	3,273	▲	20
నికాయ్‌	33,706	▲	221

అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,582	▲	648
బంగారం (99.5 స్వచ్ఛత)	59,343	▲	645
వెండి (కిలో)	72,420	▲	1,358

బుల్‌.. కొత్త రికార్డ్‌!



- సూచీలు ఆల్‌టైమ్‌ గరిష్ట స్థాయిల వద్ద ముగింపు
- బ్యాంకింగ్, ఫైనాన్స్‌ షేర్లలో కొనుగోళ్లు
- ఐటీ, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ
- కలిసొచ్చిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు

ముంబై: దేశీయ స్టాక్‌ మార్కెట్‌ శుక్రవారం సరికొత్త గరిష్టాల వద్ద ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం, రూపాయి బలపడటం తదితర అంశాలు కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ రిలయన్స్‌ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు రెండు శాతం రాణించి సూచీల రికార్డు ముగింపునకు దన్నుగా నిలిచాయి. ఉదయం సెన్సెక్స్‌ 43 పాయింట్ల పెరిగి 62,961 వద్ద, నిఫ్టీ 35 పాయింట్ల లాభంతో 18,723 వద్ద మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాల ప్రభావంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 602 పాయింట్లు బలపడి 63,520 వద్ద, నిఫ్టీ 177 పాయింట్లు దూసుకెళ్లి 18,865 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే వారాంతపు రోజు కావడంతో ఇన్వెస్టర్లు ఆఖర్లో గరిష్ట స్థాయిల వద్ద కొంత లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్‌ 467 పాయింట్ల లాభంతో 63,385 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు సూచీకి జీవితకాల గరిష్ట స్థాయి. అంతకు ముందు సెన్సెక్స్‌కు (గతేడాది డిసెంబర్‌ 1న) జీవితకాల గరిష్ట ముగింపు స్థాయి 63,284గా ఉంది. నిఫ్టీ 138 పాయింట్లు బలపడి 18,826 వద్ద ముగిసింది. ఈ సూచీకి అంతకు ముందు సరికొత్త గరిష్ట ముగింపు 18,812గా ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్, క్యాపిటల్‌ గూడ్స్‌ షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. ఐటీ, ఇంధన, రియల్టీ, టెక్‌ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ క్యాప్‌ ఇండెక్సులు 0.76%, 0.71 శాతం చొప్పున లాభపడ్డాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్‌ 759 పాయింట్లు, నిఫ్టీ 263 పాయింట్లు లాభపడ్డాయి. ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీరేట్ల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చనే సంకేతాల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

నెల గరిష్టానికి రూపాయి

రూపాయి విలువ నెల గరిష్ట స్థాయికి చేరుకుంది. డాలర్‌ మారకంలో 35 పైసలు బలపడి 81.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్‌ ఇండెక్స్‌ వారంలో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. క్రూడాయిల్‌ ధరలు దిగిరావడం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికార్డు స్థాయి ముగింపు అంశాలు రూపాయి ర్యాలీకి సహకరించాయి. ఫారెక్స్‌ మార్కెట్లో రూపాయి ఇంట్రాడేలో 82.02 – 81.86 శ్రేణిలో ట్రేడైంది.

ఆల్‌టైం హై స్థాయికి ఇన్వెస్టర్ల సంపద

సూచీల రికార్డు ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపద సైతం ఇంట్రాడేలో సరికొత్త గరిష్టానికి చేరుకుంది. ట్రేడింగ్‌లో రూ.292.78 లక్షల కోట్లతో జీవితకాల గరిష్టాన్ని తాకింది. ఆఖర్లో లాభాల స్వీకరణ కారణంగా మార్కెట్‌ ముగిసేసరికి ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రూ.292.74 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌ దాదాపు ఒకశాతం ర్యాలీతో ఒక్కరోజే రూ.2.08 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఎల్‌ఈడీ లైటింగ్‌ తయారీ సంస్థ ఐకియో లైటింగ్‌ లిస్టింగ్‌ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.285తో పోలిస్తే 37.19% ప్రీమియంతో రూ.391 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 50% ర్యాలీ చేసి రూ.427 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్‌ ముగిసేసరికి 41.66 శాతం బలపడి రూ.404 వద్ద స్థిరపడింది.
- అమెరికా ప్రైవేట్‌ ఈక్విటీ దిగ్గజం బైన్‌ క్యాపిటల్‌ యాక్సిస్‌ బ్యాంక్‌లో స్వల్పంగా వాటా తగ్గించుకుంది. ఓపెన్‌ మార్కెట్‌ ద్వారా 2.25 కోట్ల ఈక్విటీ షేర్లు(0.7% వాటాకు సమానం) విక్రయించింది. ఈ లావాదేవీ విలువ రూ.2,178 కోట్లుగా ఉంది. ఈ నేపథ్యంలో యాక్సిస్‌ బ్యాంక్‌ షేరు అరశాతం స్వల్ప లాభంతో రూ.981 వద్ద ముగిసింది.

తాజా గోల్డ్‌ బాండ్‌ @ రూ.5,926

సోమవారం నుంచి ఐదు రోజులు విక్రయం



న్యూఢిల్లీ: సావరిన్‌ గోల్డ్‌ బాండ్‌ స్కీమ్‌ 2023–24 తొలి విడత సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. బంగారం జారీ ధరను గ్రాముకు రూ.5,926గా ఆర్థికశాఖ ప్రకటించింది. ఐదు రోజుల పాటు (19–23) స్కీమ్‌ అందుబాటులో ఉంటుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే ప్రకటిత ధరలో గ్రాముకు రూ.50 రిబేట్‌ లభిస్తుంది. అంటే ఆన్‌లైన్‌ ధర గ్రాముకు రూ.5,876గా ఉంటుందన్నమాట. బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునేవారికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదటి ఆరు నెలల్లో రెండుసార్లు– జూన్‌ 19తో పాటు సెప్టెంబర్‌ 11 నుంచి 15వ తేదీ వరకూ కూడా మరో సావరిన్‌ గోల్డ్‌ బాండ్‌ స్కీమ్‌ అందుబాటులో ఉండే సంగతి తెలిసిందే. గోల్డ్‌ బాండ్లు– షెడ్యూల్డ్‌ కమర్షియల్‌ బ్యాంకులు (స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంకులు, పేమెంట్‌ బ్యాంకులు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా), స్టాక్‌ హోల్డింగ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా, క్లియరింగ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా, నిర్దిష్ట పోస్టాఫీసులు, డీమ్యాట్‌ అకౌంట్‌తో గుర్తింపు పొందిన స్టాక్‌ ఎక్సే్ఛంజీల ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఇండియా బులియన్‌ అండ్‌ జువెలర్స్‌ అసోసియేషన్‌ ప్రచురించిన 999 స్వచ్ఛత బంగారం సగటు ధర ఆధారంగా ఎస్‌జీబీ ధరను నిర్ణయిస్తారు.

భారత మార్కెట్లోకి జపాన్‌ 'ముసాషి'

- తొలి దశలో రూ. 70 కోట్ల పెట్టుబడి
- ఎలక్ట్రిక్‌ వాహనాల విడిభాగాల తయారీ

ముంబై: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్‌ విడిభాగాల తయారీ సంస్థ ముసాషి తాజాగా భారత ఎలక్ట్రిక్‌ మొబిలిటీ మార్కెట్లోకి ప్రవేశించింది. భారత్‌ న్యూ ఎనర్జీ కంపెనీ (బీఎన్‌సీ) మోటార్స్‌తో జట్టు కట్టింది. మోటార్, పీసీయూ, గేర్‌ బాక్స్‌తో కూడిన కొత్త ఈవీ యూనిట్లను ఉత్పత్తి చేయనున్నట్లు ముసాషి ఇండియా తెలిపింది. బెంగళూరు ప్లాంటులో అక్టోబర్‌ నుంచి ఈ–యాక్సిల్‌ను తయారు చేయనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన అసెంబ్లీ లైన్‌ కోసం తొలి దశలో రూ. 70 కోట్లు ఇన్వెస్ట్‌ చేయనున్నట్లు వివరించింది.



ముసాషి సైమిత్సు ఇండస్ట్రీస్‌కి ముసాషి ఇండియా అనుబంధ సంస్థగా ఉంది. తమ అనుభవం, అధునాతన సాంకేతికతను భారత ఎలక్ట్రిక్‌ మొబిలిటీ మార్కెట్లోకి తేనున్నట్లు ముసాషి సైమిత్సు సీఈవో (భారత విభాగం) తోషిహిసా ఒత్సుకా తెలిపారు. భారత్‌లో తయారు చేసిన ఈ–యాక్సిల్‌ను ఇతర దేశాలకు కూడా సరఫరా చేయాలని ముసాషి భావిస్తోంది. ఇందుకోసం థాయ్‌లాండ్‌కి చెందిన స్ట్రోమ్, వియత్నాం సంస్థ ఈవీ గో, కెన్యాకు చెందిన ఆర్క్‌ రైడ్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఇండ్‌ఇన్‌ఫ్రావిట్‌ చేతికి రోడ్‌ ప్రాజెక్టులు

- విక్రయించిన బ్రూక్‌ఫీల్డ్‌ అసెట్‌
- డీల్‌ విలువ రూ. 8,200 కోట్లు



ముంబై: బ్రూక్‌ఫీల్డ్‌ అసెట్‌ మేనేజ్‌మెంట్‌ నుంచి నిర్వహణలో ఉన్న నాలుగు రహదారి ప్రాజెక్టులను ఇండ్‌ఇన్‌ఫ్రావిట్‌ ట్రస్ట్‌ సొంతం చేసుకుంది. పూర్తి నగదు రూపేణా జరిగిన డీల్‌ విలువ బిలియన్‌ డాలర్లు(దాదాపు రూ. 8,200 కోట్లు)కాగా.. కొనుగోలును పూర్తి చేసినట్లు ఇండ్‌ఇన్‌ఫ్రావిట్‌ తాజాగా వెల్లడించింది. బ్రూక్‌ఫీల్డ్‌ నిర్వహణలోని బీఐఎఫ్‌ ఇండియా హోల్డింగ్స్, కైనెటిక్‌ హోల్డింగ్స్‌ నుంచి ఐదు ప్రాజెక్టులను చేజిక్కించుకునేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది. అయితే నాలుగు ఆస్తులను మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. జాబితాలో సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై– నాసిక్‌ ఎక్స్‌ప్రెస్‌వే, కోసి బ్రిడ్జి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కంపెనీ చేరాయి. ఇక గోరఖ్‌పూర్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కంపెనీ నియంత్రణ సంస్థల అనుమతులను పొందవలసి ఉండటంతోపాటు.. కొన్ని నిబంధనలు పాటించవలసి ఉన్నట్లు తెలియజేసింది. నిధులను రూపాయలలో కాలావధి రుణం, మార్పిడిరహిత డిబెంచర్లు, కెనడా పెన్షన్‌ ప్లాన్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ బోర్డ్, ఓఎంఈఆర్‌ఎస్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రిఫరెన్షియల్‌ పద్ధతిలో యూనిట్ల జారీ ద్వారా ఏర్పాటు చేసింది. సొంతం చేసుకున్న ప్రాజెక్టులలో మూడు టోల్‌ రోడ్‌ ఆస్తులుకాగా.. ఒక యాన్యుటీ రహదారిగా కంపెనీ తెలియజేసింది. ఇండ్‌ఇన్‌ఫ్రావిట్‌ ట్రస్ట్‌ను ఎల్‌అండ్‌టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డెవలప్‌మెంట్‌ ప్రాజెక్ట్స్‌ ఏర్పాటు చేసింది.

ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల ఆదాయం

- రూ. 50,000 కోట్లపై రుచీ సోయా గురి
- పతంజలి గ్రూప్‌ భారీ లక్ష్యాలు
- పలు కొత్త ప్రొడక్టుల విడుదలకు రెడీ

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం పతంజలి గ్రూప్‌ భారీ లక్ష్యాలపై దృష్టి పెట్టింది. రానున్న ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల ఆదాయం సాధించాలని చూస్తోంది. విభిన్న ఉత్పత్తులతో అన్ని రకాల వినియోగదారులకూ చేరువకావడం ద్వారా రూ. లక్ష కోట్ల టర్నోవర్‌ మైలురాయిని చేరుకోవాలని భావిస్తున్నట్లు పతంజలి గ్రూప్‌ చీఫ్‌ రామ్‌దేవ్‌ తాజాగా పేర్కొన్నారు. ఈ బాటలో లిస్టెడ్‌ కంపెనీ పతంజలి ఫుడ్స్‌(రుచీ సోయా ఇండస్ట్రీస్‌) రూ. 45,000–50,000 కోట్ల టర్నోవర్‌ను అందుకునేందుకు ప్రణాళికలు వేసినట్లు వెల్లడించారు. వెరసి గ్రూప్‌ లక్ష్య సాధనలో పతంజలి ఫుడ్స్‌ కీలకపాత్ర పోషించనున్నట్లు తెలియజేశారు. పోర్ట్‌ఫోలియోలో ప్రీమియం ఉత్పత్తులను జతచేసే వ్యూహంలో భాగంగా పౌష్టికాహారం(న్యూట్రాస్యూటికల్స్‌), హెల్త్‌ బిస్కట్స్, చిరు ధాన్య ఆధార ఉత్పత్తులు, డ్రై ఫ్రూట్స్‌ తదితరాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు.

దేశీయంగా దృష్టి

దేశీ మార్కెట్‌పైనే విశ్వాసముంచిన కంపెనీ ఇక్కడ మల్టీనేషనల్‌ కంపెనీ (విదేశీ దిగ్గజాలు)తో పోటీ పడనున్నట్లు రామ్‌దేవ్‌ తెలియజేశారు. ప్రస్తుతం యూనిలీవర్‌ మినహా.. మిగిలిన అన్ని ఎంఎన్‌సీలనూ అధిగమించినట్లు పేర్కొన్నారు. రెండు దశాబ్దాల క్రితం పతంజలి గ్రూప్‌ రూ. 10,000 కోట్ల టర్నోవర్‌ను అందుకుంటుందని చెప్పినప్పుడు తాము అతిగా అంచనా వేస్తున్నట్లు పలువురు భావించారని ప్రస్తావించారు. ప్రస్తుతం పతంజలి గ్రూప్‌ టర్నోవర్‌ రూ. 45,000 కోట్లను తాకినందుకు గర్వంగా ఉన్నట్లు చెప్పారు.



ఎన్‌ఎస్‌ఈలో పతంజలి ఫుడ్స్‌ షేరు దాదాపు 2 శాతం బలపడి రూ. 1,140 వద్ద ముగిసింది.

అందుబాటు ధరల్లో...

పతంజలి ఆయుర్వేద్‌ ద్వారా అందుబాటు ధరల్లో విభిన్న ప్రొడక్టులను అందిస్తూ వచ్చినట్లు రామ్‌దేవ్‌ పేర్కొన్నారు. ఇకపై ఎగువ మధ్యతరగతిని లక్ష్యంగా పెట్టుకుని పతంజలి ఫుడ్స్‌ ద్వారా ప్రీమియం ఉత్పత్తులకు తెరతీస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయిలోనూ పతంజలి గ్రూప్‌ ఎఫ్‌ఎంసీజీ విభాగంలో విస్తరిస్తున్నట్లు చెప్పారు. 200 దేశాలలో 200 కోట్లమందికి చేరువైనట్లు తెలియజేశారు. దేశీయంగా 70 కోట్లమందిని చేరుకున్న కంపెనీ 100 కోట్లపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం కంపెనీ టర్నోవర్‌ రూ. 31,000 కోట్లకు చేరినట్లు ఈ సందర్భంగా పతంజలి ఫుడ్స్‌ సీఈవో సంజీవ్‌ ఆస్తానా వెల్లడించారు. ఐదేళ్లలో రూ. 50,000 కోట్ల ఆదాయాన్ని అందుకోగలమని అంచనా వేశారు. ప్రీమియం ప్రొడక్టుల నుంచి 10% టర్నోవర్‌ను సాధించనున్నట్లు తెలియజేశారు.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో హుమేరా

అంతర్జాతీయ టెన్నిస్‌ సమాఖ్య (ఐటీఎఫ్‌) మహిళల టోర్నీలో హైదరాబాద్‌ అమ్మాయి హుమేరా బహార్మస్‌ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో క్వార్టర్‌ ఫైనల్లో హుమేరా టాప్‌ సీడ్, ప్రపంచ 447వ ర్యాంకర్‌ హరునా అరకావా (జపాన్‌)పై గెలిచింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 7–6 (7/5)తో నెగ్గిన హుమేరా రెండో సెట్‌లో 3–1తో ఆధిక్యంలో ఉన్న దశలో ఆమె ప్రత్యర్థి గాయం కారణంగా వైదొలిగింది.

సాకేత్‌ ద్వయం పరాజయం

రోత్సె ఓపెన్‌ ఏటీపీ చాలెంజర్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌లో రెండో సీడ్‌ సాకేత్‌ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్‌)... అనిరుధ్‌ చంద్రశేఖర్‌–విజయ్‌ సుందర్‌ ప్రశాంత్‌ (భారత్‌) జోడీల పోరాటం ముగిసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన పురుషుల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్స్‌లో సాకేత్‌–యూకీ 1–6, 4–6తో బ్రాడీ–జానీ ఒమారా (బ్రిటన్‌) చేతిలో... అనిరుధ్‌–ప్రశాంత్‌ 6–7 (4/7), 3–6తో ఫియరెన్లీ–జొనాస్‌ మండే (బ్రిటన్‌) చేతిలో ఓడిపోయారు.

సాత్విక్‌–చిరాగ్‌ సంచలనం

- ప్రపంచ నంబర్‌వన్‌ ర్యాంక్‌ జోడీపై విజయం
- ప్రపంచ నాలుగో ర్యాంకర్‌ను ఓడించిన ప్రణయ్‌
- ఇండోనేసియా ఓపెన్‌ టోర్నీ



చిరాగ్‌ శెట్టి, సాత్విక్‌ సాయిరాజ్‌

జకార్తా: ఈ ఏడాది నిలకడగా రాణిస్తున్న భారత పురుషుల డబుల్స్‌ బ్యాడ్మింటన్‌ జోడీ సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి మరో సంచలన ప్రదర్శన చేసింది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌–1000 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో ఏడో సీడ్‌ సాత్విక్‌–చిరాగ్‌ శెట్టి ద్వయం 21–13, 21–13తో ప్రపంచ నంబర్‌ వన్‌ ర్యాంక్‌ జోడీ, టాప్‌ సీడ్‌ ఫజర్‌ అల్ఫియాన్‌–మొహమ్మద్‌ రియాన్‌ అర్డియాంతో (ఇండోనేసియా)లను బోల్తా కొట్టించింది. 41 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ ఆరంభ దశలో రెండు జోడీలు పాయింట్ల కోసం హోరాహోరీగా పోరాడాయి. అయితే మ్యాచ్‌ కొనసాగుతున్నకొద్దీ సాత్విక్‌–చిరాగ్‌ జోడీ పైచేయి సాధించింది. చివరిసారి 2019లో ఫజర్‌–అర్డియాంతోలతో తలపడిన సాత్విక్‌–చిరాగ్‌ నాడు వరుస గేముల్లో నెగ్గగా...ఈసారీ రెండు గేముల్లోనే గెలిచారు. నేడు జరిగే సెమీఫైనల్లో కాంగ్‌ మిన్‌ హిక్‌–సియో సెంగ్‌ జె (దక్షిణ కొరియా)లతో సాత్విక్‌–చిరాగ్‌ తలపడతారు. ఈ సీజన్‌లో సాత్విక్‌–చిరాగ్‌ స్విస్‌ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించగా... మలేసియా ఓపెన్‌లో సెమీఫైనల్‌ చేరారు.

వరుసగా రెండో ఏడాది...

పురుషుల సింగిల్స్‌ విభాగంలో భారత స్టార్‌ షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత నంబర్‌వన్‌ హెచ్‌ఎస్‌ ప్రణయ్‌ వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్‌ చేరుకోగా... కిడాంబి శ్రీకాంత్‌ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్‌ ప్రణయ్‌ 21–18, 21–16తో ప్రపంచ నాలుగో ర్యాంకర్‌ కొడాయ్‌ నరోకా (జపాన్‌)పై గెలుపొందాడు. గతంలో నరోకాతో ఆడిన నాలుగుసార్లూ ఓడిపోయిన ప్రణయ్‌ ఐదో ప్రయత్నంలో ఈ జపాన్‌ ప్లేయర్‌పై నెగ్గడం విశేషం. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్‌ విక్టర్‌ అక్సెల్‌సన్‌ (డెన్మార్క్‌)తో ప్రణయ్‌ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్‌ 2–5తో వెనుకంజలో ఉన్నాడు. మరో క్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ 22వ ర్యాంకర్‌ శ్రీకాంత్‌ 69 నిమిషాల్లో 14–21, 21–14, 12–21తో ప్రపంచ పదో ర్యాంకర్‌ లీ షి ఫెంగ్‌ (చైనా) చేతిలో ఓడిపోయాడు.



ప్రణయ్‌

స్వర్ణం నెగ్గిన జ్యోతి

జాతీయ అంతర్‌ రాష్ట్ర అథ్లెటిక్స్‌ టోర్నీ



భువనేశ్వర్‌: జాతీయ సీనియర్‌ అంతర్‌రాష్ట్ర అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు ఒక స్వర్ణ పతకం, ఒక కాంస్య పతకం లభించాయి. మహిళల 100 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌ అమ్మాయి జ్యోతి యర్రాజీ విజేతగా నిలువగా... ట్రిపుల్‌ జంప్‌లో మల్లాల అనూష గౌడ్‌ (13.24 మీటర్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 100 మీటర్ల రేసును అందరికంటే వేగంగా 11.46 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. శ్రాబణి నందా (ఒడిశా; 11.59 సెకన్లు) రజతం, హిమశ్రీ రాయ్‌ (హరియాణా; 11.71 సెకన్లు) కాంస్య పతకం సాధించారు. తెలంగాణ అమ్మాయి నిత్య గాంధె (11.79 సెకన్లు) నాలుగో స్థానంలో నిలిచింది. మహిళల హెప్టాథ్లాన్‌ ఈవెంట్‌లో నాలుగు ఈవెంట్లు (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు) ముగిశాక తెలంగాణకు చెందిన అగసార నందిని 3450 పాయింట్లతో టాప్‌ ర్యాంక్‌లో ఉంది. నేడు మిగిలిన మూడు ఈవెంట్లు (లాంగ్‌జంప్, జావెలిన్‌ త్రో, 800 మీటర్లు) పూర్తయ్యాక అత్యధిక పాయింట్లు సాధించిన అథ్లెట్‌ విజేతగా నిలుస్తుంది.



జోష్నా

భారత జట్టుకు నిరాశ

చెన్నై: ప్రపంచకప్‌ స్క్వాష్‌ టీమ్‌ టోర్నమెంట్‌లో భారత జట్టు కథ ముగిసింది. మలేసియా జట్టుతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత్‌ 0–3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో అభయ్‌ సింగ్‌ 4–7, 7–5, 7–1, 1–7, 6–7తో సయ్‌ హంగ్‌ ఓంగ్‌ చేతిలో ఓటమి పాలయ్యాడు. రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 3–7, 3–7, 7–5, 4–7తో ఐరా అజ్మన్‌ చేతిలో పరాజయం చవిచూసింది. మూడో మ్యాచ్‌లో సౌరవ్‌ ఘోషాల్‌ 5–7, 7–2, 6–7, 5–7తో డారెన్‌ ప్రాగసమ్‌ చేతిలో ఓడిపోయాడు. మరో సెమీఫైనల్లో డిఫెండింగ్‌ చాంపియన్‌ ఈజిప్ట్‌ 4–0తో జపాన్‌ను ఓడించి మలేసియాతో టైటిల్‌ పోరుకు సిద్ధమైంది.

ఇంగ్లండ్‌ చాలెంజ్‌!

- మొదటి రోజే ఇన్నింగ్స్‌ డిక్లేర్‌
- తొలి ఇన్నింగ్స్‌లో 393/8
- రూట్‌ అజేయ సెంచరీ
- యాషెస్‌ సిరీస్‌ తొలి టెస్టు

బర్మింగ్‌హామ్‌: టెస్టు క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్న ఇంగ్లండ్‌ జట్టు మరో కొత్త సాహసాన్ని ప్రదర్శించింది. 'బాజ్‌బాల్‌' అంటూ దూకుడైన ఆటను ప్రదర్శిస్తూ వచ్చిన ఆ జట్టు యాషెస్‌ సిరీస్‌లోనూ తమ శైలిని చూపించింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్, టాప్‌ బ్యాటర్‌ ఒకరు అజేయ సెంచరీతో ఇంకా క్రీజ్‌లోనే ఉన్నా మొదటి రోజే ఇన్నింగ్స్‌ను డిక్లేర్‌ చేసి ఆశ్చర్యపర్చింది. ఆస్ట్రేలియాతో శుక్రవారం ప్రారంభమైన మొదటి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్‌ 8 వికెట్ల నష్టానికి 393 పరుగుల వద్ద డిక్లేర్‌ చేసింది. జో రూట్‌ (152 బంతుల్లో 118 నాటౌట్‌; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెరీర్‌లో 30వ సెంచరీతో చెలరేగాడు. జానీ బెయిర్‌స్టో (78 బంతుల్లో 78; 5 ఫోర్లు), జాక్‌ క్రాలీ (73 బంతుల్లో 61; 7 ఫోర్లు) కీలక అర్ధ సెంచరీలు సాధించారు. 'యాషెస్‌'లో రూట్‌కు ఇది నాలుగో సెంచరీ కాగా... 2015 తర్వాత మొదటిది. రూట్, బెయిర్‌స్టో ఆరో వికెట్‌కు 121 పరుగులు జోడించారు. 78 ఓవర్లే ఆడిన ఇంగ్లండ్‌ ఓవర్‌కు 5.03 రన్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. ఆసీస్‌ బౌలర్లలో లయన్‌కు 4 వికెట్లు దక్కాయి. అయితే ఇంగ్లండ్‌ ఆశించినట్లుగా వికెట్‌ మాత్రం దక్కలేదు. 4 ఓవర్లే ఆడిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి వికెట్‌ కోల్పోకుండా 14 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌ డిక్లరేషన్‌ ఎత్తుగడ ఎలాంటి ఫలితాన్నిస్తుందనేది ఇప్పుడే చెప్పలేకపోయినా... ఆస్ట్రేలియా పట్టుదలగా రెండు రోజులు బ్యాటింగ్‌ చేసి భారీ స్కోరు సాధిస్తే మాత్రం ఇంగ్లండ్‌కు ఇబ్బందులు తప్పవు.

బ్రూక్‌ అలా అవుటై...

తొలి రోజు ఆటలో హ్యారీ బ్రూక్‌ ఆశ్చర్యకర రీతిలో అవుటయ్యాడు. లయన్‌ బౌలింగ్‌లో డిఫెన్స్‌ ఆడేందుకు ప్రయత్నించగా బంతి అతని ప్యాడ్‌లను తాకి అనూహ్యంగా పైకి లేచింది. ఫీల్డర్లకు కూడా బంతి ఎటు వెళ్లిందో అర్థం కాలేదు. చేతులు పైకి లేపి క్రీజ్‌లోనే నిలబడిన బ్రూక్‌ కూడా సరిగా గమనించలేదు. అయితే కిందకు వచ్చిన బంతి అతని కాలికి తగిలి ఆపై స్టంప్స్‌ను ఎగరగొట్టింది. దాంతో అతను నిరాశగా వెనుదిరిగాడు. బంతిపై దృష్టి పెట్టకపోవడంతో చివరి క్షణంలో దానిని బ్యాట్‌తో లేదా కాలితో తన్ని స్టంప్స్‌కు తగలకుండా జాగ్రత్త పడే అవకాశం లేకపోయింది.



రూట్‌

నజ్ముల్‌ రెండో సెంచరీ

విజయం దిశగా బంగ్లాదేశ్‌



నజ్ముల్‌ హుస్సేన్‌

మిర్పూర్‌: అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ విజయం దిశగా సాగుతోంది. 662 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్‌ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 11 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 45 పరుగులు సాధించింది. అఫ్గానిస్తాన్‌ విజయానికి మరో 617 పరుగులు అవసరంకాగా, బంగ్లాదేశ్‌ మరో ఎనిమిది వికెట్లు పడగొడితే గెలుస్తుంది. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 134/1తో రెండో ఇన్నింగ్స్‌ కొనసాగించిన బంగ్లాదేశ్‌ 80 ఓవర్లలో 4 వికెట్లకు 425 పరుగులవద్ద డిక్లేర్‌ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన నజ్ముల్‌ హుస్సేన్‌ షాంతో (124; 15 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకం సాధించాడు. తద్వారా ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన రెండో బంగ్లాదేశ్‌ క్రికెటర్‌గా నజ్ముల్‌ గుర్తింపు పొందాడు. గతంలో మోమినుల్‌ హఖ్‌ (2018లో శ్రీలంకపై) ఈ ఘనత సాధించాడు. నజ్ముల్‌కు జతగా మరో బ్యాటర్‌ మోమినుల్‌ హఖ్‌ (121 నాటౌట్‌; 12 ఫోర్లు, 1 సిక్స్‌) కూడా సెంచరీ చేశాడు. కెప్టెన్‌ లిటన్‌ దాస్‌ (66 నాటౌట్‌; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు.

క్లుప్తంగా...

20న జేఈఈ అభ్యర్థులకు ఐఐటీహెచ్‌లో ఓపెన్ డే

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : హైదరాబాద్ ఐఐటీ ఆధ్వర్యంలో ఈనెల 20న జేఈఈ అభ్యర్థుల కోసం ఓపెన్ డే (ఆఫ్‌లైన్), 21న ఆన్‌లైన్‌లోనూ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఐటీలో ఉన్న బీటెక్ కోర్సులు.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటేషనల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఐసీ డిజైన్, టెక్నాలజీ), ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఇంజనీరింగ్ సైన్స్, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ అండ్ మెటలార్జికల్ ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్ అండ్ ఎరోస్పేస్ ఇంజనీరింగ్ కోర్సులపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఏఎన్‌ఎంకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



సాక్షి, అన్నపురెడ్డిపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో 26 ఏళ్లుగా గిరిజనులకు వైద్య సేవలను అందిస్తున్న మద్దుకూరు సబ్ సెంటర్ ఏఎన్‌ఎం తేజావత్ సుశీల జాతీయస్థాయిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట పీహెచ్‌సీ పరిధిలో ఆ సబ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈనెల 22న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే సమావేశంలో సుశీల అవార్డు అందుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎఫ్‌సీఆర్ఐ విద్యార్థినికి కెనడా వర్సిటీ డాక్టోరల్ ఫెలోషిప్

సాక్షి, హైదరాబాద్: ములుగు ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) విద్యార్థిని జి.శ్వేతకు కెనడా లావల్ యూనివర్సిటీలో డాక్టోరల్ ప్రోగ్రామ్ (వుడ్ సైన్స్)లో అడ్మిషన్ లభించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన జి.తిరుపతిరెడ్డి, కవితల కుమార్తె శ్వేత ఎఫ్‌సీఆర్ఐ నుంచి మాస్టర్స్ పూర్తిచేశారు. ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశం లభించడంతో శ్వేతను ఐఎఫ్ఎస్ అధికారిణి ప్రియాంక వర్గీస్ అభినందించారు. ఎఫ్‌సీఆర్ఐ కాలేజీ విద్యార్థులు శ్వేతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

కోరుకున్న కాలేజీ.. కోర్సు

కామర్స్, కంప్యూటర్స్‌కు ఫుల్ డిమాండ్

- ‘దోస్త్’లో 72 శాతం మందికి తొలి ప్రాధాన్యత మేరకే సీట్లు
- 53 వేల మందికి కోరుకున్న సీటు
- బీకాం సీట్ల కోసం లక్షకుపైగా వెబ్ ఆప్షన్లు
- బీఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్స్ వంద శాతం భర్తీ
- 63 కాలేజీలకు ఒక్క ఆప్షన్ కూడా రాలేదు..!
- 25లోగా రిపోర్టు చేయకుంటే సీటు, రిజిస్ట్రేషన్ రద్దు



మీడియాతో మాట్లాడుతున్న లింబాద్రి. చిత్రంలో నవీన్ మిత్తల్, శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్) ద్వారా తొలిదశ డిగ్రీ సీట్ల కేటాయింపు శుక్రవారం పూర్తయింది. మొత్తం 1,05,935 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 78,212 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో 73,226 మందికి సీట్లు కేటాయించారు. 4,992 మంది తక్కువ వెబ్ ఆప్షన్లు ఇవ్వడం వల్ల వారికి సీట్లు కేటాయించలేదు. ఎక్కువ మందికి కోరుకున్న కోర్సులు, కాలేజీల్లోనే సీట్లు వచ్చాయి. 53,032 (72శాతం) మందికి వారు పెట్టుకున్న తొలి ప్రాధాన్యత ప్రకారమే సీట్లు దక్కాయి. ఉన్నత విద్యా మండలిలో జరిగిన సమావేశంలో తొలి దశ సీట్ల కేటాయింపు వివరాలను మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, మండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు.

కామర్స్‌కు ఫుల్ క్రేజ్

దోస్త్‌లో మొత్తం 889 కాలేజీలు పాల్గొన్నాయి. 512 కోర్సులకు మొత్తం 3,56,258 సీట్లు ఉన్నాయి. విద్యార్థులు 3,43,102 ఆప్షన్లు ఇచ్చారు. 63 కాలేజీలకు ఒక్క ఆప్షన్ కూడా రాకపోవడం గమనార్హం. కాగా సీట్లు దక్కిన వారిలో బాలురు 29,107 మంది ఉంటే, బాలికలు 44,119 మంది ఉన్నారు. కామర్స్ కోర్సుకు డిమాండ్ పెరుగుతోందని మరోసారి రుజువైంది. దోస్త్‌లో ఈ కోర్సుకు 1,04,687 ఆప్షన్లు అందాయి. తొలిదశలో 33,251 సీట్లు కేటాయించారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన బీఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్ కోర్సుకూ పోటీ ఎక్కువే ఉంది. ఈ కోర్సు అందుబాటులో ఉన్న 14 కాలేజీల్లో ఒక్కో కాలేజీలో 60 సీట్లు ఉంటే, అన్నీ తొలి దశలోనే భర్తీ అయ్యాయి. బీఎస్సీ (ఆనర్స్) బయోటెక్నాలజీ కోర్సును సిటీ కాలేజీలో ప్రవేశపెట్టారు. ఇక్కడ 60 సీట్లూ తొలి విడతలోనే భర్తీ అయ్యాయి. ఆర్ట్స్‌లో 1771, లైఫ్‌సైన్సెస్‌లో 16,434, ఫిజికల్ సైన్స్‌లో 13,468, డేటా సైన్స్ (ఏఐఎంఎల్)లో 1955, డి ఫార్మసీలో 254, ఇతర కోర్సుల్లో 87 మందికి సీట్లు కేటాయించారు.

30న రెండో దశ కేటాయింపు: మిత్తల్

దోస్త్ ద్వారా తొలి దశలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్ రిపోర్టింగ్ చేయాలని నవీన్ మిత్తల్ తెలిపారు. ఇలా చేయని పక్షాన సీటు మాత్రమే కాకుండా, దోస్త్ రిజిస్ట్రేషన్ కూడా రద్దవుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం స్వల్పంగా ఫీజు ఉంటుందని తెలిపారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినప్పటికీ విద్యార్థులు తదుపరి దశల్లో మెరుగైన బ్రాంచీలో, కాలేజీల్లో సీటు కోసం ప్రయత్నించవచ్చన్నారు. అప్పటివరకు కాలేజీల్లో సర్టిఫికెట్లు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. రెండో దశ సీట్ల కేటాయింపు ఈ నెల 30న ఉంటుందన్నారు. ఈ సారి 83 మంది విద్యార్థులు ఇల్లు కదలకుండానే ఆధార్ అనుసంధానంతో ఓటీపీ ద్వారా దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. జూలై 17 నుంచి డిగ్రీ క్లాసులు ప్రారంభిస్తామని తెలిపారు.

	కాలేజీ	ఇచ్చిన ఆప్షన్లు	సీట్ల కేటాయింపు
ఈ ప్రభుత్వ కాలేజీలకు భారీ డిమాండ్	నిజాం కాలేజీ	35,117	1,057
నిజాం కాలేజీతో పాటు పలు ప్రభుత్వ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపించారు. పలు కాలేజీలకు భారీగా వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.	ప్రభుత్వ సిటీ కాలేజీ	22,802	1,509
	తెలంగాణ మహిళా కాలేజీ	19,600	1,771
	యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్	12,191	730
	యూనివర్సిటీ పీజీ కాలేజ్	11,303	600
	గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, బేగంపేట	10,115	1,404
	గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, ఖైరతాబాద్	8,297	1,340
	ఏవీ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్, కామర్స్	7,646	938
	బాబూ జగ్జీవన్ రామ్ కాలేజీ	7,159	1,042
	ఇందిరా ప్రియదర్శనీ కాలేజీ, నాంపల్లి	6,415	936



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా. చిత్రంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరి

గురుకుల కొలువులకు ఆగస్టు 1-23వరకు పరీక్షలు!

నెల రోజుల్లోగా ఫలితాలు ● గురుకుల బోర్డు ప్రత్యేక కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు ఒకటి నుంచి 23 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) వెల్లడించింది. పరీక్షల వారీగా తేదీల షెడ్యూల్‌ను నేడో, రేపో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు ప్రకటించింది. పరీక్షలకు సరిగ్గా నెలన్నర సమయం ఉన్న నేపథ్యంలో నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్న టీఆర్ఈఐఆర్‌బీ, ఫలితాలపైనా కసరత్తు చేస్తోంది. ఆగస్టు నెలలో పరీక్షలు నిర్వహిస్తుండగా... నెలరోజుల వ్యవధిలో ఫలితాలను విడుదల చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీంతో సెప్టెంబర్‌లోనే గురుకుల కొలువుల ఫలితాలు విడుదల కానున్నాయి. అనంతరం ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాలను కేటగిరీల వారీగా రూపొందించేందుకు వ్యూహాత్మక చర్యలు చేపడుతోంది.

సీబీఆర్టీ పద్ధతితో వేగంగా పరీక్షలు...

గురుకుల కొలువుల అర్హత పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని తొలుత బోర్డు నిర్ణయించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో కొంత గందరగోళం నెలకొన్న నేపథ్యంలో పరీక్షలన్నీ సీబీఆర్టీ(కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పద్ధతిలో ఒక సెషన్‌లో పరీక్షలు నిర్వహించడానికి 40వేల మంది సామర్థ్యం ఉన్న వ్యవస్థ మాత్రమే రాష్ట్రంలో అందుబాటులో ఉంది. అయితే గురుకులాల్లో 9వేల కొలువులకు 2.6లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేటగిరీల వారీగా దరఖాస్తులను పరిశీలిస్తే దాదాపు అన్ని కేటగిరీల్లో 40వేల లోపు దరఖాస్తులు ఉండడంతో సీబీఆర్టీ విధానాన్ని అమలు చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ పద్ధతిలో పరీక్షలు నిర్వహించేందుకు సంబంధిత సంస్థలతో గురుకుల బోర్డు అవగాహన కుదుర్చుకుంది. ఈ పద్ధతిలో నిర్వహణ ఖర్చు, సమయం తక్కువ కావడం గురుకుల బోర్డుకు కలిసొచ్చే అంశం.

వావ్.. ప్లాస్టిక్ బస్టాండ్



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పలపల్లిలో హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై రూ.10 వేల వ్యయంతో సుమారు 1,200 ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో బాటిల్ హబ్ బస్‌షెల్టర్ నిర్మించారు. దీనిని డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్, డీపీఓ జగదీశ్వర్, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లతో ఏర్పాటు చేసిన ఈ బస్‌షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఒక సిమెంట్ బల్ల, పాతటైర్లకు రంగులను పూసి కుర్చీ మాదిరిగా అమర్చారు.

\- కమలాపూర్

ఈ యాప్‌లను నమ్మొద్దు..!

‘మనీహబ్’, ‘లోన్ నౌ’ల నుంచి రుణాలు తీసుకోవద్దు: కేంద్ర హోంశాఖ

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాల్లో ఉన్న వారికి రుణాలిస్తామంటూ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతుండటంతో కేంద్ర హోంశాఖ ఎప్పటికప్పుడు అలాంటి యాప్‌ల వివరాలు వెల్లడిస్తోంది. తాజాగా ‘మనీహబ్’, ‘లోన్ నౌ’ రుణ యాప్‌లను కూడా మోసపూరిత యాప్‌లుగా ప్రకటించింది. ఈ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో రుణాలు తీసుకోవద్దని హెచ్చరించింది. ఈ యాప్‌లను శత్రుదేశాల నుంచి సైబర్ మోసగాళ్లు నడుపుతున్నట్టుగా సమాచారం ఉందని అధికారులు వెల్లడించారు. ఒకవేళ ఇప్పటికే ఈ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని వేధింపులకు గురవుతున్నట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, లేదా cybercrime. gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.